DATE: 08-05-2022 RNI NO : TELTEL/2021/81092 prajamantalu, Jagitial

# ప్రజా మంటలు

తెలుగు జాతీయ దినపత్రిక

ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

సంపుటి(Volume) : 3
సంచిక(Issue) : 34

పేజీలు - 08
వెల: రూ 5/-

prajamantalu.com

ఆదివారం 08 మే, 2022

tPublished From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri,



తెలంగాణను కాంగ్రెస్ ఇవ్వలే
కెసిఆర్ కొట్లాడి తెచ్చిండన్న మంత్రి తలసాని

5లో



కాంగ్రెస్ వరంగల్ డిక్లరేషన్‌ను స్వాగతిస్తున్న : గద్దర్

5లో



# మన యుద్ధం కెసిఆర్.. టిఆర్ఎస్‌తోనే

**మన యుద్ధం ఇక కేసీఆర్‌తోనే**

**వచ్చే ఎన్నికల్లో పోటీ టీఆర్ఎస్‌తోనే**

- కేసీఆర్‌కు ధనబలం ఉన్నా.. ప్రజా బలం లేదు
- తెలంగాణ ఆకాంక్షలను కాలరాసిన కేసీఆర్
- కాంగ్రెస్ కుటుంబ సమస్యలను అంతర్గతంగానే చర్చించాలి
- పత్రికలకు ఎక్కితే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదు
- క్షేత్రస్థాయిలో ప్రజలతో కలసి పనిచేసే వారికే పార్టీ టిక్కెట్లు
- గాంధీభవన్‌లో సభ్యత్వ సమన్వయకర్తలతో రాహుల్ స్పష్టీకరణ
- రెండోరోజూ బిజీగా రాహుల్ పర్యటన
- తెలంగాణ ఉద్యమకారులతో చర్చ
- దామోదరం సంజీవయ్య సమాధి వద్ద నివాళులు
- చంచల్‌గూడ జైలులో ఎన్ఎస్‌యూఐ నేతలకు పరామర్శ

హైదరాబాద్,మే7: మన యుద్ధం కెసిఆర్.. టిఆర్ఎస్‌తోనే అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పునరుద్ఘాటించారు. జనలబలం లేని కెసిఆర్‌కు ధనబలం, అదికార బలం ఉన్నా లాభం లేదని గుర్తించాల న్నారు. అలాగే విభేదాలు పక్కన పెట్టి కలసికట్టుగా యుద్దానికి సన్నద్దం కావాలన్నారు. కాంగ్రెస్‌లో విభేదాలపై అగ్రనేత రాహుల్ దృష్టి సారించారు. పార్టీలో విభేదాలుంటే నాలుగు గోడల మధ్యే చర్చించు కోవాలే తప్ప పత్రికలు ఎక్కకూడదన్నారు. తెలంగాణ పర్యటనలో భాగంగా రెండో రోజు హైదరాబాద్ లోని గాంధీభవన్‌లో సభ్యత్వ సమన్వయకర్తలతో రాహుల్ భేటి అయ్యారు. టీపీసీసీ ప్రత్యేక విస్తృత సమావేశానికి రాహుల్, రేవంత్, భట్టి, కోమటిరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, రేణుకాచౌదరి, గీతారెడ్డి తదితరుల సహా 300 మంది ముఖ్య నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ.. పార్టీలో

- మిగతా 2లో

# రాహుల్ గాంధీ రాజకీయ అజ్ఞాని

## ఏ హోదాలో తెలంగాణకు వచ్చారు

వరంగల్,మే7: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఓ అజ్ఞాని అని మంత్రి కేటీఆర్ విమర్శించారు. రాహుల్ ఏ హోదాలో తెలంగాణకు వచ్చాడో చెప్పాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఔట్‌డేటెడ్ పార్టీ అని, సొంత ప్రధాని తెచ్చిన ఆర్డినెన్స్‌ను గౌరవించలేని వ్యక్తి రాహుల్ అంటూ దుయ్యబట్టారు. రిమోట్ కంట్రోల్ పాలన ఎవ్వరిదని ప్రశ్నించిన కేటీఆర్.. వరంగల్ జిల్లా సంగెం-గీసుకొండ మధ్య నిర్మిస్తున్న మెగా టెక్స్ టైల్ పార్క్ కి మంత్రి కేటీఆర్ భూమి పూజ చేశారు. దీనితో పాటు ఈకో టెక్స్ టైల్ పార్క్ ని ప్రారంభించారు. తర్వాత మిషన్ భగీరథ ట్యాంక్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మట్లాడిన కేటీఆర్.. రాహుల్ కు వడ్లు తెల్వకున్నా వాళ్ళేదో రాసిస్తే..ఆయనొచ్చి చదివిపోయిండన్నారు. మొన్న మహబూబ్ నగర్ లో ఒకాయన. నిన్న వరంగల్ లో ఒకాయన అవగాహన లేకుండా మాట్లాడారన్నారు. పొలిటికల్ టూరిస్టులు వస్తరు.. పోతరన్నారు. వారి



ఏ పార్టీకి తొత్తుగా ఉండాల్సిన ఖర్మ పట్టలేదు

**సోనియా రిమోట్ కంట్రోల్ పాలన చేయలేదా**

- యువరాజుగా చలామణి అవుతున్నదే నీవు
- ఇది టెన్ జన్‌పథ్ కాదు.. తెలంగాణ జనపథం
- వరంగల్ డిక్లరేషన్ పాతచింతకాయ పచ్చడి
- దమ్ముంటే కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో అమలు చేయండి
- కేసీఆర్ నియంత అయితే రేవంత్ లాంటివారు బయట తిరిగేవారా
- వరగంల్లో మీడియా సమావేశంలో నిప్పులు చెరిగిన కేటీఆర్
- వరంగల్‌లో కిటెక్స్ టెక్స్‌టైల్‌కు కేటీఆర్ శంకుస్థాపన

మాటలను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. వాళ్లతో ఊరు కాలదు, పీరి లేవదన్నారు. ప్రజలకు మన ప్రభుత్వం చేసిన పనులు చెబితే చాలన్నారు. మోడీ మస్తు మాటలు మాట్లాడుతాడు. మళ్లీ ఇవాళ పొద్దున్నే గ్యాస్ ధర మళ్లీ పెంచారన్నారు. కైటెక్స్ కంపెనీలో 1600 కోట్ల పెట్టుబడులు పెట్టామని.. 16వేల మందికి ఉపాధి రానుందన్నారు. కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్క్‌లో 20కంపెనీలు వస్తాయ న్నారు. భారతదేశంలోనే ఎక్కడా లేని విధంగా ప్లాస్టిక్ నుంచి బట్టలు తయారు చేసే కంపెనీ ఇక్కడ ఏర్పాటు చేశామన్నారు. పరకాల టీఆర్ఎస్ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిపై రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ప్రశంసల వర్షం కురిపించారు. గీసుకొండ మండలం హవేలీలోని కాకతీయ మెగా టైక్స్‌టైల్ పార్కులో ఏర్పాటు చేస్తున్న కిటెక్స్

- మిగతా 2లో

# సామాన్యులకు మరోమారు కేంద్రం షాక్

- గ్యాస్ సిలిండర్ దర మరో 50 వడ్డింపు
- ధరల పెంపుపై మండిపడ్డ కాంగ్రెస్

5లో



# వైద్యారోగ్య రంగం మరింత పటిష్టం

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో డెలివరీలు పెరగాలి

ప్రభుత్వ దవాఖానాల పనితీరుపై మంత్రి హరీశ్‌రావు సమీక్ష

హైదరాబాద్,మే7: ప్రభుత్వ ఆసుపత్రుల్లో డెలివరీలు పెరగాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్ దవాఖానాల పనితీరుపై మంత్రి శనివారం నెలవారీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గైనకాలజీ, ఆర్థోపెడిక్ సేవలు, ఐపీ, ఓపీ, సీ సెక్షన్లు, వైద్య పరికరాల వినియోగం తదితర అంశాల్లో సాధించిన పురోగతిపై మంత్రి ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ వైద్యారోగ్య రంగాన్ని మరింత పటిష్టం చేయాలని సీఎం కేసీఆర్ లక్ష్యంగా పెట్టుకున్నారని, ఇందులో భాగంగా దవాఖానాలను అన్ని విధాలా బలోపేతం చేస్తున్నారని తెలిపారు. పెద్ద మొత్తంలో నిధులు ఖర్చు చేస్తూ ఏర్పాటు చేస్తున్న వైద్య పరికరాల నిర్వహణకు దేశంలోనే తొలిసారిగా 'బయో మెడికల్ ఎక్విప్‌మెంట్ మెయింటనెన్స్' పేరుతో వైద్య పరికరాల నిర్వహణకు పాలసీని

- మిగతా 5లో



# ప్రపంచస్థాయి ఆలయంగా యాదాద్రి

**చిన్న సమస్యలను భూతద్దంలో చూపే యత్నం**

**భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు**


సౌకర్యాల కల్పనపై అధికారులతో మంత్రి సమీక్ష




హైదరాబాద్,మే7: రాజకీయ లబ్ది కోసం ప్రసిద్ధ పుణ్యక్షేత్రం యాదాద్రిపై విమర్శలు చేయడం సరికాదని దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. చిన్న చిన్న సమస్యలను కూడా భూతద్దంలో చూపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని, పవిత్రమైన ఆలయ ప్రతిష్టను దెబ్బతీసే ప్రయత్నాలు మానుకోవాలని హితవు పలికారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం యాదాద్రి శ్రీ లక్ష్మినర్సింహా స్వామి ఆలయంలో భక్తుల సౌకర్యాల కల్పన, ప్రస్తుతం కొనసాగుతున్న పనులపై శనివారం దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. క్యూ కాంప్లెక్స్‌లో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడటం, వాష్ రూమ్స్‌లో పరిశుభ్రత, కొండ పైన చలువ పందిళ్ళు ఏర్పాటు, మురుగునీటి కాల్వల నిర్వహణ, క్యూ కాంప్లెక్స్‌లో

- మిగతా 5లో

## ప్రజానాడి




**రాహుల్ గాంధీ వరంగల్ పర్యటన వల్ల రాష్ట్రానికి, దేశానికి**

# ఒరిగిందేమీ లేదు

తెలంగాణ వ్యవసాయ విధానం యావత్ దేశానికి ఆదర్శం

రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్



హైదారాబాద్ మే 07 (ప్రజా మంటలు) : కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ వరంగల్ పర్యటన వల్ల రాష్ట్రానికి గాని, దేశానికి గాని ఒరగ పెట్టింది ఏమీ లేదని రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు గతంలోనే డిక్లేర్ చేసి ఇప్పటికే విజయవంతంగా అమలు చేస్తున్న వ్యవసాయ విధానాన్ని రాహుల్ గాంధీ వరంగల్ డిక్లరేషన్ పేరిట ప్రకటించారని, ఇందులో కొత్త దనం ఏమీ లేదని వినోద్ కుమార్ పేర్కొన్నారు.

పైపెచ్చు ఎలాంటి ప్రిపరేషన్ లేకుండా రాష్ట్ర పర్యటనకు వచ్చిన రాహుల్ గాంధీకి రాష్ట్రం పట్ల, రైతుల పట్ల ఉన్న వైఖరి ఏమిటో వరంగల్

- మిగతా 5లో

## కామారెడ్డిలో విషాదం

నిజాంసాగర్ బ్యాక్‌వాటర్‌లో మునిగి ముగ్గురు మృతి

కామారెడ్డి,మే7: జిల్లాలోని ఎల్లారెడ్డి మండలం మాలన్‌ఖేడ్‌లో విషాదం చోటుచేసుకుంది. నిజాంసాగర్ బ్యాక్ వాటర్‌లో పడి

- మిగతా 5లో



# అక్షరాస్యతను వందశాతం పెంచుదాం

రూ.7,300 కోట్లతో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి

ఒక్కో స్టూడెంట్‌పై రూ.1.20లక్షలు ఖర్చు చేస్తున్నాం

విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

నాగర్‌కర్నూల్,మే7: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను రూ. 7,300 కోట్లతో మన ఊరు- మన బడి' పథకం కింద అభివృద్ధి చేస్తున్నట్లు విద్యాశాఖ మంత్రి

- మిగతా 2లో

# మన యుద్ధం కెసిఆర్.. టిఆర్ఎస్‌తోనే

మొదటిపేజీ తరువాయి..

పనిచేసే వారికి తప్పనిసరిగా ప్రతిఫలం ఉంటుందన్నారు. ఎంత సీనియ్లుంల్గ÷నా ఎంత రాజకీయ చరిత్ర ఉన్నవారికైనా ఇది వర్తిస్తుందన్నారు. క్షేత్రస్థాయి ఫీడ్ బ్యాక్ తీసుకొని టికెట్లు ఇస్తామన్నారు. కుటుంబంలోని వ్యక్తుల మధ్య భిన్నాభిప్రాయాలు ఉండటం సహజమన్న రాహుల్... తాను ప్రతి ఒక్కరి అభిప్రాయాలు, ఆలోచనలు వింటానని తెలిపారు. ఏదైనా ఉంటే నాలుగు గోడల మధ్య మాట్లాడుకుందాం కానీ.. మీడియా ముందు మాత్రం చెప్పొద్దని వెల్లడించారు. నేతలందరి కృషి వల్ల వరంగల్ సభ దిగ్విజయం అయ్యిందన్నారు. అందరికీ కృతజ్ఞతలు చెప్పారు. కాంగ్రెస్‌పై గౌరవమున్న కార్యకర్తలు కోట్ల మంది ఉన్నారని పేర్కొన్నారు.

ఇదే సందర్భంలో కెసిఆర్‌తో నే తమ యుద్ధమని కూడా ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో తమ పోరు టిఆర్ఎస్‌తోనే అని అన్నారు. తెలంగాణ వచ్చాక బాగుపడింది కేసీఆర్ కుటుంబమేనని రాహుల్ గాంధీ మరోమారు మండిపడ్డారు. కాంగ్రెస్‌కు ఎవరితోనూ పొత్తు ఉండదని కూడా స్పష్టం చేశారు. కేసీఆర్ వద్ద ధనం, అధికార బలం, పోలీసులు ఉన్నారు కానీ, జనబలం లేదని విమర్శించారు. ప్రజల కంటే మించిన శక్తి ఇంకొకటి ఏదీ ఉండదన్నారు.. వచ్చే ఎన్నికల్లో టీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య భీకర పోరాటం ఉండబోతుందని తెలిపారు.

హైదరాబాద్‌లో కూర్చుంటే టికెట్లు రావని, ప్రజలతో ఉండి పనిచేసే వారికే టికెట్లు ఇస్తామని తెలిపారు. కాంగ్రెస్ బలోపేతం, ఎన్నికల సంసిద్ధతపై రాహుల్ దిశా నిర్దేశం చేశారు. వరగంల్ డిక్లరేషన్ తెలంగాణలోని ప్రతి రైతుకు చేరాలన్నారు. ఆ తర్వాత నన్ను ఎవరూ తప్పు పట్టొద్దు. టికెట్ వస్తుందన్న భ్రమలో ఎవరూ ఉండొద్దు. మన ముందు రెండు మూడు లక్ష్యాలు ఉన్నాయి. తెలంగాణ ప్రజల కలల్ని నిజం చేయడం మన లక్ష్యం. ఈ లక్ష్యాలు సాధించాలంటే మన పార్టీలో ఐకమత్యం అవసరం. వరంగల్ డిక్లరేషన్ రైతులకు కాంగ్రెస్‌కు మధ్య నమ్మకం కలిగించాలన్నారు. దాన్ని ప్రజల్లోకి విస్తృతంగా

సమావేశమయ్యారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పుంజుకోకపోవటానికి కారణాలేంటని.. అడిగి అభిప్రాయాలు తెలుసుకున్నారు. అనంతరం.. చంచల్‌గూడ జైల్‌లో ఉన్న ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలతో ములాఖాత్ అయ్యారు.

రాష్ట్ర పర్యటనలో భాగంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రెండో రోజు తీరిక లేకుండా గడిపారు. ఉదయం 10 గంటలకు పలువురు మీడియా అధిపతులతో రాహుల్ సమావేశమయ్యారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితిని మీడియాధిపతులను అడిగి తెలుసుకున్న రాహుల్.. పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై సలహాలు, సూచనలు స్వీకరించారు. అనంతరం తెలంగాణ ఉద్యమకారులతో సమావేశమయ్యారు. ఈ సమావేశానికి ప్రజా గాయకుడు గద్దర్, హరగోపాల్, కంచె ఐలయ్య హాజరయ్యారు. రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దశాబ్దాల కలను సాకారం చేసిన కాంగ్రెస్ పార్టీని తెలంగాణ ప్రజలు ఎందుకు ఆదరించడంలేదని ఉద్యమ నేతలను రాహుల్ అడిగినట్లు తెలుస్తోంది. అనంతరం తాజ్ కృష్ణ హోటల్ నుంచి సంజీవయ్య పార్కుకు వెళ్లి మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య సమాధి వద్ద నివాళులు అర్పించారు. పార్కులో ఏర్పాటు చేసిన శిభిరంలో కాంగ్రెస్ నేతలతో కాసేపు కూర్చున్నారు. ఈ నేపథ్యంలో పార్కు వద్దకు భారీగా కాంగ్రెస్ శ్రేణులు చేరుకున్నాయి. పార్కులోకి వెళ్లేందుకు కార్యక్రర్తలు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది...అక్కడి నుంచి చంచల్ గూడ జైలుకు వెళ్లిన రాహుల్ రిమాండ్‌లో ఉన్న ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలతో ములాఖాత్ అయ్యారు. రాహుల్‌తో పాటు సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ములాఖాత్‌లో పాల్గొన్నారు. జైల్లో రిమాండ్‌లో ఉన్న బల్మూరి వెంకట్‌తో పాటు మరికొందరు కార్యకర్తలతో మాట్లాడిన రాహుల్?.. వారికి ధైర్యం చెప్పారు.



తీసుకెళ్లాలి. అది అందరికీ అర్థమయ్యేలా వివరించాలి. వచ్చే నెల రోజుల్లో ఈ పని పూర్తి చేయాలి. మీడియా ముందు ఏది పడితే అది మట్లాడొద్దు. ఏదైనా ఉంటే అంతర్గత సమావేశాల్లో మాట్లాడండి. మీడియాకు ఎక్కితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. తెలంగాణను ఒక ఆదర్శంగా రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని తెలిపారు.

వచ్చే ఎన్నికల్లో తెరాస, కాంగ్రెస్ మధ్యే యుద్ధమని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. కాంగ్రెస్ ఏర్పాటు చేసేది నిరంకుశ ప్రభుత్వం కాదని స్పష్టం చేశారు. మెరిట్ ఆధారంగానే వచ్చే ఎన్నికల్లో టికెట్ ఇస్తామని తెలిపారు. ప్రజలు, రైతుల పక్షాన పోరాటం చేసేవారికే టికెట్ ఇస్తామని చెప్పారు. సీనియర్లు అయినా సరే పార్టీ కోసం పనిచేయకుంటే టికెట్ రాదు. వ్యక్తిగతంగా ఒక్కొక్కరి గురించి సర్వే చేసి టికెట్లు కేటాయిస్తాం. వరంగల్ డిక్లరేషన్ గురించి ప్రతి వ్యక్తికి, ప్రతి రైతుకు తెలియజేయండి. వరంగల్ డిక్లరేషన్ గురించి చిన్నపిల్లలకు కూడా తెలియాలి. వరంగల్‌లో చెప్పింది డిక్లరేషన్ మాత్రమే కాదు.. ప్రజలు, కాంగ్రెస్ ప్రభుత్వం మధ్య ఒప్పందం అని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. రాష్ట్రంలో 8 ఏళ్లుగా అరాచక పాలన కొనసాగుతోంది. రాష్ట్ర సంపదనంతా ఒక కుటుంబం దోచుకుంటోంది. విద్యం, వైద్యం, ఉపాధి రంగాల్లో ప్రజలకు న్యాయం జరగలేదు. కేసీఆర్ కుటుంబం నుంచి తెలంగాణను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. తెరాసకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో యువత కదిలిరావాలి. ఎన్నో ఆశయాలతో సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారు. ఇన్నేళ్లలో ప్రజలు, సోనియాగాంధీ అనుకున్నది రాష్ట్రంలో జరగలేదు. అందరి ఆకాంక్షలు నెరవేరాలంటే తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి రావాలని రాహుల్ గాంధీ అన్నారు. హైదరాబాద్‌లో కూర్చుంటే... దిల్లీ చుట్టూ తిరిగితే టికెట్లు రావని కాంగ్రెస్ నేతలకు రాహుల్ వార్నింగ్ ఇచ్చారు. తనకు హైదరాబాద్ బిర్యానీ, ఛాయ్ ఎంత బాగుంటుందో తెలుసని చెప్పిన రాహుల్... టికెట్ దక్కాలంటే హైదరాబాద్‌ను వదిలి గ్రామాల్లోకి వెళ్లాలని సూచించారు. వెనుక డోర్ నుంచి టికెట్ తెచ్చుకుంటామనుకునే వాళ్లు ఆశలు వదులుకోవాలని వివరించారు. ప్రజల కంటే మించిన శక్తి ఇంకొకటి ఏదీ ఉండదని, వచ్చే ఎన్నికల్లో టీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య భీకర పోరాటం ఉండ బోతుందని ఆయన వెల్లడించారు. అంతేకాకుండా మరోసారి.. పార్టీలో పనిచేసే వారికి తప్పనిసరిగా ప్రతిఫలం ఉంటుందని, ఎంత సీనిర్లకైనా ఎంత రాజకీయ చరిత్ర ఉన్నవారికైనా ఇది వర్తిస్తుందని రాహుల్ కాంగ్రెస్ నేతలకు తెలిపారు. టీపీసీసీ ప్రత్యేక విస్తృత సమావేశానికి రాహుల్, రేవంత్, భట్టి, కోమటిరెడ్డి, ఉత్తమ్ సహా 300 మంది ముఖ్య నేతలు హాజరయ్యారు. అనంతరం ఆయన సచివాలయం ఎదురుగా నిర్మిస్తున్న అమరవీరుల స్థూపాన్ని సందర్శించారు. రేవంత్ తదితరులు వెంట ఉన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రాష్ట్రంలో రెండో రోజు పర్యటన బిజిబిజీగా సాగింది. పలువురు మీడియా అధిపతులు, ఉద్యమకారులతో ఉదయం

అధైర్యపడకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలని సూచించారు. కష్టపడి పనిచేస్తుంటే పార్టీ అండగా ఉంటుందని భరోసా వారికి కల్పించారు. ఎన్ఎస్‌యూఐ నేతలను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పరామర్శించారు. ఎన్ఎస్ఎయూఐ అధ్యక్షుడు బల్మూరి వెంకట్ సహా 17మంది నేతలను పరామర్శించారు. రాహుల్ వెంట మాణిక్క ఠాగూర్, రేవంత్, ఉత్తమ్, భట్టి విక్రమార్క కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తదితరులు జైలు వరకు ఉన్నారు. అయితే జైలులోకి కేవలం రాహుల్, భట్టిలను మాత్రమే అనుమతించారు. రాహుల్ రాకతో.. చంచల్ గూడ జైలు దగ్గర పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. నేతలను కలిసి వారితో తాజా పరిణామాలను చర్చించారు. వారిని ఎందుకు అరెస్ట్ చేయాల్సి వచ్చిందో వివరించారు. అయితే రాహుల్ చంచల్ గూడ పర్యటనపై కొనసాగుతున్న సస్పెన్స్ వీడింది. చంచల్ గూడ్ జైలులో ఉన్న ఎన్ఎస్‌యూ నేతలను పరామర్శించేందుకు రాహుల్ గాంధీకి అనుమతి లభించింది. రాహుల్ గాంధీతో పాటు మరొక్కరికి మాత్రమే ఎన్ఎస్‌యూఐ నేతలను పరామర్శించేందుకు జైళ్ల శాఖ అనుమతించింది. ఈ విషయాన్ని జైళ్ల శాఖ డీజీ జితేందర్ అధికారికంగా ధ్రువీకరించారు. అయితే, చివరి నిమిషంలో ములాఖత్‌కు అనుమతివ్వడాన్ని కాంగ్రెస్ సీనియర్ నేత పొన్నాల తదితరులు తప్పుబట్టారు. ఇప్పటికిప్పుడు అనుమతి అంటే ఎలా ప్లాన్ చేసుకుంటారని ప్రశ్నించారు. తర్వాత గాంధీ భవన్ చేరుకున్నారు. అంతకు ముందు నెక్లస్ రోడ్డులోని సంజీవయ్య పార్కులో.. మాజీ సీఎం దామోదరం సంజీవయ్యకు రాహుల్ గాంధీ నివాళులర్పించారు. పార్టీ నేతలతో కలిసి హోటల్ తాజ్ కృష్ణ నుంచి సంజీవయ్య పార్కు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. రెండ్రోజుల పర్యటనలో భాగంగా తెలంగాణకు వచ్చిన రాహుల్.. నిన్న వరంగల్ సభలో పాల్గొన్నారు. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను పరామర్శించారు. రైతు డిక్లరేషన్ ను ప్రకటించి.. తెలంగాణ ప్రజలను మోసం చేసిన వ్యక్తితో పొత్తుల ఉండబోవని స్పష్టం చేశారు. వరంగల్ నుంచి రాత్రి హైదరాబాద్ చేరుకున్న రాహుల్ తాజ్ కృష్ణా హోటల్ లో బస చేశారు. ఉదయం హోటల్ తాజ్ కృష్ణాలో ఉద్యమ నేతలతో భేటీ అయ్యారు.

కవి,గాయకుడు గద్దర్, గాదె ఇన్నయ్య, ప్రొఫెసర్. పురుషోత్తమ్ రెడ్డి, జహీర్ అలీ ఖాన్, చెరుకు సుధాకర్, అడ్వకేట్ జేఏసీ వెంకట్ యాదవ్, ప్రొఫెసర్ జానయ్య, కంచె అయిలయ్య, మురళీ మనోహర్, ప్రొఫెసర్ హరగోపాల్ రాహుల్ గాంధీతో సమావేశానికి హాజరయ్యారు. బెల్లయ్య నాయక్, వరంగల్ రవి కోఆర్డినేటర్లుగా వ్యవహరించారు. రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు, ప్రజా ఉద్యమాలు, సమస్యలపై ఉద్యమ నేతలతో చర్చించారు. హైదరాబాద్ పర్యటనలో భాగంగా తెలంగాణ ఉద్యమకారులతో రాహుల్ సమావేశం నిర్వహించారు. గద్దర్, ప్రొఫెసర్ కంచె ఐలయ్య, ప్రొఫెసర్ హరగోపాల్ లాంటి నేతలు ఆయన్ను కలిసి ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న పరిస్థితులను వివరించారు

## నేడు బస్సుల్లో తల్లులకు ఉచిత ప్రయాణం

హైదరాబాద్,మే7: మాతృదినోత్సవం సందర్భంగా 8న ఐదేళ్ల లోపు పిల్లలతో కలిసి ప్రయాణించే తల్లులకు బస్సుల్లో ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పిస్తున్నట్లు టీఎస్‌ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్ తెలిపారు. ఆర్టీసీ కల్పిస్తున్న ఉచిత ప్రయాణ అవకాశాన్ని తల్లులంతా సద్వినియోగం చేసుకోవాలని వారు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో సూచించారు. పల్లె వెలుగు నుంచి ఏసీ సర్వీసుల వరకు అన్ని బస్సులలో ఈ ఉచిత ప్రయాణాన్ని కొనసాగించవచ్చని వారు తెలిపారు.

# రాహుల్ గాంధీ రాజకీయ అజ్ఞాని

మొదటిపేజీ తరువాయి..

టెక్స్‌టైల్ పరిశ్రమకు భూమిపూజ చేసిన సందర్భంగా కేటీఆర్ ప్రసంగించారు. పత్తి పండించే రైతులు మన వద్ద లక్షల సంఖ్యలో ఉన్నారని కేటీఆర్ తెలిపారు. మన పత్తి అత్యుత్తమ క్వాలిటీ కలిగిన పత్తి అని వస్త్ర వ్యాపార రంగానికి చెందిన పరిశ్రమల పెద్దలు చెప్పారు. తమిళనాడు, గుజరాత్, ఆంధ్రాలో పండిన పత్తి కంటే మన పత్తి బాగుందని చెప్పారు. వేల సంఖ్యలో ఉ

వారిని తెలంగాణకు ఆకర్షించడానికి ఎంతో ప్రయత్నం చేసి తీసుకొచ్చాం. మీరు ఇక్కడ పెడితేనే వరంగల్ బిడ్డలకు న్యాయం జరుగుతుందని చెప్పి కిటెక్స్ సంస్థను ఏర్పాటు చేస్తున్నాం. రూ. 1600 కోట్ల పెట్టుబడులు పెట్టబోతోంది. 15 వేల మందికి ఉద్యోగాలు రాబోతున్నాయని తెలిపారు. కొరియాకు చెందిన యంగ్ వన్ అనే కంపెనీ రూ. 1100 కోట్లతో



ద్యోగాలు సృష్టించేందుకు ఈ పార్కు ఏర్పాటు చేశామన్నారు. కేరళకు చెందిన ఈ పార్కు వరంగల్‌కు రావడానికి ప్రధాన కారణం సీఎం కేసీఆర్, చల్లా ధర్మారెడ్డినే. వేరే ఎమ్మెల్యేలతో కాకపోయేది ఇది.. చల్లా ధర్మారెడ్డి కాబట్టి పట్టుబట్టి సాధించాడని కేటీఆర్ స్పష్టం చేశారు. ÷-వాతిముత్యం సినిమాలో కమల్ హాసన్‌కు ఒకాయన ఉద్యోగం ఇస్తానని చెప్తాడు. ఇక తెల్లారి ఆయన పండ్లు తోముతుంటే అక్కడ ప్రత్యక్షమవుతాడు. బాత్రూంలోకి వెళ్లి బయటకు రాగానే.. అక్కడుంటడు. ఏమైంది సార్ నా ఉద్యోగమని అడుగుతడు. టిఫిన్ చేయడానికి పోతే మళ్లీ అక్కడ కనిపిస్తడు. ధర్మారెడ్డి సేమ్ టు సేమ్. ఒక పనిని పట్టుకున్నడంటే దాన్ని సాధించేదాకా వదలడు. మంత్రులందర్నీ పరేషాన్ పరేషాన్ చేస్తడు. పరకాల నియోజకవర్గానికి సంబంధించిన ఏ పనినైనా పట్టువదలని విక్రమార్కుడిలా సాధించే నాయకుడు మీకు ఉండడం అదృష్టమని కేటీఆర్ అన్నారు. పరకాల కోసం, ఇక్కడి ప్రజల కోసం ప్రతి క్షణం పరితపిస్తుంటాడు అని కేటీఆర్ ప్రశంసల వర్షం కురిపించారు. కేసీఆర్ ఆలోచన ఒక్కటే.. మన పిల్లలు బాగుండాలి, భవిష్యత్ తరం బాగుండాలి.. వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలి. మన రైతులు బాగుండాలి. మన మహిళలు బాగుండాలనేదే కేసీఆర్ తపన అని కేటీఆర్ తెలిపారు. ప్రగతి పథంలో దూసుకెళ్తున్న రాష్ట్రాన్ని మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లాలని కేసీఆర్ తాపత్రాయపడుతున్నారని పేర్కొన్నారు. మనం మంచి పనులు చేసుకుంటూ ముందుకు వెళ్తున్నాం. మన పిల్లలకు ఉద్యోగాల కోసం.. టెక్స్ టైల్ పార్కు, ఫార్మాస్యూటికల్ పార్క్, మెడికల్ డివైజెస్ పార్కు, ఆసియా ఖండంలోనే అతి పెద్దదైన లైఫ్ సైన్సెస్ జీనోమ్ క్లస్టర్ ను ఏర్పాటు చేసుకుంటున్నామని కేటీఆర్ తెలిపారు. కానీ ప్రతిపక్షాలు, పొలిటికల్ టూరిస్టులు వస్తరు పోతరు. వారి గురించి పట్టించుకోవద్దన్నారు. రాష్ట్ర అభివృద్ధికి తోడ్పాటునందిస్తున్న ప్రాజెక్టులకు భూములిచ్చిన రైతులందరికీ పాదాభివందనాలు చేస్తున్నానని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. కిటెక్స్ టెక్స్ టైల్స్ పరిశ్రమతో పరకాల నియోజకవర్గంలోని వేలాది మందికి ఉపాధి అవకాశాలు రాబోతున్నాయని తెలిపారు. రైతులు కష్టమైనా, నష్టమైనా ఓర్చుకొని ఇబ్బందైనా తట్టుకొని భూములు ఇచ్చిన వారందరికీ పేరుపేరునా పాదాభివందనాలు చేస్తున్నాను. ఎందుకంటే చిన్న త్యాగం కాదు. ప్రాజెక్టులకు భూములు ఇచ్చే రైతుల త్యాగాలు వెలకట్టలేనివి. వాళ్లకు మనం ఎంత చేసినా తక్కువనే. రుణం తీరదు. కొంత మంది నష్టపోతే చాలా మందికి లాభం జరుగుతుదని ఆలోచన చేసి, పెద్ద మనసుతో భూములు ఇస్తున్నారు. భూములు ఇచ్చిన రైతులందరికీ 100 గజాల చొప్పున ప్లాట్లు ఇవ్వాలని చెప్పారు. కచ్చితంగా ఇస్తామని మాటిస్తున్నానని కేటీఆర్ స్పష్టం చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పారిశ్రామికీకరణ వేగంగా జరగాలన్నారు. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద సంస్థ పిల్లల దుస్తులు తయారు చేసే సంస్థ కిటెక్స్ అని చెప్పారు. ఈ పరిశ్రమ నుంచి ఉత్పత్తి చేసిన బట్టలను దేశవిదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. కిటెక్స్ సంస్థ రూ. 3 వేల కోట్లు పెట్టుబడులు పెట్టాలని ఆలోచన చేసినప్పుడు

పెట్టుబడులు పెట్టబోతున్నారు. 12 వేల మందికి ఉద్యోగాలు కల్పించనున్నారు. ఈ రెండు కంపెనీలు కూడా 8 నుంచి 11 ఫ్యాక్టరీలు పెట్టబోతున్నారు. రాబోయే 18 నెలల్లో పనులన్నీ పూర్తవుతాయి. భారతదేశంలో ఇలాంటి టెక్స్ టైల్స్ పార్కు ఎక్కడా లేదని కేటీఆర్ స్పష్టం చేశారు. మమ్మీ చేతిలో రిమోట్ ఉంటే, దమ్మీ చేతిలో పాలన ఉంటుందని వ్యంగ్యస్త్రాలు సంధించారు. మన్మోహన్ సింగ్‌ను రిమోట్ పాలించింది మీరు కాదా అని నిలదీశారు. కాంగ్రెస్ అంటేనే స్కాం పార్టీ, కాంగ్రెస్ ఆలిండియా అలిగేషన్ పార్టీ అంటూ విమర్శలు గుప్పించారు.

ఏ పార్టీకీ బీటీమ్, సీ టీమ్‌గా ఉండాల్సిన ఖర్మ టీఆర్ఎస్‌కు పట్టలేదని కేటీఆర్ స్పష్టం చేశారు. అలాగే కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోవాలని ఎవరు కూడా కోరుకోరని అన్నారు. కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీపై మంత్రి కేటీఆర్ నిప్పులు చెరిగారు. ఇది టెన్ జన్‌పథ్ కాదు.. తెలంగాణ జనపథం అని రాహుల్‌కు కేటీఆర్ చురకలంటించారు. రాహుల్ గాంధీ.. మీరు చెప్పిందల్లా నమ్మడానికి, పరిజ్ఞానం లేని మాటలను విశ్వసించడానికి ఇది టెన్ జన్‌పథ్ కాదు.. ఇది చైతన్యానికి ప్రతీకైన తెలంగాణ జనపథం. ఇక్కడ మీరు ఆడిచ్చినట్టు ఆడటానికి ఎవరూ లేరు. కాంగ్రెస్ నాయకుల్లాగా అవగాహన లేని వారు ఇక్కడ ఎవరూ లేరు. కాంగ్రెస్ పార్టీ గురించి తెలంగాణ ప్రజలకు బాగా తెలుసని కేటీఆర్ పేర్కొన్నారు. వరంగల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. ఎమ్మెల్యేలను కొంటూ పట్టుబడ్డ వ్యక్తిని పక్కన పెట్టుకుని మాట్లాడుతారా అని మండిపడ్డారు. కేసీఆర్ రాజు అయితే అవినీతి పీసీసీ చీఫ్ బయట ఉంటాడా అని ప్రశ్నించాడు. రైతు డిక్లరేషన్ పాత చింతకాయ పచ్చడి లాంటిదని, దమ్ముంటే కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ముందుగా దానిని అమలు చేసి చూపించాలని సవాల్ విసిరారు. జాతీయపార్టీకి జాతీయ విధానం ఉండాలని, కేవలం తెలంగాణకు మా÷-తరమే విధానం ఉండద న్నారు. వడ్ల విషయంలో రాష్ట్ర రైతులకు అన్యాయం జరుగుతుంటే రాహుల్ ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు. టిఆర్ఎస్‌తో 'పొత్తు ఉండదు అంటున్నావు, నీతో పొత్తు పెట్టుకొమ్మని ఎవరడిగారు. జాతీయ పార్టీకి రాష్ట్రానికో డిక్లరేషన్ ఉంటుందా. జాతీయ పార్టీకి జాతీయ విధానం ఉండదా. ప్రజలు 50 ఏళ్ల పాటు దేశాన్ని కాంగ్రెస్ చేతుల్లో పెట్టారు. ఏఐసీసీ అంటే ఆల్ ఇండియా కాంగ్రెస్ క్రైసిస్ కమిటీ. దేశంలోనే అతి తక్కువ ఆత్మహత్యలు గల రాష్ట్రం తెలంగాణ. కాంగ్రెస్ పాలనలో రైతుబంధు లేదు, రైతు ఆత్మహత్యలు లేని గ్రామం లేదు. కాంగ్రెస్ హయాంలో రైతు కష్టానికి విలువ లేదు, రైతులను సంక్షోభంలోకి నెట్టారు. దిక్కుమాలిన దివాళా కోరు కాంగ్రెస్‌ను పాతరవేస్తే తప్ప మనకు ఉపశమనం ఉండదని రాహుల్‌పై నిప్పులు చెరిగారు. కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమాన్ని జోడెద్దుల మాదిరిగా జోడించి అన్ని రంగాల్లో సమ్మిళితమైన అభివృద్ధిని సాధిస్తున్నారని తెలిపారు. భారతదేశంలో ఏ ముఖ్యమంత్రి, ఏ నాయకుడు చేయని విధంగా గత ఏండేండ్లలో అద్వితీయమైన విజయాలు సాధించి, ప్రగతి

పథంలో దూసుకుపోతున్నామని స్పష్టం చేశారు. ఇది మేం చెప్పట్లేదు.. కేంద్రమే చెప్తుందని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణలోని అన్ని డిపార్ట్‌మెంట్లకు కేంద్రం నుంచి అవార్డులు, కితాబులు వస్తున్నాయని చెప్పారు. తమ భావ దారిద్యాన్ని, దివాళా కోరుతనాన్ని, రాజకీయ అజ్ఞానాన్ని, అవగాహన రాహిత్యాన్ని తెలంగాణ ప్రజల ముందు ప్రదర్శించే ప్రయత్నం చేస్తున్నారు. ఆయన ఏ పదవిలో వరంగల్‌కు వచ్చారో మాకు తెలియదని కేటీఆర్ అన్నారు. మమ్మీ గారు అధ్యక్షురాలు.. మరి ఈయన దమ్మీ గారు ఏంటో మాకు తెల్వదు. ఈ దమ్మీ గారు ఎంపీనా, అధ్యక్షుడా మాకు తెల్వదు. ఎప్పుడు ఇండియాలో ఉంటడో.. ఎప్పుడు బయట ఉంటడో మాకు తెల్వదు. ఏ హోదాలో కాంగ్రెస్ పార్టీ అల్లం బెల్లం చేస్తదని డైలాగ్‌లు కొట్టారో కూడా తెలియదని కేటీఆర్ అన్నారు.

తమకు ఒక్క చాన్స్ ఇవ్వాలని రాహుల్ గాంధీ అంటున్నారు.. ఒక్క ఛాన్స్ కాదు.. ఈ దేశంలో కాంగ్రెస్ పార్టీకి పది ఛాన్సులు ఇచ్చారని కేటీఆర్ తెలిపారు. 50 ఏండ్లు ఈ దేశాన్ని మీకే అప్పగించారు. కరెంట్, నీళ్లు ఇవ్వలేని అసమర్థ పార్టీ. రైతుల ఆత్మహత్యలను నివారించలేని అసమర్థ పార్టీ. అవకాశం ఇచ్చినప్పుడు వెలగబెట్టలేదు కానీ ఇప్పుడేదో చేస్తరట అని విమర్శించారు. తెలంగాణలో రిమోట్ కంట్రోల్ పాలన ఉందని రాహుల్ చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ ఘాటుగా స్పందించారు. 2004 నుంచి 2014 వరకు మన్మోహన్ సింగ్ పేరుకు ప్రధాని.. నిర్ణయాలు మాత్రం సోనియావే. రిమోట్ కంట్రోల్ పాలన ఎవరిది? మీ కాంగ్రెస్ పార్టీది కాదా? అని ప్రశ్నించారు. రిమోట్ కంట్రోల్ పాలన చేసింది మీరే.. మీ నాయకురాలే.

నేరపూరితమైన రాజకీయాలను అరికట్టాలని ప్రధాని మన్మోహన్ సింగ్ కేబినెట్‌లో నిర్ణయ తీసుకొని ఒక ఆర్డినెన్స్ తీసుకొచ్చారు. ఆ ఆర్డినెన్స్‌ను చింపేసింది రాహుల్ గాంధీ కాదా? అని కేటీఆర్ ప్రశ్నించారు. బీజేపీకి వత్తాసుగా మాట్లాడితే ఊరుకోను అని రాహుల్ గాంధీ నిన్నటి వరంగల్ సభలో మాట్లాడిండు అని కేటీఆర్ గుర్తు చేస్తూ.. గాంధీ భవన్‌ను గాడ్సేకు అప్పజెప్పావని తీవ్ర విమర్శలు చేశారు. ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని నరనరాన నింపుకున్న వ్యక్తికి అప్పజెప్పావు. నీవు ఏం తెల్వనోనివి. రాసిస్తే చదివి పోయే వ్యక్తివి. అభం శుభం తెలియని అమాయకుడివి అజ్ఞానివి.. అంతకే ఉంటే మంచిదని రాహుల్‌ను కేటీఆర్ హెచ్చరించారు. టీఆర్ఎస్ పార్టీకి బీజేపీతోని సంబంధం ఉందని రాహుల్ చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ మండిపడ్డారు. మాకు ఇతర పార్టీలకు బీ టీమ్, సీ టీమ్ అయ్యే దౌర్భాగ్యం పట్టలేదు. మేం తెలంగాణ ప్రజల కోసం కొట్లాడే టీమ్. తొత్తులుగా ఉండే అవసరం మాకు లేదు. కాంగ్రెస్ పార్టీ పేరే స్కాంగ్రెస్. ఎ టు జడ్ అన్ని కుంభకోణాలే. ఆకాశంలో ఎగిరే అగస్టా హెలికాప్టర్, స్పెక్ట్రమ్ నుంచి మొదలుకుంటే.. పాతాళంలో దొరికే బొగ్గు వరకు అన్ని కుంభకోణాలే అని కేటీఆర్ నిప్పులు చెరిగారు. ఓటుకు నోటు దొంగను పక్కను కూర్చొబెట్టుకొని రాహుల్ అవినీతి గురించి మాట్లాడితే సిగ్గు పోతుందని కేటీఆర్ అన్నారు. ఇదే సీఎం రాజు అయితే.. నీ పీసీసీ అధ్యక్షుడు మాట్లాడే చిల్లర మాటలకు బయటే తిరిగేవాడా? యువరాజు అని నిన్ను పిలుస్తారు. నీ ముత్తాత మోతీ లాల్ నెహ్రూ నుంచి మొదలుపెడితే జవహర్ లాలా నెహ్రూ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, సోనియా గాంధీ, తర్వాత నువ్వు.. రాజరికం మాదిరిగా ఉన్నారు. మీరు ఇక్కడికి వచ్చి రాజులు అని మాట్లాడటం సరికాదన్నారు. ఒక వేళ కేసీఆర్ నియంత అయితే.. పొద్దునే లేస్తే తిట్టుడు ప్రోగ్రామ్ పెట్టుకునే వారు ఇక్కడే ఉండేవారా? ఈ ఆటలు సాగుతాయా? అని ప్రశ్నించారు. కేసీఆర్‌ను క్షమించం అని అంటడు. టీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకోం అని అంటుండు. ఈ దేశంలో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకునే వారు లేరు. అమేథిలోనే గెలవలేవు. నువ్వు తెలంగాణకు వచ్చి పీకి పందిరి వేస్తావా? అని రాహుల్‌ను కేటీఆర్ దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, దాస్యం వినయ్ భాస్కర తదితరులు పాల్గొన్నారు.




## అక్షరాస్యతను వందశాతం పెంచుదాం

మొదటిపేజీ తరువాయి..

వ్యవస్థలో మార్పు కోసం రాష్ట్రంలో వెయ్యి గురుకులాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఒక్కో స్టూడెంట్‌పై రూ. 1.20లక్షలు ఖర్చు చేస్తున్నామని, రాష్ట్రంలో 26వేల స్కూళ్లను ఈ పథకం ద్వారా అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలకు పంపకుండా.. ఇంగ్లీష్ చదువుల కోసం ప్రైవేట్ స్కూళ్లకు పంపిస్తున్నారని, దీన్ని గురించి సీఎం కేసీఆర్ వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు ఆంగ్ల మాధ్యమంలో బోధన జరుగుతుందన్నారు. పిల్లలు, ఉపాధ్యాయులు ఆందోళన పడొద్దన్నారు. తరగతి గదుల్లో కావాల్సిన అన్ని సదుపాయాలను కల్పించడం జరుగుతుందన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో రూ.103కోట్లు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. గుడిలా బడిని పవిత్రంగా చూడాలని, రాష్ట్రంలో ఉన్నత విద్యాసంస్థల్లో అమ్మాయిల సంఖ్య పెరుగుతోందని, ఇంటర్ తర్వాత కెరియర్‌ను ఎంచుకునే స్థాయికి చేరుతారన్నారు. అమ్మాయిలు బాగా చదువుతున్నందుకే మహిళా యూనివర్సిటీని ఏర్పాటు చేశామన్నారు. సీఎం కేసీఆర్ తీసుకుంటున్న చర్యలతో రాబోయే ఐదేళ్లలో తెలంగాణ పిల్లలు ఉన్నత స్థానాల్లో ఉంటారనీ, పది పరీక్షల్లో విద్యార్థులు బాగా రాయాలన్నారు.ద

కలెక్టర్ అధికారులు, పాఠశాలల్లో పనులు పూర్తయ్యేలా చూడాలనీ, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయలాంటి పథకాల మాదిరిగా మన ఊరు-మన బడిని విజయవంతం చేయాలన్నారు.



# రైతు శిక్షణా కార్యక్రమం

**చొప్పదండి మే 07 (ప్రజామంటలు):** మండలములోని రుక్మాపూర్ గ్రామ పంచాయతీ నందు రైతు వేదికలో రైతు శిక్షణా కార్యక్రమం జరిగింది. రైతులకు శిక్షణ ఇవ్వడం వలన నాణ్యమైన దిగుబడితో మంచి పంటలు పండించినవారు అవుతారని ప్రతి రైతుకు ఈ శిక్షణా కార్యక్రమం చాల మేలుచేస్తుందని తెలిపారు. తదంతరం ప్యాక్స్ చైర్మన్ మల్లారెడ్డి ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సంచాలకులు జే. రామారావు, మండల కొ-ఆర్డినేటర్ వెంకట రమణా రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ మల్లారెడ్డి , గ్రామా కొ-ఆర్డినేటర్ రాజయ్య, మండల వ్యవసాయ అధికారి, వంశీ కృష్ణ, బి.టి. యం. స్రవంతి, ఎ.టి.ఎం. ప్రవళిక, ఎ.ఐ.ఓ. ప్రసన్న కుమార్ మరియు రైతులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం మండలంలోని మొత్తం 11 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మరియు డబ్బా, ఇబ్రహీంపట్నం, గోధూర్‌లోని బృహత్ పల్లె ప్రకృతి వనాలను పరిశీలించిన తహసీల్దార్ మహేశ్వర్. వెంట ఆర్.ఐ భూమేశ్, వి.ఆర్.ఎ.లు ఉన్నారు.

# విద్యుత్ భద్రతపై రైతులకు అవగాహన

**జగిత్యాల మే 07 (ప్రజామంటలు):** విద్యుత్ భద్రతా వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఏ.ఆర్. ఫంక్షన్ హాల్ లో శనివారం జరిగిన జగిత్యాల టౌన్ సబ్ డివిజన్ పరధిలో గల విధ్యుత్ ఉద్యోగులు, మరియు రైతులు పాల్గొన్నారు. ఈ సందర్బంగా విద్యుత్




ప్రమాదల నివారణకు తగిన సూచనలు వివరించి మరియు ఏఏ జాగ్రత్తలు తీసుకోవాలో సూచించారు. రైతులు ఎవరు కూడా డిపార్ట్మెంట్ స్టాఫ్ లేనిదీ ట్రాన్స్ఫార్మర్ ముట్టుకోరాదని విధ్యుత్ పనిచేయరాదని మరియు పనిచేటపుడు ఎర్త్ రాడ్ వాడ వలెనని, ఉద్యోగులు పని చేసేటపుడు సెల్ ఫోన్ ఉపయోగించరాదని పేర్కొన్నారు. ఈ సందర్బంగా ఎర్త్ రోడ్స్, గ్లౌజ్ లు పంపిణి చేశారు. ఈ సమావేశంలో జగిత్యాల టౌన్ ఏడిఈ జవహర్లల్ నాయక్, ఏఓ శంకర్, ఏఈలు, అశోక్ రెడ్డి, సత్యనారాయణ, ఎండీ. రహీం, సుందర్, రఘునాథ్, సబ్ ఇంజనీర్లు, రైతు తిరుపతిరెడ్డి, మరియు రైతులు, విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

# జాతీయ మానవ హక్కుల కౌన్సిల్ జిల్లా అధ్యక్షులుగా గంగారాం



జగిత్యాల టౌన్ మే 07 (ప్రజామంటలు): జాతీయ మానవహక్కుల కౌన్సిల్ జగిత్యాల జిల్లా అధ్యక్షులుగా నక్క గంగారాం నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ అధ్యక్షులు సంపత్ కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. బుగ్గారం మండలం చందయ్యపల్లె గ్రామానికి చెందిన నక్క గంగారం సామాజిక సేవ కార్యక్రమాల్లో పాల్గొంటున్నాడని అందులో భాగంగానే ఈ నియామకం చేశారు. తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి గంగారాం కృతజ్ఞతలు తెలిపారు. గంగారాం నియామకం పట్ల చందయ్యపల్లె మాజీ సర్పంచ్ ఎన్నం కిషన్ రెడ్డి, పలువురు గ్రామస్తులు శ్రీనివాస్ రావు, కొండ్ర భీమేష్, మ్యాకల ధర్మయ్య తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

# చండీ యాగంలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ఇఫ్కో డైరెక్టర్ కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి

**తిమ్మాపూర్ మే 07 (ప్రజామంటలు):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల కేంద్రంలో గౌడ కులస్తులు నూతనంగా నిర్మించిన శ్రీ రేణుక ఎల్లమ్మ దేవస్థానంలో రెండవ రోజు నిర్వహిస్తున్న చండీయాగం పూజలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ఇఫ్కో డైరెక్టర్ కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి. వీరితో పాటు టిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు



వడ్ల కొండ అనిల్, దొనపాటి రాజిరెడ్డి, గౌడ సంఘ అధ్యక్షులు గోపగోని తిరుపతి, ఉపాధ్యక్షులు తాళ్ల పెల్లి పర్శరాములు, కోశాధికారి గొట్టిపర్తి రాజేందర్, గౌడ కులస్తులు గోపగోని రాజు, మాచర్ల నరసయ్య, మాచర్ల సంపత్, మాచర్ల ఎల్లయ్య, కొమిరె శీను, గొట్టిపర్తి సంతోష్, ప్రజా ప్రతినిధులు, ఇతరులు పాల్గొన్నారు.



జగిత్యాల వర్తక సంఘంలో జరిగే ఏపీఎం ఓదెల గంగాధర్ రాసిన 'దాగి ఉన్న నిజం' పుస్తక ఆవిష్కరణ కార్యక్రమానికి ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ కలిసి ఆహ్వానించిన పట్టణ మేరు సంఘం అధ్యక్షులు రాపర్తి వినోద్, జిల్లా కార్యదర్శి రామగిరి రమేష్, గట్ల ప్రభాకర్, రాపర్తి గణేష్, గట్ల రమేష్, గట్ల శ్రీనివాస్, వెన్న శేఖర్, మాడిశెట్టి రమేష్

# ఉచిత శిక్షణను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్ రవి

**ధర్మపురి మే 07 (ప్రజామంటలు):** జిల్లాలోని నిరుద్యోగులకు పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గుగులోత్ రవి విద్యార్థులకు సూచించారు. ఎల్.ఎం.కొప్పుల ట్రస్ట్, ఎస్సీ సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గ్రూప్ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న నిరుద్యోగ యువతకు ధర్మపురిలో అందిస్తున్న ఉచిత శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... వివిధ ప్రభుత్వ శాఖలలో ఉన్న ఖాళీలను భర్తీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని, నియామకాలు నోటిఫికేషన్ విడుదల చేస్తుందని కలెక్టర్ తెలిపారు. జగిత్యాల జిల్లాలో పేదల ఉద్యోగార్థులకు నాణ్యమైన శిక్షణ ఉచితంగా అందించేందుకు వివిధ శాఖల



ద్వారా మరియు మంత్రి గారి ప్రత్యేక చొరవ తో ఏర్పాటు చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 16 వేలకు పైగా పోలీస్ ఉద్యోగాల భర్తీకి నోటిఫి కేషన్ విడుదల చేసిందని, జిల్లాలో 250 మంది అర్హులైన నిరుపేదలకు ఎల్.ఎం. కొప్పుల ట్రస్ట్ మరియు ఎస్సి అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఉచిత, ప్రత్యేక తరగతుల శిక్షణ భోజనంతో సహ కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎస్సీ, బిసి, మైనారిటీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో కేవలం ఎస్సీ ఉద్యోగులకు గ్రూప్స్ పరీక్షలు రాయడానికి సన్నద్ధం అయ్యే దిశగా ఫౌండేషన్ కోర్సు (గ్రూప్ 1,2,3,4) ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ లో కూర్చుని కేంద్రాల్లో అందించే స్థాయిలో నాణ్యమైన పూర్తిగా జగిత్యాల జిల్లాలో అర్హులైన పేదలకు ఉచితంగా కల్పిస్తున్నామని అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత శిక్షణ కార్యక్రమాలను యువత సద్వినియోగం చేసుకోవాలని, 3 నెలల పాటు పూర్తి శ్రద్ధతో చదువుపై శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థుల ఆలోచనల్లో కచ్చితత్వం ఉండాలని, ప్రతి పరీక్షకు హాజరయ్యే విధానం కాకుండా, ఒక పరీక్ష ఎంపిక చేసుకొని, దాని సిలబస్ పై అవగాహన చేసుకొని బాగా సన్నద్ధమై పరీక్షకు హాజరు కావాలని కలెక్టర్ సూచించారు. ఇంటి వద్ద చదువుకోడానికి ఇబ్బంది ఉన్న యువత కోసం అవసరమైతే వసతి సౌకర్యం కల్పిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం మనకు అందుబాటులో ఉన్న 6 నెలల నుంచి ఏడాది సమయం చాలా విలువైందని, ఈ సమయాన్ని చాకచక్యంగా వినియోగించుకోవడం భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని, ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తే సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జగిత్యాల ఆర్.డి.ఓ. మాధురి, ఎస్సి వెల్ఫేర్ అధికారి రాజ్ కుమార్, బి.సి. వెల్ఫేర్ అధికారి సాయిబాబా, మున్సిపల్ ఛైర్పర్సన్ సత్తమ్మ, డి.సి.ఎం.ఎస్. చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, తాసిల్దార్ వెంకటేష్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్న ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్

**రాయికల్ మే 07 (ప్రజామంటలు):** రాయికల్ గ్రామాన్ని మున్సిపల్ గా మార్చడం, రోడ్ల నిర్మాణం, సీసీ కెమెరాలు, వైకుంఠ దానం, పట్టణ ప్రకృతి వనం ఇలా అనేక కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని ఎమ్మెల్యే అన్నారు.





పట్టణ అభివృద్ధికి 25 కోట్ల నిధులు మంజూరు చేసి, పట్టణ స్వరూపాన్ని మారుస్తూ అభివృద్ధి చేస్తామని రైతు పక్ష పాత ప్రభుత్వమని, మార్కెట్ ల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, రైతుల కోసం 24 గంటల కరెంటు, పెట్టుబడి సాయం, రైతు భీమా, నీటి వసతి, రుణ మాఫీ వంటి అనేక కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. 2500 మెట్రిక్ టన్నుల గోదాం నిర్మించామని, 50 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి సాహసోపేత నిర్ణయం తీసుకున్నారని 12 వేల కోట్ల రూపాయలు అవసరం అవుతాయని, యాశంగి లో బియ్యం, నూకలు కావడం ద్వారా అదనంగా 2 వేల కోట్ల నష్టం వచ్చే అవకాశం ఉందని అయిన ముఖ్యమంత్రి వరి ధాన్యం కొనుగోలు చేయాలని నిర్ణయించారని అన్నారు. రాయికల్ పట్టణంలో వెజ్ నాన్ వెజ్ మార్కెట్ కోసం 4 కోట్లు సిద్ధంగా ఉన్నాయి అని 25 వేల ఎస్ఎఫ్టి స్థలం అవసరం అవుతుందని స్థలం గుర్తింపు పూర్తి కాగానే త్వరలోనే భూమిపూజ చేస్తామని, అభివృద్ధి నిరోధక నాయకుల పట్ల తస్మాత్ జాగ్రత్త అని,గుడి,ఈద్గా,చెరువు ఇలా అన్ని విషయాల పట్ల వివాదాలు రేపి అభివృద్ధిని అడ్డుకుంటున్నారని అన్నారు. ప్రభుత్వం పథకాలు ప్రజలకు చేరాలనే ప్రజా ప్రతినిదులు ఆకాంక్ష అని అన్నారు. రైతులు యూనిటీగా ఫార్మర్ ప్రొడ్యూస్ కంపెనీ లను ఏర్పాటు చేసి ఉత్పత్తులను అమ్మి లాభాలు పొందాలని, ఆ దిశగా ఆలోచించాలని అన్నారు. దళితుల ఆర్థిక, సామాజిక పరిస్థితుల మార్పు లక్ష్యంగా దళిత బంధు లాంటి గొప్ప కార్యక్రమం చేపట్టడం జరిగింది అని, వైన్స్, కాంట్రాక్ట్ , ఇలా చాలా వాటిలో రిజర్వేషన్ కల్పించారని, కుల సంఘా భవనాలకు నిధులు మంజూరు చేశామని అన్నారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మెన్ మోర హనుమాండ్లు, ఎంపీపీ సంధ్యారాణి సురేందర్ నాయక్, ఏఎంసి ఛైర్మెన్ గన్నె రాజీ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి, ఏఎంసి వైస్ చైర్మన్ కొల్లూరి వేణు, మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు కోల శ్రీనివాస్, ఇంతియాజ్, ప్రధాన కార్యదర్శి తలారి రాజేష్, కో ఆప్షన్ ముఖీద్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, యూత్ అధ్యక్షుడు రామ్మూర్తి, కౌన్సిలర్ శ్రీధర్ రెడ్డి, సర్పంచుల ఫోరం శ్రీనివాస్, ఎంపీటీసీ ఫోరం సురేందర్ రెడ్డి, అనిల్, సోహెల్, తిరుపతి గౌడ్, స్వామి రెడ్డి, మోహన్, మల్లేశం, గంగాధర్, మహేంద్ర బాబు, కమిషనర్ సంతోష్, ఎమ్మార్వో దిలీప్, మార్కెటింగ్ ఏడీ ప్రకాష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అందుబాటులోకి వచ్చిన 5, 10 కిలోల కాంపోజిట్ సిలిండర్లు

**హుజురాబాద్ మే 07 (ప్రజామంటలు):** ప్రభుత్వ రంగ ఇండియన్ అయిల్ కార్పోరేషన్ మారుతున్న వంటింటి అవసరాలకు అనుగుణంగా ఇండేన్ వాడకందారులు సులభంగా వినియోగించే కాంపోజిట్ సిలిండర్లు




అందుబాటులోకి తెచ్చాయని ఐఓసియల్ రామగుండం విక్రయ అధికారి అలోక్ రెడ్డి, హుజురాబాద్ అంబుజా గ్యాస్ మేనేజింగ్ పార్టనర్ పి.వి.మదన్ మోహన్ తో కలసి సంయుక్తంగా తెలిపారు. 2.0 కాంపోజిట్ సిలిండర్ కొన్ని ప్రత్యేక లక్షణాలతో రూపొందించబడిందని తేలికైన బరువుతో పాటు తక్కువ ఖర్చుతో లభిస్తుందని వారు వివరించారు. అలాగే ప్రస్తుతం వాడే సాంప్రదాయ ఇండేన్ సిలిండర్ కన్న తక్కువ బరువుతో లభించే కాంపోజిట్ సిలిండర్లో ఎంత గ్యాస్ వుందో తెలుసుకోవచ్చని, లోహపు సిలిండర్ కానందువల్ల సిలిండర్ తాలుకు తుప్పు మరకలు నేలపై కనపడవని వారు వివరించారు.

పేలుడు నుండి రక్షణగా యు.వి. ప్రొటక్షన్ తో చుట్టబడిన పైబర్తో తయారు చేయబడ్డాయని వారు పేర్కన్నారు. ఇవి హెచ్.డి.పి.ఈ. ఔట్లెట్ సాకెట్ తో బిగించబడి వుండి ఐదు మరియు పది కిలోల పరిమాణంలో ప్రజలకు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు.నూతనంగా మార్కట్లోకి విడుదలైన పదికిలోల కాంపోజిట్ సిలిండర్ డిపాజిట్ రూ. 3350/- తో పాటు రీఫిల్ ధర రూ. 770.50/- రూపాయలని అలోక్ రెడ్డి, మదన్ మోహన్ వివరించారు. వివిధ ఇండేన్ ఏజన్సీలలో నమోదు కాబడిన కస్టమర్లు ఇండేన్ కాంపోజిట్ సిలిండర్ కొరకు ఆసక్తి కనపరిస్తే వారు తమ వద్దవున్న 14.2 కిలోల సిలిండర్లు సంబంధిత ఏజన్సీకి అప్పగించి పాత సిలిండర్ డిపాజిట్ మినహాయింపు పొంది మిగితా డిపాజిట్ మరియు రీపిల్ సిలిండర్ ధరను చెల్లించి కాంపోజిట్ సిలిండర్ పొందవచ్చని సూచించారు.అదే విధంగా కాంపోజిట్ సింగిల్ సిలిండర్తో నూతన కనెక్షన్లు పొందేవారు రూ. 4485 డిపాజిట్ రీఫిల్ ఇతర చార్జీలు చెల్లించాలని స్టౌ కొరకు అదనపు చార్జీలు యం.ఆర్.పి. రేటు ప్రకారం చెల్లించాలని తెలిపారు. హైదరాబాద్ జంట నగరాలలో లభ్యమయ్యే ఈ సిలిండర్లను వివిధ ఇండేన్ గ్యాస్ డీలర్ల ద్వారా అందుబాటులోకి తెచ్చామని అలోక్ రెడ్డి, మదన్ మోహన్ లు ఒక ప్రకటనలో తెలిపారు.

# తెలుగు యుగాది క్యాలెండర్ ఎమ్మెల్యే రఘునందన్ రావుకు అందజేత

**జనగామ మే 07 (ప్రజామంటలు):** త్రిమత ఏకైక గురువు, ఆధ్యాత్మిక సామ్రాజ్య చక్రవర్తి, శ్రీ శ్రీ శ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల దివ్య ఆశీసులతో శుభకృత్



నామ సంవత్సర త్రైత సిద్ధాంత తెలుగు యుగాది క్యాలెండర్ -(త్రైత శకం-44)లను దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావుకు జనగామ బీజేపీ పార్టీ ఆఫీస్ లో జనగామ కమిటీ సభ్యులు కొన్నే ఉపేందర్ అందించారు. సృష్టి ఆది నే యుగాది అంటారని, యుగాది కి గుర్తు గా ఆదివారం ఉందని, పండుగ లలో మొదటిది అని, సృష్టి ఆవిర్భావం జరిగిన రోజు అని, కావున ప్రతి ఒక్కరూ యుగాది రోజు భక్తి శ్రద్ధలతో దేవుడిని కొలిచేవారని తర్వాత ఆరు గుణాల గుర్తుగా షడ్రుచుల ప్రసాదం ను తయారు చేసి యుగాది ప్రసాదంగా పెట్టి తీసుకునేవారని, కాలక్రమంలో యుగాది ప్రసాదం అనేది ఉగాది పచ్చడిగా మారిందని తెలుపడమైనది. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు కెవిఎల్ఎన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# మాతా శిశు ఆస్పత్రి భవన నిర్మాణ పనులను పరిశీలన

**ధర్మపురి మే 07 (ప్రజామంటలు):** ధర్మపురి పట్టణంలో నూతనంగా మంజూరు కాబడిన మాతా శిశు ఆస్పత్రి భవన నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ జి. రవి. ఈ సందర్భంగా నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలతో వేగవంతంగా పూర్తిచేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ పర్యటనలో జగిత్యాల ఆర్డీవో మాధురి ధర్మపురి తాహసిల్దార్ వెంకటేష్, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సంప్రదాయ రీతిలో నరసింహ నవరాత్రులు ప్రారంభం

**ధర్మపురి మే 07 (ప్రజామంటలు):** ధర్మపురి క్షేత్రస్థ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో శనివారం నరసింహ నవరాత్రి ఉత్సవ వేడుకలు సంప్రదాయ రీతిలో ప్రారంభమైనాయి. శ్రీ యోగానంద, ఉగ్ర లక్ష్మీ సమేత నరసింహ స్వాములు వెలసిన దేవస్థానంలో, నరసింహ నవరాత్రి ఉత్సవాలను తొమ్మిది రోజుల పాటు సంప్రదాయ



పద్ధతిలో ఏటా నిర్వహిస్తున్న క్రమంలో శని వారం ప్రారంభ దినాన ఉదయాత్ పూర్వ సమయాన మంగళ వాయిద్యా లతో, వేద మంత్రాలతో, పవిత్ర జలాలను తెచ్చి, ఆలయ అర్చకు లు, ఆలయాలను, ఉత్సవ మూర్తులను, సంప్రోక్షణ గావించారు. అనంతరం మూలవిరాట్ లను అభిషేకించారు. ఈ సందర్భంగా దేవస్థానం ఏఈఓ సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో, ఐ. రామయ్య నేతృత్వంలోని అభివృద్ధి కమిటీ సభ్యులు, సూపరింటెండెంట్ కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అల్వాల శ్రీనివాస్, మార్గదర్శకత్వంలో ఆస్థాన వేదపండితులు బొజ్జ రమేష్ శర్మ నేతృత్వంలో, వేద పండితులు ముత్యాల శర్మ, ముఖ్య అర్చకుడు నంబి శ్రీనివాసాచార్య, రమణాచారి, నరసింహ మూర్తి, కిరణ్, ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

# బిజేవైఎం ఆధ్వర్యంలో ఎంఆర్ఓ ఆఫీస్ ముందర ధర్నా

**ధర్మపురి మే 07 (ప్రజామంటలు):** నిరుద్యోగుల సమస్యల పట్ల టిఆర్ఎస్ ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై బిజేవైఎం ఆధ్వర్యంలో ధర్మపురి ఎంఆర్ఓ ఆఫీస్ ముందర ధర్నా. మండల అధ్యక్షులు నార్ల విజయ్, బీజేపీ పట్టణ అధ్యక్షులు బెజ్జరపు లవన్



.జిల్లా కార్యదర్శి పిల్లి శ్రీనివాస్,కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు బందరి లక్ష్మణ్, ఓబిసి మోర్చా ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాస్, బీజేయం జిల్లా ఐటిబ సెల్ దువిత్తి శ్రీధర్, జిల్లా కార్య వర్గ సభ్యులు నరెడ్ల శంకర్, బీజేయం ప్రధాన కార్యదర్శి సంగి మాధవ్, కొరిగంటి కిరణ్ పాల్గొన్నారు.

# చింతల పల్లె సర్పంచ్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే

**కొడిమ్యాల మే 07 (ప్రజామంటలు):** కొడిమ్యాల మండలంలోని చింతల పల్లి గ్రామానికి చెందిన సర్పంచ్ మల్యాల మహిపాల్ అనారోగ్యంతో గత పది రోజుల క్రితం శస్త్ర చికిత్స చేయించుకోగా శనివారం చొప్పదండి శాసనసభ్యులు సుంకె రవిశంకర్ పరామర్శించి, తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వారి వెంట జెడ్పిటిసి పునుగోటి ప్రశాంతి కృష్ణారావు, సింగిల్విండో చైర్మన్ లు మేనేని



రాజనర్సింగరావు, పోలు రాజేందర్, సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షులు పునుగోటి కృష్ణారావు, తెరాస మండల అధ్యక్షులు పులి వెంకటేష్ గౌడ్, అంకం రాజేశం, సర్పంచ్ లు గరిగంటి మల్లేశం, ఏగుర్ల తిరుపతి, రమేష్, తునికి నర్సయ్య, నాయకులు కొత్తూరి స్వామి, నరేందర్ రెడ్డి, కొలాపురం రమేష్, గుండు రాజు, నరేందర్, సుంకి నరేష్, పవన్ అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

# టీఆర్ఎస్ కార్యకర్త 'ఎన్నం నవీన్'కు ఘననివాళి

**చిగురుమామిడి మే 07 ( ప్రజామంటలు):** చిగురుమామిడి మండలం నవాబుపేట గ్రామానికి చెందిన టీఆర్ఎస్ పార్టీ క్రియాశీల కార్యకర్త ఎన్నం నవీన్ గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా శనివారం వారి భౌతిక కాయానికి టీఆర్ఎస్ మండల అధ్యక్షులు మామిడి అంజయ్య గులాబీ జెండాని కప్పి ఘన నివాళు లు అర్పించారు. వారి కుటుంబాన్ని ఓదార్చి, నవీన్ అంత్యక్రియల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుద్దాల ప్రవీణ్, టీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మంకు శ్రీనివాస్ రెడ్డి, మండల ఆర్గనైజింగ్ కార్యదర్శి కల్వల రాజేశ్వర్ రెడ్డి, మండల కో-ఆప్షన్ సభ్యులు మగ్బుల్ పాషా, మండల బిసి సెల్ అధ్యక్షులు హనుమండ్ల సత్యనారాయణ, గ్రామశాఖ అధ్యక్షులు పిల్లి వేణు,



టీఆర్ఎస్ నాయకులు ఎలగందుల సంపత్, బోయిని సది, టీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సమగ్ర పంటల బీమాపై ఆలోచ ఏదీ ?

ఏటా పంటల బీమా పథకాలపై రైతులకు అవగాహన కల్పించడంలో వారిని ప్రీమియం చెల్లించేలా ప్రోత్స హించడంలో వ్యవసాయ శాఖ అధికారులు విఫలమవుతున్నారు. దీంతో ప్రకృతి విపత్తులు సంభవించి నప్పుడు వారికి పరిహారం అందడం లేదు. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది. రైతులను చైతన్యం చేయించి వారితో నామమాత్రంగా బీమా సొమ్ము చెల్లించేలా చేయించడంలో అధికారులు విఫలం అవుతున్నారు. ప్రధానంగా బీమా పథకాల వల్ల కలిగే లబ్ధిపై వారికి సమాచారం ఉండడం లేదు. అకాలవర్షాలు, వడగళ్ళు, తుఫాన్లు సంభవిస్తే జరిగే నష్టాలను పొందేలా సమగ్ర బీమా పథకం రూపొందించాల్సిన బాధ్యత కేంద్రానిది. కానీ ఇలా చేయలేకపోతున్నారు. అలాగే ఏ పంటకు ఎంత చెల్లించాలన్న సమాచారం కూడా రైతులకు చేరడం లేదు. అలాగే పథకాల అమలుపై రైతుల్లో చైతన్యం కానరావడం లేదు. వడగళ్ళు,విలయం సంభవించినప్పుడు ప్రభుత్వాలపై ఆధారపడి పరిహారం అందక లబోదిబోమంటున్నారు. దీనిని తప్పించేందుకు ఫసల్ బీమా వంటి పథకాలు అందుబాటులో ఉన్నాయి. రైతులను చైన్యం చేయకపోవడం వల్ల ఆశించిన స్థాయిలో బీమాకు నోచుకోవడం లేదని తెలుస్తోంది.

గతంలో కనీసం ఇందులో పది శాతం మంది కూడ బీమా ప్రయోజనాలు పొందలేకపోయారు. వేల మంది రైతులు బీమా ప్రీమియం చెల్లించలేదని సమాచారం. క్షేత్ర స్థాయిలో అధికారులు తగిన రీతిలో రైతులకు బీమా సమాచారాన్ని చేరవేయకపోవడంతోనే బీమాకు దూరమవుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతు న్నాయి. ఈ విషయంపై విస్తృత ప్రచారం నిర్వహించాల్సి న అవసరం ఉంది. ప్రధానమంత్రి పంటల బీమా పథకంలో ఖరీఫ్, యాసంగి పంటల బీమా ప్రీమియం ధరలు ఖరారయ్యాయి. సీజన్కు సంబంధించి బీమా పథకంలో వరి, మొక్కజొన్న, వేరుశనగ, శనగ పంటలతో పాటు మామిడి తోటలను చేర్చారు. అతివృష్టి, అనావృష్టి, వడగండ్లు, ప్రకృతి విపత్తులతో పంటలు దెబ్బతింటే రైతులను ఆదుకోవడంలో బీమా పథకం ప్రధానపాత్ర పోషిస్తోంది. పత్తికి వాతావరణ ఆధారిత బీమా, సోయాబీన్కు గ్రామ యూనిట్, జొన్న, కంది, పెసర, మినుము తదితర పంటలకు మండలం యూనిట్గా పంట బీమా అమలు చేయాల్సి ఉంది. దీనికితోడు టమాట, మామిడి పంటలకు కూడా వాతావరణ బీమాను ప్రకటించడం వల్ల రైతులకు ఊరట కలగనుంది. పంటల వారీగా ప్రీమియం ధరలు, చెల్లించాల్సిన గడువు తేదీల వివరాలతో కూడిన మార్గదర్శకాలను ప్రభుత్వం

విడుదల చేయడంతో పాటు రైతులకు తెలియచేయాలి. ఎన్ని హెక్టార్లలో ఏ విధమైన పంటలను రైతులు సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేయాలి. ఈ సీజన్లో అత్యధికంగా వరి, మొక్కజొన్న , పత్తి, పెసర, మినుము సాగయ్యే అవకాశాలున్నాయని చెబుతున్నారు. ఈ ఏడాది సాధారణ వర్షపాతం ఉంటుందని వాతావరణ శాఖ ప్రకటించడంతో పరిస్థితి అనుకూలిస్తే కానీ తెలియని పరిస్థితి ఉంది. ఈ క్రమంలో ఏ పంట సాగు విస్తీర్ణం ఎలా ఉంటుందనేదన్నది స్పష్టం కావాలి. ప్రధానమంత్రి పంటల బీమా పథకం కింద వరి, మొక్కజొన్న, వేరుశనగ, శనగ పంటల కు వాతావరణ ఆధారిత బీమా పథకంలో భాగంగా మామిడి పంటలకు బీమా వర్తిస్తుంది. పంటరుణాలు తీసుకునే రైతులు, రుణం అవసరం లేని రైతులు ఈ బీమా పథకాలను వినియోగించుకోవచ్చు. అయితే పంట రుణాలను పొందాలనుకున్న రైతులకు సంబంధించి రుణం అందజేసే సమయంలోనే ప్రీమియాన్ని తీసుకుని మిగతా మొత్తాన్ని సదరు రైతుల ఖాతాల్లో జమ చేస్తారు. పంట నష్టం జరిగితే పరిహారం రావాలంటే నిర్ణీత గడువులో బీమా చెల్లించాలి. ఈ విషయంలో రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలి ప్రతి రైతు ప్రీమియం చెల్లించేలా కృషి చేయాలి. ప్రధానమంత్రి పంటల బీమా పథకానికి సంబంధించి ఎలాంటి సందేహాలున్నా ఏఈవోలు, ఏవోలను సంప్రదించేలా



క్షేత్రస్థాయిలో రైతులకు తెలియచేయాలి. పంట రుణాలు తీసుకోని రైతులు నేరుగా ప్రీమియం చెల్లించుకునే వెసులుబాటు ఉంది. మీ సేవా కేంద్రాలు, బ్యాంకులు తదితర వాటి ద్వారా చెల్లించవచ్చు. ఇవన్నీ గ్రామస్థాయిలో ప్రచారం జరగాలి. అప్పుడే పంటలకు తగిన భరోసా దక్కుతుంది. మిర్చి, పత్తి, శనగ తదితర రైతులు నష్టం సంభవించినప్పుడు ఏ విధంగా పరిహారం పొంద వచ్చే గ్రామాల్లో ప్రచార కార్యక్రమాలు చేయాలి. విదేశీ పారిశ్రామికవేత్తలను కాళ్లావేళ్లాపడుతూ వారి ప్రాపకం కోసం పాకులాడే రోజులు పోయేలా రైతులు స్వయం సమృద్ధి సాధించాలి. అందుకు మనకున్న వనరులతో ముందుకు సాగాలి. మనదేశం వ్యవసాయిక దేశం. వ్యవసాయం లో విప్లవాత్మక మార్పులు తీసుకుని రావడం, దాని

అనుబంధ రంగాలను ప్రోత్స హించడం వల్ల ఒక్కో రైతు కనీసం వందమందికి ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి కల్పించవచ్చు. దీంతో ఆహార ధాన్యాల ఉత్పత్తి పెరగడంతో పాటు, ఎగుమతులకు అవకాశాలు పెరుగతాయి. విదేశీ మారక నిల్వలను సాధించవచ్చు. ఈ సూత్రాన్ని గతంలో ఉన్న ఏ ప్రభుత్వం పాటించడం లేదు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కూడా పాటించడం లేదు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని ప్రకటించిన మోడీ వారిని రోడ్డున పడేలా చేస్తున్నారు. కేవలం విదేశీ పెట్టుబడులే సర్వస్వం అన్న విధంగా నేతలంతా ఆయా దేశాల ముందు మోకరిల్లు తున్నాయి. కానీ ఏనాడు రైతులకు ఒక్క పైసా విదిల్చడం లేదు. గిట్టుబాటు ధరలు, పంటలకు బీమా తదితర అంశాలను పట్టించుకోవడం లేదు. రైతులు ఆందోళన చేసినా ప్రభుత్వం కదలడం లేదు. పంటల బీమా విధిగా అమలు జరిగేలా చర్యలు తీసుకుంటే రైతులను ఆదుకున్న వారు అవుతారు. ఇందుకు జాతీయ స్థాయిలో సమగ్ర బీమా పథకం అమలు చేయాలి. ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల పంట నష్టపోయిన సందర్భాల్లో బీమా వర్తించేలా చూడాలి. పంటనష్టపోయిన రైతులు ప్రభుత్వం చుట్టూ కాళ్లరిగేలా లేదా..బిచ్చమెత్తుకునే ఉండే పరిస్థితులు పోవాలి. బీమా సొమ్ము దర్జాగా రాబట్టుకునేలా చట్టాలు రావాలి. అప్పుడే అన్నదాత కంటినిండా నిద్రపోగలడు.




## సాహితీ ప్రేమికులైన పాఠకులకు ప్రత్యేకం

“ ప్రజా మంటలు” తెలంగాణ జాతీయ దినపత్రికలో రేపటి నుండి ప్రతి రోజు, “ నేటి కథ” శీర్షికన ఒక కథను ప్రచురించనున్నామని తెలుపుటకు సంతోషిస్తున్నాం. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.comకు పంపవచ్చు...

-ఎడిటర్.

## చిన్నారుల భవితకు బంగారు బాటలు వేద్దాం

“పిల్లలు దేవుడు చల్లనివారే, కల్లకపటమెరుగని కరుణామయులే. పుట్టినప్పుడు మనిషి మనసు తెరిచి యుండును. ఆ పురిటి కందు మనసులోన దైవముండును....”

అన్నారు ఓ సినీ మహాకవి గారు. నిజమే కదండి మాయలు, మర్మాలు, కల్లాకపటం ఎరుగని చిన్నారుల మనసు దేవుడితో సమానం. అంటే చిన్నారి చిరంజీవులకి దేవుడికున్నంత గొప్ప మనసు ఉంటుంది. కానీ కుటుంబ పరిస్థితులు, పేదరికం, వీటన్నింటిని మించి చెడు స్నేహాలు, తల్లితండ్రుల్ని పోగొట్టుకున్న చిన్నారులు అన్ని వెరసి వీరిని చెడు మార్గంలో పయనించేలా చేస్తుంది. ఇది తప్పు, ఒప్పు అని కూడా తెలియని లేత మొగ్గలు వీరు. అందుకే “మొక్కై వంగనిది మానై వంగునా” అనే ఒక సామెత ఉంది. సామెత చిన్నారులకి బాగా వర్తిస్తుంది. పసితనం మొగ్గలాంటిది, యవ్వనం కాయ లాంటిది, వార్ధక్యం పండు లాంటిది. మూడు దశలు వాడిపోకుండా వికసించాలి అంటే మొగ్గ దశ వాడిపోకుండా చూడాలి. మొగ్గ దశ వాడిపోతే రాలిపోవడం తప్ప మరో దారి లేదు. ఈ సమాజంలో చాలామంది బాల్యం ఇలాంటి పరిస్థితినే ఎదుర్కొంటుంది. కాలప్రవాహంలో చిన్నారులు దినదిన ప్రవర్ధమానం చెందాలి కానీ పతనం కాకూడదు. తోటలో మొగ్గలు రాలిపోతే తోటమాలి ఎలా పట్టించుకోడో చాలా మంది చిన్నారి పసిమొగ్గలు విషయంలో కూడా కొన్ని ప్రతికూల పరిస్థితుల వల్ల ఇలా జరుగుతుంది. “పాపం పుణ్యం ప్రపంచ మార్గం/ కష్టం సౌఖ్యం శేషార్థాలు / ఏమీ ఎరుగని పువ్వుల్లారా ఐదారేళ్ల పాపల్లారా/ మెరుపు మెరిస్తే, వాన కురిస్తే/ ఆకాశమార్గాన హరివిల్లు విరిస్తే../ మీదే మీదే సమస్త విశ్వం/ మీరే లోకపు భాగ్యవిధాతలు.../“ అంటూ ఈ విశ్వానికే పట్టాభిషిక్తుల్ని చేశారు చిన్నారుల్ని శ్రీ శ్రీ. ఇలా శ్రీశ్రీ కలలుకన్న చిన్నారుల రాజ్యం ఇప్పటికీ సాకారం కాలేదు. ఎందుకంటే మహానగరాల్లో ఏ కూడలిలో చూసినా బాలభారతమే. చింపిరి గుడ్డలతో, గాయాలతో ఈ నగరంలో చూసిన బతుకు దుర్భరమైన బాల బాలికలే. చేతిలో ఏ పాత సంచో పట్టుకుని తిరిగే చిత్తుకాగితాల బతుకు వీరిది. ఆడుతూ పాడుతూ అమ్మచేతి గోరుముద్దలు తిని, నాన్న ఒడిలో సేద తీరాల్సిన వీరు కన్న వాళ్లకు దూరంగా దురలవాట్లకు దగ్గరగా వీరి బతుకుచిత్రం. ఏ వీధిలో చూసినా రేపటి పౌరులే, ఏ రైల్వేస్టేషన్లో చూసినా ఈ చిన్నారులే. రేపటి పౌరులుగా వెలుగొందాల్సిన ఈ చిన్నారులు ఇలా అనాథగా వీధిబాలలుగా మారడానికి ప్రధాన కారణం పేదరికం. వీరు ఇలా బస్టాండ్లలో, రైల్వే స్టేషన్లలో తిరుగాడుతూ మనం పడేసిన చెత్తని ఊడుస్తూ మనం ఇచ్చే రూపాయి కోసం ప్రాధేయయ పడుతుంటారు. ఇంకా కొంతమంది చిన్నారులు రోడ్డు పక్కన ఉన్న చిత్తు కాగితాలు ఏరుకుని వాటిని అమ్ముకుని జీవనం సాగిస్తుంటారు. కొంతమంది దొంగతనాలు చేస్తూ ఉంటారు. మరి కొంత మంది బాలలు కల్యాణమండపాల పక్కన, చెత్త కుండీల దగ్గర విస్తరాకుల్లో మిగిలిపోయిన పదార్థాలని తింటూ పొట్ట నింపుకుంటూ అర్ధాకలితో అలమటిస్తూ బతుకు పోరాటం చేస్తుంటారు. కొంతమంది తల్లిదండ్రులు



వారికి అంగవైకల్యంతో ఉన్న పిల్లలు పుడితే వాళ్ళని పెంచే ఓర్పు, నేర్పు, జాలి, దయ ఏమాత్రం చూపకుండా నిర్లక్ష్యంగా ఎక్కడో సుదూర ప్రదేశాల్లో, ఇంక వికలాంగుల సేవా సదన్ లో వదిలేసి వస్తుంటారు. ఇలాంటి చిన్నారుల్ని చూస్తే మానవత్వం ఉన్న ప్రతి ఒక్కరు కంటతడి పెట్టకమానరు. పెద్దవాళ్లు ఆవేశంలో చేసిన తప్పులకు సమాజంలో వివక్షకు గురైన వాళ్లు నేడు వంటరిగా జీవిస్తున్న అనాధలు మన దేశంలో లక్షల సంఖ్యలో ఉన్నారు. అయితే ఊహ ఉండి అన్నీ తెలిస్తే అనాధలైనా ఎలాగో ఒకలా బతికేయగలరు. కానీ ఈ చిన్నారులకు బాల్యం అంటే అసలు తెలియదు. అలాగే బడికి వెళ్లడం, చదువుకోవడం కూడా తెలియదు. వీరికి తెలిసిందల్లా కడుపు నింపుకోవడం కోసం ప్రమాదకర పరిశ్రమల్లో పనిచేయడం, చిన్న చిన్న చోరీలు చేస్తూ దెబ్బలు తినడం చేస్తుంటారు, ఆపై జైలుకు వెళ్లడం ఇదే వీరి బాల్యం. ఇంకా చెడును ప్రోత్సహించే టీవీ సీరియల్స్, అశ్లీల చిత్రాలు ఒకదానితో ఒకటి పోటీపడుతూ కొంచెం పెద్ద అయ్యేసరికి తోటి ఆడపిల్లల్ని ఏడిపించడం లాంటివి చేస్తూ సమాజం దృష్టిలో, చట్టం దృష్టిలో నేరస్థులుగా ముద్రింపబడి దుర్భరమైన జీవితాన్ని గడుపుతూ బతుకును వెళ్లదీస్తున్నారు. ముఖ్యంగా ఇటువంటి అనాధ బాలల ఆదుకోవడానికి ప్రభుత్వం వారు 50 వేల జనాభా దాటిన ప్రతి ఊరికి ఒక అనాధ బాలల శరణాలయాన్ని స్థాపించాలి. స్వచ్ఛంద సంస్థల సహకారంతో రైల్వే స్టేషన్లలో, బస్టాండ్లలో, రోడ్డు పక్కన చిత్తు కాగితాలు ఏరుకుంటూ దీన వదనంతో ఉండే ఈ చిన్నారులను గుర్తించి వాళ్లని తీసుకువచ్చి ఈ అనాధ శరణాలయంలో చేర్పించాలి. వారికి కనీస సౌకర్యాలు కల్పించి జీతానికి మంచి వాలంటీర్లని నియమించాలి. వీరి ద్వారా ఈ చిన్నారుల్లో ఉన్న చెడును వెలికితీసి వారికి తెలియజెప్పాలి. చెడు వల్ల వారికి కలిగే నష్టాన్ని వివరించి ఇంకా మంచి మాటలతో వాళ్ల మనుసుల్ని మార్చాలి. వాళ్లు అనాధలు, వికలాంగులు అనే భావన రాకుండా జీవితం అంటే ఏమిటో వాళ్లకి తెలియజెప్పాలి. జీవితం మీద ఆశ కల్పించి శుచి, శుభ్రత నేర్పించాలి. అలా చేస్తే వాళ్లకి కూడా కొత్త ఆశలు చిగురించి చెడు మార్గంలో నుంచి సన్మార్గంలోకి పయనిస్తారు. అలాగే వీరిని మళ్లీ బడికి పోదాం పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తే ఇంకా బాగా చదువుకొని మంచి పౌరులుగా రూపు దిద్దుకుంటారు. ఇంకా పేద తల్లిదండ్రులకు చిన్ని జీవనాధారం కూడా కల్పిస్తే కొంతలో కొంత ఆసరాగా ఉంటుంది తల్లిదండ్రులకు కూడా. ఇలాంటి అనాధలే కాదు జనరల్ గా ప్రతి శిశువును ఆరోగ్యకరమైన వ్యక్తిగా తీర్చిదిద్దడం తల్లిదండ్రుల కర్తవ్యం. ఇంట్లో ఆరోగ్యకరమైన వాతావరణాన్ని ఇవ్వడం ద్వారా శిశువుకు ఆత్మవిశ్వాసం కలిగించడం ఒక అంశమైతే, అతనిలో జిజ్ఞాసను కలిగించి విజ్ఞానార్జన వైపు మళ్ళించడం రెండవ అంశం. తల్లిదండ్రులు తమ ఆందోళనలను, ఆలోచనలను, ఆవేశాలను వారిపై రుద్ది ఒత్తిడిని పెంచవద్దు. ప్రతి శిశువుది ఒక ప్రత్యేకమైన కలల ప్రపంచం. తమ బాధలను శిశువుల కలల ప్రపంచంపై ఏ మాత్రం పడకుండా జాగ్రత్త పడాలి. తల్లిదండ్రులు చేయవలసిందల్లా ప్రేమ నివ్వడం, ఆత్మవిశ్వాసాన్ని పెంచడం. ఇదే తల్లిదండ్రులు, సమాజం అందరూ కూడా శిశువుకు ఇచ్చే గొప్ప బహుమతి.మనం అందరం కలిసి వారికి సేవలందిస్తుంటే ఆనందంతో కేరింతలు కొడుతూ బాల బాలికలందరూ ముక్తకంఠంతో “ భారత బాల బాలికలం /భావితరానికి ప్రతినిధులం /జాతిని ముందుకు నడిపిన/ నేతలకు ఖ్యాతికి మేమే వారసులం/ మానవసేవే మాధవ సేవని ఎప్పుడూ భావిస్తాం/ వేడుక మీరగా విజయపతాకం/ వినువీధుల్లో ఎగరేస్తాం, ఎగరేస్తాం/“ అంటూ ఎలుగెత్తి చాటే ఈ అనాధ చిన్నారుల్లో ఒక గాంధీజిని, అబ్దుల్ కలాంని, అంబేద్కర్ ని, ఇందిరాగాంధీని రేపటి తరంలో చూస్తూ వారి జీవితాల్లో వెలుగు నింపడానికి ప్రతి ఒక్కరు చేయి చేయి కలుపుదాం.

పింగళి భాగ్యలక్ష్మి, గుంటూరు
కాలమిస్టు రచయిత్రి
9704725609

# విజయనగర సామ్రాజ్య స్థాపకుడు విద్యారణ్యుడు”


## వైశాఖ శుక్ల సప్తమి ... విజయనగర రాజ్య స్థాపన దినం

## వైశాఖ శుక్ల సప్తమి విద్యారణ్య స్వామి జయంతి

“సదాశివ సమారంభం శంకరాచార్య మధ్యమాం అస్మదాచార్య పర్యంతాం వందే గురు పరంపరాం”...

“అవిద్యారణ్య కాంతారే భ్రమతం ప్రాణినాం సదా, విద్యా మార్గోపదేష్టారం విద్యారణ్య గురుం శ్రయే”...

“విద్యా విద్యావివేకీన పారం, సంసార వారిధే: ప్రాపయత్య నిశం భక్తాన్ తం విద్యారణ్యమాశ్రయే...



ఆదిశంకరుని అనంతరం అంతటి వారిగా పేరెన్నికగన్నారు విద్యారణ్యస్వామి. విఖ్యాత పురుషుడు, మహాయోగి, మహామతి, కవి, తాత్వికుడు, ద్రష్ట, వేదత్రయ భాష్య కర్త, బ్రహ్మవిద్య పారంగతుడు, శ్రౌత స్మార్త క్రియా పరుడు, వేదాంత శాస్త్ర ఆది రచయిత, శతాధిక గ్రంథకర్త, విశేషించి విజయనగర మహా హిందూ సామ్రాజ్య నిర్మాత, రాజ్య స్థాపకుడు, మహామంత్రి, హిందూ మతోద్ధారకుడు, విరూపాక్ష పీఠ స్థాపకుడు, శృంగగిరి పీఠాధిపతిగా పలు విధ ప్రత్యేకతలు లతో , జగత్ ప్రసిద్ధి పొందారు విద్యారణ్యస్వామి. 1267 లో వైశాఖ శుక్ల సప్తమి నాడు జన్మించి, 1331 లో సన్యాసం స్వీకరించి, శృంగేరి పీఠాధిపత్యం వహించారు. 1386 లో శుద్ధ త్రయోదశి నాడు సిద్ధి పొందారు విద్యారణ్యులు. విద్యారణ్య స్థాపిత పుష్పగిరి తదితర స్థలాలలో, జ్యేష్ఠ శుక్ల త్రయోదశి నాడు, ఆరాధనోత్సవాలు సాంప్రదాయ రీతిలో నిర్వహిస్తారు. ఉత్తర హిందూ దేశమంతా మహమ్మదీయుల వశమై, అన్యమతస్తుల ఆధిపత్యం అధికమైన పరిస్థితులలో, శంకరుని తర్వాత అంతటి వాడైన, ప్రాధాన్యత కలిగిన విద్యారణ్యుడు విద్యానగరం (విజయనగర) సామ్రాజ్య నిర్మాత సామ్రాజ్య రక్షకులు అయినారు. భరత జాతిని జాగృతపరిచే చేందుకు అహరహం శ్రమించి, విశేష కృషి సల్పి లక్ష్యసాధనలో సిద్ధి పొందారు. ముస్లిం మతం బలవంతంగా పుచ్చుకొన ఇష్టపడని స్థితిలో, తిరిగి హిందూ మతంలోకి రావాలనుకునే వారికి, కల్పవృక్షమై నిలిచారాయన. 1331లో ప్రజోత్పత్తి సంవత్సర కార్తీక శుద్ధ సప్తమి నాడు శృంగేరి పీఠాధిపత్యం వహించారు. తమకు ముందున్న శృంగేరి పీఠాధిపతులు, విద్యా తీర్థుల అనుమతితో శృంగేరి పీఠానికి అనుబంధంగా విరూపాక్ష, పుష్పగిరి, శివగంగ, ఆమని సంకేశ్వర్, కొల్లాపురంలలో స్థాపనలు గావించి, తద్వారా హిందూమత దీక్షలు ఇప్పించి, అన్య మతాల బాధితులకు ఆశ్రయ దాత అయినారు. “పరాశర మాధవీయం” అనే స్మృతి గంథంలో తమ గూర్చి చెప్పుకున్నారు. శ్రీమతి మాయణునిల తనయుడై, సాయన, సోమ నాథుడు ఇరువురు సోదరులు, సింగల సోదరిని కలిగి, కృష్ణ యజుర్వేది, బోధాయన సూత్రుడు, భారద్వాజ సగోత్రుడు, మాధవ జన్మనామం కలిగి, సన్యాసి నుంచి “విద్యారణ్య” నామధేయులైన స్వామి, బాల్యమున విద్యాభ్యాసం నాటికి దక్షిణ భారతంలో ఆర్ష పరిస్థితి శోచనీయమై, వేదశాస్త్రాలు అడుగంటి, శ్రౌతస్మార్త విద్యలు భ్రష్ట మై, ఉపనిషన్మతం పెడత్రోవలో పడి, మతం పలు శాఖలుగా చీలిన పరిస్థితులలో, విద్యారణ్యుడు అవతరించి వేద మతాన్ని ఉద్ధరించారు. మత త్రయాచార్యులు, వేదాంత శాస్త్రాలను మాత్రమే విస్తరింప చేయగా, వేదార్థ విశదీకరణ కానరాని స్థితిలో, గాయత్రీ మంత్రోపాసకుడై, భువనేశ్వరి మాత ప్రత్యక్ష ప్రసన్నతో, హరిహర బుక్కరాయలచే రాజ్యస్థాపన గావించి, 1350-13 ఏళ్ల మధ్య కొంత కాలము మంత్రిగా ఉండి, 1400 గ్రంథాలు రచించి 1380 లో శృంగేరి పీఠాధిపతులై లౌకిక, వైదికాంశములలో, అసమాన ప్రతిభులై, మత, రాజ్యోద్ధరణ గావించినట్లు, చారిత్రక పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. సర్వజ్ఞ విష్ణు అనే గురువు వద్ద లేదా వేదాంత శాస్త్రాలు ఆయన అభ్యసించినట్లు సర్వదర్శనం సంగ్రహంలో ఉంది. బ్రహ్మచర్యాశ్రమం నుండి మాధవుడు సన్యసించినట్లు చెబుతారు కానీ చాళుక్య చక్రవర్తి మంత్రి అయిన వీతి హోత్రుని కుమార్తె వీతి హోత్రి అను కన్యను తల్లిదండ్రుల ఆజ్ఞానుసారం పెండ్లి చేసుకుని కొంతకాలం సంసారం సాగరమున ఉన్ననూ, బ్రహ్మచర్య నిష్ఠా గరిష్టుడు అగుటచే యవ్వన వంతులుగా ప్రకాశించి నట్లు పురాణపండ రామ్మూర్తి పేర్కొన్నారు. అన్యమతస్తుల ఆగడాలు కలత పెట్టగా, మాధవుడు తుంగభద్ర తీరాన భువనేశ్వరి అమ్మవారిని గురించి గాయత్రి మంత్రంతో తీవ్ర తపస్సు ప్రారంభించగా అమ్మవారు ప్రత్యక్షమైన వేళ... ఆయన ఐశ్వర్యం కావాలని కోరుకోగా, అందుకు ఆయనకు అర్హత లేదని, అమ్మ వారు చెప్పిన ప్రకారం సన్యసించి శృంగేరి పీఠాధిపత్యాన్ని వహించగా, అప్పుడు, ఆ జగజ్జనని మూడు గడియల సేపు సువర్ణ వృష్టి కురిపించినట్లు కథనాలు. భువనేశ్వరి మాత అనుగ్రహించిన అపార సంపత్తిని విరూపాక్ష పీఠం నెలకొల్పడానికి, విద్యా నగరాన్ని పెంపొందించడానికి, విజయనగర సామ్రాజ్యాన్ని విస్తరింపచేయడానికి ఉపయోగించారు.

“ధర్మపురి తో విద్యారణ్యుల అనుబంధం”

1936లో విజయనగర సామ్రాజ్య రాజధాని విజయనగరాన్ని నిర్మించి, శృంగేరి పీఠం అధిష్టించిన పవిత్రాత్ములకు, ధర్మపురి క్షేత్రంతో విడదీయాలని సంబంధం, అనుబంధం ఉన్నాయి. ప్రాచీన ఆర్ష విద్యా, సంస్కృతులకు కేంద్ర స్థానం అయి, వేద విద్యకు కాణాచియై, చరిత్రకందని అంత పూర్వ కాలికంగా, ఉజ్వల సాంస్కృతిక వైదిక పౌరాణిక పుణ్యస్థలమై, పవిత్ర గోదావరి తీర క్షేత్రమైన ధర్మపురితో, ఆయనకు అత్యంత సాన్నిహిత్యం ఉంది. ఈ నేపథ్యంలోనే శాలివాహన శకం 1258 (క్రీస్తుశకం 1336) ధాత్రు నామ సంవత్సర వైశాఖ శుక్లపక్ష సప్తమి పుష్యమి నక్షత్ర సింహ లగ్నం సుముహూర్తాన, “విజయనగర సామ్రాజ్య స్థాపన” సమయాన ధర్మపురికి చెందిన, చతుర్వేద పండితులను, ఆహ్వానించినట్లు చెప్పబడుతున్నది పింగళి సూరన “కళా పూర్ణోదయం”లో చతుర్వేదాలు, బ్రాహ్మణ కుమారులుగా, ధర్మపురిలో జన్మించినట్లు గాధ నిర్మించారు. చతుర్వేదాలు ప్రభవించడానికి, యోగ్యమైన క్షేత్రంగా ధర్మపురి సూరన భావించాడు. అంతేగాక ధర్మపురికి, విజయనగర రాజ్యానికి, దగ్గర సంబంధం ఉన్నట్లు, చారిత్రక పరిశోధకులు, బహు గ్రంథ కర్త, డాక్టర్ సంగనభట్ల నరసయ్య ఈ విషయంలో విశేష కృషి సలిపారు. ధర్మపురి లోని యోగ నరసింహుడు విజయనగరంలోనూ ఆరాధ నీయుడైనాడు. ధర్మపురి లోని 60 స్తంభాల గుడిని పోలిన వంద స్తంభాల విఠలాలయం హంపిలో ఉంది. హంపీలోని తుంగభద్ర నదిలో కోదండ రామాలయానికి ఎదురుగా ఉన్న చక్రతీర్థం, గోదావరిలోని చక్రతీర్థం పోలి ఉంది. ధర్మపురి లాంటి కళ్యాణ డోలోత్సవ మంటపాలు, విఠలేశ్వర మందిరం అందులోనూ ఉన్నాయి. కృష్ణ దేవరాయల సోదరుడు వీర నరసింహ రాయలు ఉదయమే, నూటొక్క దివ్య క్షేత్రాలు ప్రసాదం తీసుకొనిదే, రాయ సింహాసనం అధిరోహించే వారు కాదట. అలా నూటొక్క దివ్య తిరుపతిలలో ఒకటిగా, నవనారసింహ క్షేత్రాలలో ఉత్కృష్టమైనదిగా ధర్మపురి ప్రసిద్ధమైనది. ధర్మపురి క్షేత్రంలో వీధి వీధికి శివలింగం, నంది, పార్వతి, గణపతి, ఆంజనేయులుతో కూడిన “శివ పంచాయతనాలు” అనబడే గ్రామ రక్షక దేవతల గద్దెలు ఉన్నాయి. ఇలాంటివే శృంగేరి లోనూ ఉన్న నేపథ్యంలో, ధర్మపురి ప్రాంత ప్రభావితుడైన విద్యారణ్యుల ద్వారానే ఈ సాంప్రదాయం ప్రబలినట్లు చెబుతారు.

దక్షిణామ్నాయ శృంగేరి పీఠం 12వ అధిపతి అయిన విద్యారణ్యులు, ధర్మపురి లో నివసించి, వేదాధ్యయనం చేసినట్లు, విజయనగర రాజ్య స్థాపకుడు హక్క, బుక్క సోదరులలో జ్యేష్ఠుని పట్టాభిషిక్తుడిని చేసి “హరిహర రాయలు” అని నామమిడినట్లు, ఇది హరి హర క్షేత్ర మైన ధర్మపురి ప్రభావ ఫలితమేనని, హరిహర అభేదమైన నరసింహునికి, శివునికి సమాన పూజలు, అనాదిగా జరుగుతూ, బ్రహ్మ, శివ అంశలతో జన్మించిన ఆంజనేయుని, గణపతి విగ్రహాలు నరసింహ ఆలయంలో కలిగి, శివకేశవ అభేద తత్వాన్ని చాటుతూ, స్మార్త ఆగమ పూజ రీతులతో, శైవ వైష్ణవ ఆగమ విధానాలతో, ఉభయ దేవతలు ఉపాస్యులుగా, ఆచరించే సత్సంప్రదాయం, విద్యారణ్యుల పై తీవ్ర ప్రభావం చూపినట్లు, అది యావత్ భారతానికి ఆదర్శ ప్రాయమైనట్లు భావించ డానికి ఆధారాలు ఊతమిస్తున్నాయి. జాతిని ఉత్తేజపరిచిన మహనీయులలో అగ్రశ్రేణికి చెందిన విద్యారణ్యులను ఏడాదికి ఒక నాడైనా ఆరాధించడం, మన విధాయక కృత్యం. వివిధ పీఠాలలో వలెనే ప్రతి చోట ఆయన స్మరణ, పూజ సాగ వలసి ఉంది.

# పోలవరం ఎప్పటికి పూర్తయ్యేనో ?

అమరావతి,మే7(ఆర్ఎన్ఎ): పోలవరం జాతీయ ప్రాజెక్ట్. దీనిని పూర్తి చేయాల్సిన బాధ్యత కేంద్రానిది. అలాగే సకాలంలో నిధులు విడుదల చేసి పూర్తి చయాల్సి ఉంది. అయితే దీనిలో ఏవైనా అవకతవకలు లేదా నిధుల దుర్వినియోగం ఉంటే ఎపి ప్రభుత్వాన్ని నిలదీయవచ్చు. నిధుల దుబారాను అరికట్టవచ్చు. కానీ పోలవరంపై నేటికీ స్పష్టమైన విధానం లేకుండా సాగుతోంది. చంద్రబాబు హయాంలో పోలవరం నిర్మాణాలను పరిశీలించిన దాదాపు 70శాతం నిర్మాణాలు పూర్తి కావచ్చాయని ప్రకటించారు. కానీ జగన్ అధికారంలోకి వచ్చి మూడేళ్లయినా ఇంకా పనులు కొనసాగుతున్నాయి.కేంద్రం కూడా పర్యవేక్షణ చేయడం లేదు. జాతీయ ప్రాజెక్ట్ పోలవరం విషయంలో కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు తప్పిదాల వల్ల ప్రాజెక్ట్ ఆలస్యం కావడం, డయాఫ్రామ్ వాల్ కూలిపోవడం వంటి నిర్లక్ష్యం సరికాదు. ఇటీవలే మంత్రి అంబటి రాంబాబు అక్కడ పర్యటించి పోలవరం పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అయితే పోలవరంపై వైసిపి,టిడిపిలు పరస్పర విమర్శలు తప్ప అసలు పనులు ఎంతమేరకు వచ్చాయన్న దానిలో స్పష్టత ఇవ్వడం లేదు. సోమవారంను పోలవారంగా భావించి సీఎం చంద్రబాబు ప్రాజెక్టు పనులు పూర్తికి శ్రీకారం చుట్టామన్నారు. కాంట్రాక్టు ఏజెన్సీలకు లక్ష్యాలను నిర్ణయించి పరుగులు పెట్టించామని అన్నారు. గ్రావిటీ ద్వారా నీరందించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఈ మేరకు రైతులకు హామీ ఇచ్చారు. మాట నిలబెట్టుకోవడానికి సర్వశక్తులు ఒడ్డుతున్నట్లు చెప్పారు. రాజకీయ ప్రత్యర్థులను, వారికి సహకరించే సంస్థలను ముప్పుతిప్పలు పెట్టడానికై ఆదాయపు పన్ను శాఖ, ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్లను విచ్చలవిడిగా వినియోగించడాన్ని చూస్తున్నాం. పోలవరం విషయంలో కూడా నిజాలు నిగ్గుతేల్చాలి. అలాగే పెరిగిన వ్యయానికి అనుగుణంగా నిధులు విడుదల చేయాల్సి ఉంది.

# ఏడాది పూర్తి చేసుకున్న స్టాలిన్ ప్రభుత్వం

## బస్సులో వెళ్లి కరుణ సమాధి వద్ద నివాళి

చెన్నై,మే7(ఆర్ఎన్ఎ): తమిళనాడులో డీఎంకే ప్రభుత్వానికి ఏడాది కాలం పూర్తి చేసుకుంది. ఈ నేపథ్యంలో వనివారం ఆ రాష్ట్ర సీఎం స్టాలిన్ ప్రభుత్వ బస్సులో ప్రయాణించారు. మెరీనా బీచ్లో ఉన్న కరుణానిధి స్మారకం, అన్నా మెమోరియల్కు చేరుకునేందుకు స్టాలిన్ బస్సులో వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వ బస్సుల పనితీరును తనిఖీ చేశారు. ప్రయాణికులు, కండక్టర్తో ముచ్చటించారు. బస్సు సౌకర్యాలపై ఆయన అడిగి తెలుసుకున్నారు. మెరీనా బీచ్ బస్సులో చేరుకున్న సీఎం స్టాలిన్.. అక్కడ ఉన్న మాజీ సీఎం కరుణానిధి స్మారకం వద్ద నివాళి అర్పించారు.

డీఎంకే వ్యవస్థాపకుడు, మాజీ సీఎం సీఎన్ అన్నాదురై మెమోరియల్ వద్ద పుష్పగుచ్ఛంతో నివాళి అర్పించారు. ఆ తర్వాత అసెంబ్లీలో సీఎం స్టాలిక్ అయిదు కీలక ప్రకటనలు చేశారు.

ప్రభుత్వ స్కూల్లలో ఒకటి నుంచి 5వ తరగతి పిల్లల కోసం బ్రేక్ఫాస్ట్ స్కీమ్ను ప్రకటించారు. స్కూల్స్ ఆఫ్ ఎక్సలెన్స్, మెడికల్ చకప్, పట్టణ కేంద్రాల్లో పీహెచ్సీల ఏర్పాటుపై ప్రకటన చేవారు. అన్ని నియోజకవర్గాల్లో సీఎం అన్న స్కీమ్ను కూడా ప్రకటించారు.

# ఆమె జీవితం అందరికీ ఆదర్శం..

## అమ్మను మించిన దైవం లేదు...

ఆకాశాన్ని అడిగితే చెబుతుంది అమ్మ ప్రేమ తన కంటే విశాలమైందని.. సాగరాన్ని అడిగినా చెబుతుంది అమ్మ మనసు కన కంటే లోతైనది అని.. కొండ తేనేను అడిగితే చెబుతుంది అమ్మ మమత తన కంటే తియ్యగా ఉంటుందని.. తియ్యని రాగాలు పలికే కోయిలను అడిగినా చెబుతుంది.. అమ్మ పిలుపు తన పాట కంటే అద్భుతమైనదని.. కొవ్వొత్తిని అడిగితే చెబుతుంది..
అమ్మ త్యాగం తన కంటే కోటి రెట్లు ఎక్కువని.. భూదేవిని అడిగినా చెబుతుంది.. అమ్మ అంటేనే ఓర్పు అని.. ఓర్పు అంటేనే కాస్త.. బిడ్డ ఒడిలో పడిన వెంటనే మరచిపోతుంది. వీటన్నింటి సంగతి పక్కనబెడితే. ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా మదర్స్ డే ఎందుకు జరుపుకుంటారు.. ఎప్పుడు జరుపుకుంటారు.. అనే ఆసక్తికరమైన విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం.

### మాతృ దినోత్సవం సందర్భంగా ప్రజామంటలు ప్రత్యేక కథనం




అమ్మ అని.. అందుకే ఈ సృష్టిలో అమ్మే గొప్పది.. అమ్మ కన్నా మిన్న ఎవ్వరూ లేరు' అని కొందరు కవులు, మేధావులు చెబుతుంటారు. అయితే అమ్మ గురించి మనం ఎంత మాట్లాడినా తక్కువే అవుతుంది. అంత కమ్మనిది అమ్మ ప్రేమ.
కడుపులో నలుసు పడిన నాటి నుండి తొమ్మిది నెలల పాటు ఎంతో సహనంతో.. ఎన్నో అడ్డంకులను ఎదుర్కొని తన రక్త మాంసాలు పంచి పునర్జన్మనెత్తుకుంటుంది. అయితే అప్పటివరకు పడిన పురిటినొప్పులను ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం మే మాసంలోని రెండో ఆదివారం నాడు మాతృ దినోత్సవం(%వీశ్రీష్త్రవతీ%'%ం ఋఎ%) జరుపుకుంటారు. అయితే తల్లుల దినోత్సవం జరుపుకోవడం వెనుక ఓ పెద్ద చరిత్ర మరియు ఓ నేపథ్యం ఉంది.

– మదర్ ఆఫ్ గాడ్స్..
గ్రీస్ దేశంలో 'రియా' అనే దేవతను 'మదర్ ఆఫ్ గాడ్స్'గా భావించి సంవత్సరానికి ఒకసారి నివాళి అర్పించేవారు. 17వ శతాబ్దంలో బ్రిటన్లో తల్లులకు గౌరవంగా 'మదరింగ్ సండే' పేరిట ఉత్సవాన్ని నిర్వహించేవారు. 'జూలియవర్డ్ హెూవే' అనే మహిళ అమెరికాలో 1872లో తొలిసారిగా ప్రపంచ శాంతి కోసం మదర్స్ ను నిర్వహించాలని ప్రతిపాదించిది మదర్స్ డే కోసం..

అన్న మేరీ జర్విస్ అనే మహిళ 'మదర్స్ ఫ్రెండ్ షిప్ డే' జరిపించేందుకు ఎంతగానో క్రుషి చేసింది. ఆమె 1905 సంవత్సరంలో మే 9వ తేదీ మరణించగా.. ఆమె కుమార్తె మిస్ జెర్విస్ మాతృ దినోత్సవం కోసం ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేసింది. దీంతో 1914 నాటికి అమెరికాలోని అన్ని రాష్ట్రాల్లో ఈ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని అప్పటి అమెరికా అధ్యక్షుడు ఉడ్రో విల్సన్ నిర్ణయించారు.
మాతృ దినోత్సవాన్ని..
ఇదే ఆనవాయితీని కాలక్రమేణా ప్రతి సంవత్సరం జరుపుకోవడం ప్రారంభించారు. అప్పటి ప్రతి ఏటా మే నెలలోని రెండో ఆదివారం మాతృ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తూ వస్తున్నారు

ప్రత్యక్ష దైవమే అమ్మ..
ఈ ప్రపంచంలో అత్యంత పేదవాడు అంటే డబ్బు లేని వాడు కాదు... ఎవరైతే అమ్మ ప్రేమను దక్కించుకోలేకపోతారో వారే అసలైన పేదవారు. అమ్మ ప్రేమను దక్కించుకున్నవారు అత్యంత కోటీశ్వరులు. బిడ్డను ప్రేమగా చూసే ప్రతి తల్లి 'మదర్ థెరిసా'నే అని చెప్పడంలో ఎలాంటి సందేహం అక్కర్లేదు. అమ్మ నడకతో పాటు నాగరికతనూ నేర్పిస్తుంది. అంతులేని ప్రేమానురాగాలను పంచుతుంది. ఆప్యాయతకు మారుపేరైన తల్లి ఎవరికైనా ప్రత్యక్ష దైవమే.

(కోక్కుల వంశీ రిపోర్టర్)



# తెలంగాణను కాంగ్రెస్ ఇవ్వలే

### కెసిఆర్ కొట్లాడి తెచ్చిండన్న మంత్రి తలసాని
### సోనియా ఏమన్న ప్రధానా ఇవ్వడానికన్న జీవన్ రెడ్డి

హైదరాబాద్,మే7: తెలంగాణ ఇచ్చానని చెప్పుకుంటున్న రాహుల్ వ్యాఖ్యలపై మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ మండిపడ్డారు. తెలంగాణ కోసం కెసిఆర్ పోరాడారని, చావునోట్లో తలపెట్టి తెచ్చుకున్నారని అన్నారు. ఇందులో కాంగ్రెస్ ఇచ్చిందేమీ లేదన్నారు. రైతు సంఘర్షణ... కాంగ్రెస్ అంతర్గత సభ లాగా ఉందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. మద్దతు ధర ఇస్తామని చెప్పారు కానీ అది రాష్ట్రానికా లేక దేశానికా అనేది చెప్పలేదన్నారు. 40 ఏళ్ల పాటు కాంగ్రెస్ పాలించిందని.. అప్పుడెందుకు ఇవ్వలేదన్నారు. రైతులను ఆదుకునేందుకు టీఆర్ఎస్ ప్రభుత్వం అనేక పథకాలు తీసుకొచ్చిందన్నారు. కాళేశ్వరం బెస్ట్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ అని గుర్తింపు వచ్చింది. రైతులకు అది చేస్తాం.. ఇది చేస్తాం అని చెప్తున్నారు. వీళ్లేమైన స్టడీ చేసి మాట్లాడుతున్నారా లేదా తెలియదు. టూరిస్టుల్లాగా వచ్చి మాట్లాడుతున్నారు. నడ్డా, రాహుల్ గాంధీ సభలకు పర్మిషన్ ఇచ్చారు. కొన్ని చోట్లా అక్కడి పరిస్థితులు అక్కడి ఇన్చార్జిలు అనుమతులు ఇవ్వాలి. ఓయూలో పరీక్షలు జరుగుతున్నాయి. డిస్టర్బ్ చేయొద్దని వీసీ అనుమతి ఇవ్వలేదు. జైల్లో అధికారులు అనుమతి ఇవ్వాలి. అది వాళ్ల పరిధిలో ఉన్న అంశం. ప్రభుత్వానికి ఏం సంబంధం? తెలంగాణ మీరు ఇవ్వలేదు, కేసీఆర్ తెచ్చుకున్నారు. చావు నోట్లో తలపెట్టి కేసీఆర్ తెలంగాణ సాదించుకున్నారని పేర్కొన్నారు.కాంగ్రెస్ ది రైతు సంఘర్షణ సభ కాదని...కాంగ్రెస్ కొట్లట సభ అని టీఆర్ఎస్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ... ఆయన రాహుల్ గాంధీ కాదని...రాజరికపు గాంధీ అని వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ డిక్లరేషన్ కాదు..ఫ్రస్టేషన్ అని అన్నారు. కాంగ్రెస్ అంటే ఇండియన్ నేషనల్ క్లబ్ పార్టీ అని తెలిపారు. ఢిల్లీ వాసి రాహుల్... గల్లీలో సన్నాసి రేవంత్‌ను ఏం మాట్లాడాలని అడుగుతున్నారని అన్నారు. కాంగ్రెస్ అంటే పెండింగ్ ప్రాజెక్టులు.. కేసీఆర్ అంటే రన్నింగ్ ప్రాజెక్టులని చెప్పుకొచ్చారు. రాహుల్ ది ఐ రన్ లెగ్... ఆయన ఎక్కడ సభ పెట్టినా అక్కడ కాంగ్రెస్ ఔట్ అన్నారు. రాహుల్ ఏ హోదాలో వచ్చావు... నువ్వు ఏమైనా కాంగ్రెస్ అధ్యక్షుడివా అని ప్రశ్నించారు. రాహుల్ ఎలా డిక్లరేషన్ ప్రకటిస్తారని నిలదీశారు. రాజగోపాల్ రెడ్డి మీటింగ్ కు గైర్హాజరు అయ్యారన్నారు. రాష్ట్రానికి అనేక మంది టూరిస్టులు వస్తున్నారని....వారిని పట్టించుకోవాల్సిన అవసరం లేదని తెలిపారు. కాంగ్రెస్‌కు గ్యారంటీ... వారంటీ రెండూ లేదన్నారు. జలయజ్ఞం పేరిట ధనయజ్ఞం చేశారని ఆరోపించారు. మీది మొబిలైజేషన్..మాది సోషలైజేషన్. ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మరు. సోనియా ప్రధాన మంత్రా...ఆమె తెలంగాణ ఇవ్వడానికి అంటూ జీవన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

## సామాన్యులకు మరోమారు కేంద్రం షాక్

- గ్యాస్ సిలిండర్ దర మరో 50 వడ్డింపు
- ధరల పెంపుపై మండిపడ్డ కాంగ్రెస్



న్యూఢిల్లీ,మే7: కేంద్రంలోని బీజేపీ సర్కార్ మరోసారి సామాన్యులకు షాకిచ్చింది. ఈ నెల 1న కమర్షియల్ సిలిండర్ ధరలు పెంచిన ప్రభుత్వం.. ఈసారి గృహావసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్‌పై వడ్డించింది. 14 కేజీల సిలిండర్‌పై రూ.50 పెంచుతూ దేశీయ ఇంధన కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి. దీంతో గ్యాస్ సిలిండర్ ధర రూ.1052కు చేరింది. దీనికి డెలివరీ బాయ్స్ తీసుకునే రూ.30 కలిపితే రూ.1082 అవుతుంది. పెంచిన ధరలు వెంటనే అమల్లోకి వస్తాయని ప్రకటించాయి. గృహావస రాలకు వినియోగించే సిలిండర్ ధరను మార్చి 22న పెంచిన విషయం తెలిసిందే. ఈ నెల 1న కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరను భారీగా పెంచిన విషయం తెలిసిందే. 19 కిలోల సిలిండర్‌పై ఒకేసారి రూ.250 వడ్డించాయి. దీంతో సిలిండర్ ధర రూ.2460కు పెరిగింది. వారం రోజుల వ్యవధిలోనే గ్యాస్ సిలిండర్ ధరలు భారీగా పెరగడంతో సామాన్యులు ఇబ్బంది పడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం శనివారం ఎల్‌పీజీ సిలిండర్ల ధరల పెంపును ప్రకటించడంతో మోదీ సర్కార్‌పై కాంగ్రెస్ ప్రతినిధి పవన్ ఖేరా విరుచుకు పడ్డారు. ప్రధాని నరేంద్ర మోదీ యూరప్ టూర్‌ను ప్రస్తావిస్తూ మూడు దేశాల్లో 65 గంటలు..60 ఫోటోషూట్‌లతో హడావిడి చేసిన మోదీ సాబ్ ఎల్‌పీజీ ధరల బహుమతితో దేశానికి తిరిగివచ్చారని ఎద్దేవా చేశారు. ఎల్‌పీజీ సిలిండర్ ధరను కేంద్రం రూ 50 పెంచడంతో సిలిండర్ ధర రేపటి నుంచి పలు ప్రాంతాల్లో ఏకంగా వేయికి ఎగబాకనుంది. మోదీ ప్రభుత్వం నిత్యావసరాల ధరల పెంపుతో సామాన్యుడిపై పెనుభారం మోపుతోందని ఖేరా దుయ్యబట్టారు. సబ్సిడీ వదిలివేయాలని మోదీ సర్కార్ ప్రజలను కోరుతోందని అన్నారు. తరచూ గ్యాస్, పెట్రో ధరలు పెంచుతూ ప్రజలపై ధరల భారాన్ని మోపుతోందని అన్నారు.ధరల మోతను తట్టుకోలేని దశలో ప్రజలు ఎల్‌పీజీ సిలిండర్లను అప్పగించే పరిస్థితి తీసుకువచ్చారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజలను ఆదుకుంటే మోదీ ప్రభుత్వం సామాన్యుల నడ్డి విరుస్తోందని పవన్ ఖేరా విమర్శించారు.

## కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేది లేదు

### గెలిచిన ఎమ్మెల్యేలు టిఆర్ఎస్‌లో చేరుతారు
### రాహుల్ పర్యటనపై మండిపడ్డ బిజెపినేత లక్ష్మణ్

న్యూఢిల్లీ,మే7: కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు చెయ్యని పనులు ఇప్పుడు చేస్తామనంటే నమ్మడానికి ఎవరు సిద్ధంగా లేరని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు లక్ష్మణ్ అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేది లేదని స్పష్టం చేశారు. తెలంగాణలో రాహుల్ టూర్‌పై లక్ష్మణ్ స్పందించారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ... కాంగ్రెస్ ఢిల్లీలో లేదు, గల్లీలో లేదని... రెండు రాష్ట్రాలకు మాత్రమే పరిమితమైందని అన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ ద్వారానే తెలంగాణ రైతులకు, నిరుద్యోగు లకు మేలు జరుగుతుందని చెప్పారు. టీఆర్ఎస్‌తో పొత్తుల చరిత్ర కాంగ్రెస్‌దని వ్యాఖ్యానించారు. టీఆర్ఎస్‌తో బీజేపీ ఏనాడు పొత్తు పెట్టుకోలేదు, పెట్టుకోదని స్పష్టం చేశారు. కాంగ్రెస్‌కు ఓటేసినా టీఆర్ఎస్‌కే చెల్లుతుందన్నారు. గెలిసిన వాళ్ళందరూ మూకుమ్మడిగా టీఆర్ఎస్‌లో చేరటం ఖాయమని బీజేపీ తెలిపారు. రాహుల్ సభలు వృథా ప్రయాస అని అన్నారు.



గెలిపించిన ఎమ్మెల్యేలను కాపాడు కోలేని పార్టీ కాంగ్రెస్ అని విమర్శించారు. కాంగ్రెస్, టీఆర్ఎస్ ఒక గూటి పక్షులే అని... ఎన్నికల ముందో ఎన్నికల తర్వాతో కలుస్తారన్నారు. బీజేపీని ఎదుర్కునేందుకు కాంగ్రెస్, టీఆర్ఎస్, మజ్లీస్‌లు ప్రయత్నాలు చేస్తున్నాయని తెలిపారు. రాజ్యాంగ సంస్థల్లో కేంద్రం జోక్యం ఉండదని తేల్చిచెప్పారు. ఎవరైనా అవినీతికి పాల్పడితే చట్టరీత్యా ఆయా సంస్థలు చర్యలు తీసుకుంటాయని లక్ష్మణ్ వెల్లడించారు.

### రాహుల్ గాంధీ వరంగల్ పర్యటన వల్ల రాష్ట్రానికి, దేశానికి

# ఒరిగిందేమీ లేదు

**మొదటిపేజీ తరువాయి..**

సభ ద్వారా తేటతెల్లం అయిందని, సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న వ్యవసాయ విధానం యావత్ దేశానికి ఆదర్శంగా నిలిచిందని, ఇదే విషయాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన ఉన్న నీతి ఆయోగ్ పలుమార్లు ప్రశంశలు కురిపించింది అని వినోద్ కుమార్ గుర్తుచేశారు.

సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న వ్యవసాయ విధానాన్ని రాహుల్ గాంధీ అనుసరించారని, ప్రధాని నరేంద్ర మోడీ, కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ సహా దేశవ్యాప్త పార్టీల నాయకులు కేసీఆర్ వ్యవసాయ విధాన మార్గాన్ని అనుసరించక తప్పని పరిస్థితి నెలకొందని, రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలనే రాహుల్ గాంధీ వరంగల్ సభలో ప్రకటించారని ఆయన అన్నారు.
రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు, రైతు బీమా వంటి పథకాలు ఇప్పటికే అమలు చేస్తోందని, ఇదే విషయాన్ని కాంగ్రెస్ పార్టీ వరంగల్ డిక్లరేషన్ లో ప్రకటించిందని, రైతుల పాలిట ప్రాణ సంకటంగా మారిన నకిలీ విత్తనాలు, నకిలీ పురుగు మందుల విక్రయదారుల ఆట పట్టించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పీడీ యాక్ట్ ను ఇప్పటికీ అమలు చేస్తోందని, ఇదే విషయాన్ని కాంగ్రెస్ తన డిక్లరేషన్లో చెప్పిందని ఆయన తెలిపారు.
ధరణి పోర్టల్ ద్వారా రెవెన్యూ రికార్డులు అన్నింటిని, భూముల వివరాలన్నీ పక్కాగా పొందుపరుస్తున్నామని, కానీ కాంగ్రెస్ వరంగల్ డిక్లరేషన్ ద్వారా మళ్లీ పట్వారి వ్యవస్థను తీసుకువచ్చేందుకు కుట్ర పన్నుతున్నట్లుగా స్పష్టమవుతోందని, రాష్ట్రంలో చక్కెర కర్మాగారాలు సహా అనేక పరిశ్రమలు మూత పడటానికి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమే ప్రధాన కారణమని ఆయన ఆరోపించారు. ఇప్పుడు ఏ మొహం పెట్టుకొని మూతపడిన పరిశ్రమలను తెరిపిస్తామని అంటున్నారని ఆయన ప్రశ్నించారు.

### వైద్యారోగ్య రంగం

# మరింత పటిష్టం

**మొదటిపేజీ తరువాయి..**

రూపొందించినట్లు పేర్కొన్నారు. ఆసుపత్రుల్లోని అన్ని వైద్య పరికరాలు 10 రోజుల్లో ఏఎంసీ కాంట్రాక్టు పరిధిలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని, అన్ని వైద్య పరికరాల వినియోగం సమర్థవంతంగా జరగాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిచడమే లక్ష్యంగా అందరం కలిసి పని చేసి, ప్రభుత్వానికి మంచి పేరు తేవాలన్నారు.
అనవసరంగా పేషెంట్లను హైదరాబాద్‌కు రిఫర్ చేయడం తగ్గించాలని, పేషెంట్లు ప్రైవేటు దవాఖానాలకు వెళ్లి ఆర్థికంగా నష్టపోకుండా చూడాలన్నారు. జిల్లా స్థాయిలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని సేవలు అందుబాటులో ఉన్నాయని, వాటిని ప్రజలకు అందేలా చూడాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో డెలివరీలు పెరగాలని, సాధారణ ప్రసవాలు పెరిగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని ఏరియా ఆసుపత్రుల్లో కాటరాక్ట్ ఆపరేషన్లు చేయాలని, పలు ఆసుపత్రుల్లో సీ సెక్షన్ల సంఖ్య గత నెలలో పోల్చితే తగ్గాయన్న మంత్రి.. ఈ మేరకు అధికారులను అభినందించారు. ఫ్యామిలీ ఆపరేషన్లు చేయాలని, అన్ని ఆసుపత్రుల్లో మందుల కొరత లేకుండా లేకుండా చూస్తున్నామన్నారు. ఏ ఆసుపత్రిలో, ఎక్కడ కూడా మందుల కొరత ఉండకూడదని స్పష్టం చేశారు. బయటికి మందులు రాయొద్దని, అలాంటి వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వేసవి వేళ ఆసుపత్రుల్లో తాగునీటి కొరత లేకుండా చూడాలని, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వచ్చే నెల సమీక్ష వరకు పని తీరులో మరింత పురోగతి సాధించాలని, వైద్యులు 9 గంటల నుంచి 4 వరకు అందుబాటులో ఉండాలన్నారు.
సర్జరీలు ఎప్పటికపుడు చేయాలని, ప్రభుత్వం డ్రగ్స్, డైట్, శానిటేషన్ కోసం ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించిందన్నారు. ఆసుపత్రుల్లో ఆకస్మికంగా సందర్శించనున్నట్లు చెప్పారు. మంత్రులు, ఎమ్మెల్యేలను భాగస్వామ్యం చేయాలని, మంచి వైద్యాన్ని ప్రజలకు అందించాలనిన్నారు. సమావేశంలో టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్, డీఎంఈ రమేశ్‌రెడ్డి, డీహెచ్ శ్రీనివాస రావు, టీఎస్ఎంఎస్ ఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, ఎండీ చంద్రశేఖర్ రెడ్డి, అన్ని ఏరియా ఆసుపత్రుల సూపరింటెండెంట్స్, డీసీహెచ్ఎస్‌లు పాల్గొన్నారు.

## కామారెడ్డిలో విషాదం

**మొదటిపేజీ తరువాయి..**


ముగ్గురు మృతిచెందారు. మృతులను లింగపేట మండలంలోని ముంబాజిపేటకు



చెందిన బోయినీ లింగవ్వ, ఆమె కూతురు రీనా, మేనకోడలు సౌమికగా గుర్తించారు. వీరంతా మౌలాన్ ఖేడ్ గ్రామంలో ఉన్న బంధువుల ఇంటికి వచ్చి నిజాంసాగర్ బ్యాక్ వాటర్‌లో ఆటలాడుతుండగా.. నీటిలో మునిగి చనిపోయారని పోలీసులు తెలిపారు.

## కాంగ్రెస్ వరంగల్ డిక్లరేషన్‌ను స్వాగతిస్తున్న : గద్దర్

హైదరాబాద్,మే7: కాంగ్రెస్ వరంగల్ డిక్లరేషన్‌ను స్వాగతిస్తున్నట్లు ప్రజాకవి గద్దర్ తెలిపారు. తెలంగాణలో గగుణాత్మక మార్పు లేదన్నారు. తెలంగాణ ఉద్యమకారులు హరగోపాల్, కంచె ఐలయ్యలతో కలిసి గద్దర్ ఇవాళ ఉదయం రాహుల్ ను కలిశారు. అంతకు ముందు మీడియాతో మాట్లాడిన గద్దర్..రాహుల్ ను మనవడని సంబోధించారు. తెలంగాణలో నెలకొన్న సమస్యలను రాహుల్ దృష్టికి తీసుకవెళ్తానన్నారు. తెలంగాణ సాదించుకున్నాక కూడా ఎవరు సంతృప్తిగా లేరన్నారు. తెలంగాణలో



గుణాత్మక మార్పు లేదన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు యువతకు నాయకత్వం అప్పగించాలన్నారు. యువ నాయకత్వం ప్రజలను చైతన్యవంతం చేస్తూ ముందుకు సాగాలన్నారు.

### ప్రపంచస్థాయి ఆలయంగా

# యాదాద్రి

**మొదటిపేజీ తరువాయి..**

ఫ్యాన్ల నిర్వహణ సక్రమంగా ఉండేలా చూడటం, వృద్ధులు, వికలాంగులకు వీల్ చైర్ లు అందుబాటులో ఉండేలా చూడటం, కొండ కింద మొబైల్ టాయ్లెట్స్ ఏర్పాటు, ఇతర వసతులు ఏర్పాటు పై సమావేశంలో చర్చించారు. అకాల వర్షం వల్ల ఉత్పన్నమైన సమస్యలు, పునరుద్ధరణ చర్యలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. కూలిన పందిళ్లు, వాననీటి లీకేజీలు, ఇతర నష్టాలపై ఆరా తీశారు. ఇలాంటి సమస్యలు భవిష్యత్ లో పునరావృతం కాకుండా వర్షకాలంలోగా వాటిని అధిగమించేందుకు చర్యలు తీసుకోవాల న్నారు. మౌలిక వసతులపై ప్రధానంగా దృష్టి పెట్టాలని, సామన్య భక్తులకు శీఘ్రదర్శనం జరిగేలా చూడాలన్నారు. ప్రధాన ఆలయంతో పాటు మిగితా నిర్మాణాలు నూతనంగా చేపట్టినందు వల్ల కొన్ని రోజుల పాటు నిర్వహణలో పురోగతి చూపిస్తూ మందుకు వెళ్ళాల్సి ఉంటుందని, దీన్ని పెద్ద తప్పిదంగానో లేదా పొరపాట్లుగా చూడాల్సిన లేదని అభిప్రాయపడ్డారు.
సర్దుబాటు సమయంగా దీన్ని భావించి, అన్ని అడ్డంకులను అధిగమించి అద్భుతమైన వసతులు కల్పించే దిశగా ప్రభుత్వం పని చేస్తుందని స్పష్టం చేశారు. భక్తులు క్యూ లైన్లలో ఎక్కువ సమయం వేచి ఉండకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. క్యూ లైన్లు, ఆలయ ప్రాంగణంలో వేచి ఉన్న అన్ని సమయాలలో భక్తులకు మంచినీరు అందించాలని, అదేవిధంగా భక్తులు ఎండవేడిమి నుంచి సేద తీరేవిధంగా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. వసతి కల్పనలో ఆలస్యం లేకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. యాదాద్రిని ప్రపంచ స్థాయి పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దడానికి సీఎం కేసీఆర్ యాదాద్రి ఆలయ పునర్నిర్మాణం చేశారన్నారు. స్వయంభు దర్శనాల ప్రారంభం తర్వాత అక్కడ చిన్న చిన్న సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని, ఒక్కొక్కటిగా వాటిని పరిష్కరిస్తూ సమస్యలను అధిగమిస్తున్నామని తెలిపారు. యాదాద్రికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆహ్లాదకర, ప్రశాంత వాతావరణంలో స్వామివారిని దర్శించకుని వేళ్లేలా ఎల్లవేళల కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. 79 మిల్లీమీటర్ల అకాల భారీ వర్షం కారణంగా నిర్మాణంలో రోడ్లు దెబ్బతిన్నాయని, ఆలయ ప్రాంగణంలో పెండింగ్ పనులు కొనసాగుతుండటంతో పైప్ లైన్ లో మట్టి, ఇసుక కూరుకుపోయి నీరు నిలిచిపోయిందే తప్పా నాసిరకం పనుల వల్లో, నిర్మాణ లోపం వల్లో అలా జరగలేదని స్పష్టం చేశారు. భారీ వర్షం కారణంగా దెబ్బతిన్న రోడ్లు, ఇతర పనులను వెంటనే పునరుద్ధరించారని. అకాల వర్షాలతో ఉత్పన్నమైన చిన్న చిన్న సమస్యలను అధిగమించామని తెలిపారు.



జగిత్యాలలోని స్వామి వివేకానంద స్టేడియంలో బాస్కెట్ బాల్ క్రీడాకారుడు శ్రీరామ్ ఆధ్వర్యంలో ఉచిత బాస్కెట్ బాల్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్. పాల్గొన్న కౌన్సిలర్ చుక్క నవీన్, జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు టివి సూర్యం, సీనియర్ నాయకులు సుధాకర్, చందా సాయి, క్రీడాకారులు

## కంచి పీఠాధిపతి చేతుల మీదుగా ఐఎస్ఓ సర్టిఫికెట్ల అందచేత

### శ్రీ స్కందగిరి ఆలయానికి 7 ఐఎస్ఓ సర్టిఫికెట్లు

**సికింద్రాబాద్ మే 06 (ప్రజామంటలు):** పలు విభాగాల్లో అత్యున్నత ప్రమాణాలు పాటించినందుకు గుర్తింపుగా స్కందగిరి శ్రీసుబ్రహ్మణ్యస్వామి ఆలయానికి ఏడు



ఐఎస్ఓ సర్టిఫికెట్లు లభించాయి. ఈ సందర్భంగా 7 ఐఎస్ఓ సర్టిపికెట్లను కంచి కామకోటి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామి చేతుల మీదుగా ఆలయ మేనేజింగ్ ట్రస్టీ కృష్ణన్ రాజామణి అందుకున్నారు. ఆలయంలో ఐఎస్ఓ సర్టిఫైడ్ ఆడిటర్ ఆలపాటి శివయ్య ఆధ్యరంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. ఒకేసారి ఏడు ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డైజేషన్ సర్టిఫికెట్లు లభించడం నిజంగా గొప్ప విషయమని ఈసందర్భంగా కంచి కామకోటి పీఠాధిపతి ఆలయ నిర్వాహకులను అభినందించారు.

## వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎంపీపీ

**ఇబ్రహీంపట్నం మే 07 (ప్రజామంటలు):** మండల పరిధిలోని యమపూర్, పకీర్ కొండాపూర్, గ్రామాలలో ఐకేపీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎంపీపీ జాజాల భీమేశ్వరి. ఇట్టి కార్యక్రమంలో వైస్ ఎంపిపి నోముల



లక్ష్మరెడ్డి, 2 గ్రామాల సర్పంచులు మనీషా గుంటి లక్ష్మి, నాయకులు జగన్ రావు, ద్యావతి సుమన్, తలారి ఆనంద్, మహేష్, మరియు ఏపీఎం శంకర్ పాల్గొన్నారు.

## మార్కెట్ యార్డ్‌కు భూమి పూజ చేసిన సర్పంచ్, రావుల రమేష్

**తిమ్మాపూర్ మే 07 (ప్రజామంటలు):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం నుస్తులా పూర్ గ్రామంలో తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఛైర్మెన్ మరియు మానకొండూర్ శాసనసభ్యుడు రసమయి బాలకిషన్ సహకారంతో ఈరోజు నుస్తులపూర్ గ్రామంలో తిమ్మాపూర్ మండల అధ్యక్షులు మరియు నుస్తులపూర్ గ్రామ సర్పంచ్ రావుల రమేష్ నుస్తులాపూర్ గ్రామ ప్రజలకు మార్కెట్ యార్డు కొరకై 12 లక్షల నిధులు మంజూరు చేయించి అనంతరం భూమి పూజ చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ రమేష్ మాట్లాడుతూ.... గ్రామంలో వార సంత రోడ్లపై నిర్వహించడంతో గ్రామ అడబిడ్డలు పడుతున్న ఇబ్బందులు చూడలేక వెంటనే ఎమ్మెల్యే గారి దృష్టికి తీసుకెళ్లి మార్కెట్ యార్డ్ కొరకు నిధులు మంజూరు చేయించారని అన్నారు. 100 రోజులలో మార్కెట్ యార్డ్ నిర్మాణం పూర్తి చేసి గ్రామ ఆడబిడ్డలకు ఉపయోగంలోకి తీసుకొస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, వార్డు సభ్యులు, కార్యదర్శి శేఖర్ రెడ్డి, ఎంపిటిసి తిరుపతి రెడ్డి, గ్రామ కోఆప్షన్ కనకయ్య, శ్రీనివాస్ రెడ్డి, మండల కోఆప్షన్ సయ్యద్ తాజోద్దీన్, పార్టీ శ్రేణులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్ట్‌ల వెన్నంటే ఉంటా

### - ఎమ్మెల్యే సంజయ్ కుమార్

**జగిత్యాల మే 07 (ప్రజామంటలు):** జగిత్యాల పట్టణ వి కెబి ఫంక్షన్ హాల్ టీ యూ డబ్ల్యూ జె (ఐజెయూ) జగిత్యాల జిల్లా ద్వితీయ మహాసభ కార్యక్రమానికి హాజరైన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ అనంతరం జర్నలిస్ట్ ల అధ్వర్యంలో ఎమ్మెల్యే వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే చేత కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే సంజాయ్ కుమార్ మాట్లాడుతూ... జర్నలిస్ట్ ల వెన్నంటే ఉంటాను. కవితమ్మ ప్రోత్సాహముతో రాజకీయాల్లోకి వచ్చాను. "మీరు ఏకాభిప్రాయంతో రండి, జర్నలిస్ట్ సోదరులకు డబుల్ బెడ్ రూమ్ లు ఇవ్వడానికి నేను సిద్ధం". జర్నలిస్ట్ లకు ఇళ్ల స్థలాల విషయం కోర్ట్ పరిధిలో ఉంది. కవితమ్మ ఓడిపోవడంతో చాలా ఇబ్బందులు పడ్డాను. జర్నలిస్ట్ సోదురలకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వైద్యము, విద్య విషయములో అండగా ఉంటాను. ప్రెస్ భవన్ విషయం లోను నేను సహకరిస్తాను అన్నారు.



## ఉచిత కరాటే శిబిరానికి పెరుగుతున్న ఆదరణ

**జనగామ మే 07 (ప్రజామంటలు):** అమ్మ ఫౌండేషన్, సేవ్ జనగామ వారి సహకారంతో ప్రారంభించిన ఉచిత వేసవి కరాటే శిక్షణ శిబిరానికి విశేషమైన స్పందన, ఆదరణ వస్తుంది. శనివారం 60 మంది విద్యార్థులకంటే ఎక్కువ మంది హాజరు కావడం ఇందుకు నిదర్శనం. జనగామ జిల్లా కేంద్రంలోని బతుకమ్మకుంటలో జపాన్ కరాటే అసోసియేషన్, జనగామ శాఖ ఆధ్వర్యంలో మాస్టర్ కొయ్యడ రవి పిల్లలకు చాలా చక్కగా కరాటే మెలుకువలు నేర్పుతు న్నారు. పిల్లలు ఈ మొదటి వారంలో చాలా చురుగ్గా తయారు కావడం తల్లిదండ్రుల్లో సంతోషం వ్యక్తం అవుతుంది. ఈ సందర్భంగా కరాటే మాస్టర్ కొయ్యడ రవి మాట్లాడుతూ.... పిల్లలు ఎంతో చక్కగ, శ్రద్దగా నేర్చుకుంటున్నారని, ఈ వారంలోనే పిల్లలు క్రమశిక్షణతో మెలుకువలు నేర్చుకుంటున్నారని వివరించారు. ప్రస్తుత కాలంలో ప్రతీ ఒక్కరికి ఆత్మరక్షణ కోసం కరాటే ఎంతో అవసరమని భావించి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కరాటే శిబిరానికి ముఖ్య అతిథిగా దళిత రత్న, వరల్డ్ రికార్డ్ హోల్డర్, మృదు-స్వభావి, ప్రముఖ వైద్యులు డాక్టర్ పగిడిపాటి సుగుణాకర్ రాజు పాల్గొన్నారు. వారి చేతుల మీదుగా పిల్లలకు అరటి పండ్లు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపాలిటీ చేర్-పర్సన్ పోకల జమున లింగయ్య, కౌన్సిలర్లు వాకుడోతు అనిత, స్వప్న, పానుగంటి ప్రవీణ్ పాల్గొన్నారు. ఇంతటి బృహత్తర కార్యక్రమానికి తమకు పూర్తి సహకారాలు అందిస్తున్న జనగామ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణి, సేవ్-జనగామకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వి.ఎస్.ఎఫ్. రాష్ట్ర ప్రదాన కార్యదర్శి కోంద్ర ప్రవీణ్, అమ్మ ఫౌండేషన్ ప్రతినిధులు సల్ల మహేష్, మద్దెల కార్తీక్, బింగి నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.



## ఉజ్జయిని ఆలయంలో అదనపు విగ్రహం వద్దు

### భక్తుల మనోభావాలు, వాస్తుకు ఇది భంగకరం

### ఎండోమెంట్ కమిషనర్‌కు మాజీ మంత్రి, మర్రి శశిధర్ వినతి

**సికింద్రాబాద్ మే 07 (ప్రజామంటలు):** సికింద్రాబాద్ లోని ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయంలో అదనంగా మరో విగ్రహాన్ని ఏర్పాటు చేసే ప్రయత్నం మానుకోవాలని, దీనివలన ఆలయ వాస్తుకు, భక్తుల మనోభావాలకు భంగం కలుగుతుందని మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి రాష్ట్ర



దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్ కుమార్ ను కలసి విజ్ఞప్తి చేశారు. శనివారం ఎండోమెంట్ కమిషనర్ ను కలిసిన మర్రి శశిధర్ రెడ్డి ఈసందర్భంగా సికింద్రాబాద్ మహంకాళి దేవాలయంలో అదనంగా పెద్దదైన అమ్మవారి విగ్రహం ఏర్పాటుకు జరుగుతున్న ప్రయత్నాలను వివరించారు. 200 సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగిన ఉజ్జయిని మహంకాళి ఆలయం దిన,దినం అభివృద్ధి సాధిస్తుందని, ఆలయ ఆదాయం, భక్తుల సంఖ్య రోజు, రోజుకు పెరుగుతుందని, ఈ నేపద్యంలో అదనపు విగ్రహాన్ని ఏం ఆశించి పెట్టాలను కుంటున్నారని మర్రి శశిధర్ రెడ్డి ప్రశ్నించారు. ఆలయంలో యంత్ర బలం, జనాకర్షణ శక్తి ఆలయం స్థిరంగా అభివృద్ధి చెందుతుందని, వాస్తు పురుష మండల సార్వత్రిక సూత్రాలకు విరుద్దంగా ఎలాంటి పనులు చేయవద్దని సూచించారు. మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ ఆదేశాలతో ఒత్తిడికి గురైన ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు ఇష్టం లేకున్నా అదనపు విగ్రహం ఏర్పాటుకు సంతకాలు చేశారన్నారు. 5 అడుగుల కన్నా ఎక్కువగా ఉండే అదనపు విగ్రహం ఆలయ సమతుల్యతను దెబ్బతీసి, పలు అరిష్టాలకు దారితీస్తుందని మర్రి శశిధర్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఉజ్జయిని మహంకాళి ఆలయంలో ప్రతి ఏడాది రంగం పేర నిర్వహించే భవిష్యవాణి కార్యక్రమం కోట్లాది మంది భక్తులను ఆకట్టుకుందని, భక్తుల విశ్వాసాలు, వారి ఆధ్యాత్మికతను దెబ్బ తీయకుండా ఆలయంలో అదనపు విగ్రహం ఏర్పాటు ఆలోచన విరమించుకోవాలని మర్రి శశిధర్ రెడ్డి ఎండోమెంట్ కమిషనర్ అనిల్ కుమార్‌ను కోరారు.

## పెరిగిన నిత్యావసర సరుకుల ధరలపై సీపీఐ సమరభేరి

**భీమదేవరపల్లి మే 07 (ప్రజామంటలు):** పెరిగిన నిత్యావసర సరుకుల ధరలు వెంటనే తగ్గించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్ళపల్లి శ్రీనివాసరావు ప్రభుత్వాలను డిమాండ్ చేసారు. సీపీఐ ఆధ్వర్యంలో హన్మకొండ జిల్లా



భీమదేవరపల్లి మండలం ములుకనూర్ అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా రాస్తారోకో నిర్వహించారు. ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ గుండు సూది నుండి మొదలుకొని ప్రాణాలు కాపాడే మందులు వరకు జీఎస్టీ పేరుతో రకరకాల పన్నులు వేసి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ధరలు విపరీతంగా పెంచారని అన్నారు. పెరిగిన ధరతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అచ్చే దిన్ అని మాట్లాడే మోడీ ధరలు మండిపోతుంటే ప్రజలు సచ్చే దిన్ పరిస్థితిలో ఉన్నారన్నారు. ప్రస్తుతం వంటనూనె రూ.130 నుండి 230, పెట్రోల్, డిజిల్ ధరలు సామాన్యులకు అందకుండా పోయాయని విమర్శించారు. మోడీ అధికారంలోకి వచ్చినప్పుడు గ్యాస్ రూ.460 ఉంటే ఇప్పుడు రూ. 1060లకు ఎగబాకిందన్నారు. ఆకాశాన్నంటిన ధరలతో మధ్య తరగతి, ఉద్యోగులు, సామాన్యులు బతక లేకుంటే ఇదేనా అచ్చే దిన్ అని ప్రశ్నించారు. ఇటీవల మోడీ బీజేపీయేతర రాష్ట్రాలు వ్యాట్ తగ్గించడం లేదు, కాబట్టే పెట్రోల్ డీజిల్ ధరలు అదుపులో లేవని చెప్పారు. నిజంగా కేంద్రానికి చిత్తశుద్ధి ఉంటే డీజిల్ పెట్రోల్ జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని డిమాండ్ చేసారు. పెట్రోల్ డీజిల్ ధరలను జీఎస్టీ పరిధిలోకి తెస్తే వ్యాట్ వసూలు చేసే అధికారం రాష్ట్రాలకు ఉండదన్నారు. కేంద్రం ఎందుకు పెట్రోల్ డీజల్ ధరలను జీఎస్టీకి తేవడంలేదో చెప్పాలన్నారు. వ్యాట్ వర్తించని కేంద్ర జీఎస్టీ పరిధిలో ఉన్న వంట గ్యాస్ పై మోడీ. ఎందుకు మాట్లాడడం లేదన్నారు. వంట గ్యాస్ ధరలపై వేస్తున్న ఎక్సైజ్, దిగుమతి తదితర పన్నులను ఎత్తివేసి ధరలను తగ్గించాలన్నారు. వంట నూనె, నిత్యావసర సరుకుల ధరలకు విధిస్తున్న సుంకం తగ్గించి సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆదరి శ్రీనివాస్, నాయకులు కర్రె లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు మంచాల రమ, మార్పు సంజీవ రెడ్డి, మంచాల తిరుపతి, గొర్రె బాబు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం మన అందరి బాధ్యత

**జనగామ మే 07 (ప్రజామంటలు):** జనగామ జిల్లా కేంద్రంలోని బతుకమ్మ కుంటలో జీవ వైవిధ్య యాజమాన్య కమిటీ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అదితిగా జనగామ మున్సిపల్, బీఎంసీ ఛైర్పర్సన్ పోకల జమున లింగయ్య మాట్లాడుతూ.... ప్రకృతి ప్రతి జీవరాశికి ఉపయోగ పడుతుందని అన్నారు. జీవరాశులు, క్రిమి కీటకాలు ఉంటేనే



జీవవైవిధ్యం ఉంటుందని అన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వం ఎంతో కృషిచేస్తోందని అన్నారు. ఈ నేపథ్యం లో ప్రజలు మొక్కలు నాటుతూ పక్షులను, జీవులను కాపాడుతూ పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని కోరారు. అటవీ విస్తీర్ణం తగ్గడం వల్ల అనేక జీవరాశులు అంతరించి ప్రకృతి సమతుల్యత దెబ్బతిని, మానవాళి మనుగడకు ముప్పు వాటిల్లుతోందని అన్నారు. అంతేకాక ఆరోగ్య సమస్యలు, మానవాళి అనేక రకాల సమస్యలు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. అందుకోసం ప్రతి ఒక్కరు చెట్లను నాటి దానిని సంరక్షించి, పక్షుల కోసం కొన్ని నీరు, ఆహారం అందించి జీవులను కాపాడాలని పిలుపునిచ్చారు. విశిష్ట అదితిగా విచ్చేసిన ప్రముఖ వైద్యులు, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ పగిడిపాటి సుగుణాకర్ రాజు మాట్లాడుతూ జీవవైవిధ్య సమతుల్యం లేకనే ప్రకృతి దెబ్బదినడం, ఓజోన్ పొర పాడు అవడం, వాతావరణం లో ఆక్సిజన్ లేక కరోన మహమ్మరికి గురిఅయ్యి ఇబ్బంది పడ్డారు అని గుర్తుచేశారు. పిల్లలు బాల్యం నుండే పర్యావరణ పరిరక్షణకు అలవాటు చేసుకోవాలి అని కోరారు. ఈ కార్యక్రమానికి జీవవైవిధ్య యాజమాన్య కమిటీ కార్యదర్శి పేర్ని స్వరూప, రెండవ వార్డ్ కౌన్సిల్లెర్ వంకుడొత్ అనిత, జీవవైవిధ్య కమిటీ సభ్యులు చెంచారపు పల్లవి, పానుగంటి ప్రవీణ్ కుమార్, అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణి, కరాటే మాస్టర్ కొయ్యడ రవి, నాయకులు కొంద్ర ప్రవీణ్, సల్ల మహేష్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.



## కరుణాపురంలో ఘనంగా జరిగిన క్రీస్తుజ్యోతి ప్రార్థన పండుగలు

**కరుణాపురం మే 07 (ప్రజామంటలు):** హన్మకొండ జిల్లా ధర్మసాగర్ మండలం కరుణాపురం గ్రామంలో సొసైటీ ఆఫ్ క్రైస్ట్ అధ్వర్యంలో క్రీస్తు జ్యోతి ప్రార్థన పండుగలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం నుండి శనివారం వరకు ఐదు రోజుల పాటూ చక్కని ఆత్మీయ వాతావరణంలో క్రీస్తు జ్యోతి మినిస్ట్రీస్ ఫౌండర్ డాక్టర్ సంగాల పాల్సన్ రాజు, డైరక్టర్ డాక్టర్ జయప్రకాశ్ గోపు లు చక్కని వ్యాఖ్యోపదేశం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పాల్సన్ రాజు మాట్లాడుతూ.... మానవులు ఆత్మీయంగా ఎదగడానికి దైవ ప్రార్థన ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. మానవాళి రక్షణ కోసం ప్రాణాన్ని ఫణంగా అర్పించిన యేసు ప్రభు ప్రార్థన జీవితం అందరికి అనుసరియమని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పిల్లలకు సిబిసి నిర్వహించారు. కళాప్రదర్శనలు కొనసాగాయి. వేలాది మంది విశ్వాసులు తండోప తండాలుగా వచ్చాయి. ఎంతో ఉత్సాహంగా ప్రార్థన పండుగలలో ప్రార్థనలో గడిపారు.

## తెలంగాణ ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ ను చంచల్ గూడ జైల్లో పరామర్శించిన రాహుల్ గాంధీ

**హైదరాబాద్ మే 07 (ప్రజామంటలు):** ఇటీవల ఉస్మానియా యూనివర్సిటీలో ఎన్ఎస్‌యూఐ నిర్వహించిన నిరసనలో భాగంగా ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు మరియు కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి బల్మూర్ వెంకట్ తో సహా 17 మందితో కూడిన ఎన్ఎస్‌యూఐ బృందాన్ని 14 రోజుల రిమాండ్ పై చంచల్ గూడ జైల్లో నిర్బంధించిన విషయం విధితమే. రాహుల్ గాంధీ



తెలంగాణ రాష్ట్ర పర్యటనలో భాగంగా ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ బల్మూరి బృందాన్ని శనివారం రోజు చంచల్ గూడ జైల్లో సిఎల్పీ నాయకులు బట్టి విక్రమార్క తో కలిసి వారికి అండగా తానుంటానని బరోసానివ్వడం జరిగింది.

## విద్యుత్ ప్రమాదాల నివారణకు అప్రమత్తంగా ఉండండి

### - విద్యుత్ ఏడీఈ వరుణ్ కుమార్

**గొల్లపల్లి మే 07 (ప్రజామంటలు):** గొల్లపల్లి మండలము లోని విద్యుత్ సిబ్బంది లైన్లలో, స్తంభాలపై పనులు చేసేటప్పుడు అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకొని ప్రాణాలు కాపాడుకోవాలని గొల్లపల్లి ఏడీఈ పి. వరుణ్ కుమార్ విద్యుత్ కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ రోజు గొల్లపల్లి మండల%శీ% రైతు వేదిక లో సబ్ డివిజన్ స్థాయి విద్యుత్ భద్రతా వారోత్సవాల్లో భాగంగా విధ్యుత్ ఉద్యోగులు, రైతులనుద్దేశించి ప్రసంగిస్తూ విద్యుత్ ప్రమాదల నివారణకు తగిన సూచనలు



మరియు ఏఏ జాగ్రత్తలు తీసుకోవాలో సూచించారు. రైతులు ఎవరు కూడా అధీకృత సిబ్బంది లేకుండా ట్రాన్స్ఫార్మర్ ముట్టుకోరాదు, విధ్యుత్ సంబంధ పనిచేయరాదని కోరారు. మరియు పనిచేటపుడు ఎర్త్ రాడ్ తప్పనిసరి వాడవలెను, ఉద్యోగులు పని చేసేటపుడు సెల్ ఫోన్ మాట్లాడరాదని సూచించారు. జనసమ్మర్థ ప్రాంతాల్లో ఉన్న ట్రాన్స్ఫార్మర్స్ కు కంచెలు ఏర్పాటు చేయమని, మూగజీవాలు ప్రమాదబారిన పడకుండా ట్రాన్స్ఫార్మర్స్ గద్దెలు ఎత్తు పెంచమని ఏఈ లను ఆదేశించారు. ఈ సందర్భంగా సిబ్బందికి హాండ్ గ్లౌజ్ లు పంచడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఏఈ లు శ్రీనివాస్, మునిందర్, ఇంచార్జ్ ఏఈ లు మహేష్, భాస్కర్, 4 సెక్షన్ల సబ్-ఇంజనీర్లు, గొల్లపల్లి సబ్ డివిజన్ విద్యుత్ సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు.

## సామాజిక ఉద్యమ నాయకులు జే. పరశురామ్‌కు గౌరవ డాక్టరేట్

**జనగామ మే 07 (ప్రజామంటలు):** సామాజిక ఉద్యమ నేత కరెన్సీపై అంబేద్కర్ ఫోటో సాధన సమితి జాతీయ అధ్యక్షులు జేరిపోతుల పరుశురామ్ కు గౌరవ డాక్టరేట్ లాస్ ఎంజల్స్ (ఎల్ ఎ) అమెరికా యూనివర్సిటిలో శనివారం హైదరాబాద్ తెలుగు యూనివర్సిటీలో డాక్టర్ డేవిడ్ జాన్ ఇచ్చారు. జనగామ పట్టణానికి జేరిపోతుల పరుశురామ్ విద్యార్థి, యువజన, దళిత బహుజన, వికలాంగుల కవి కళాకారుడిగా సంఘాలలో కేంద్ర రాష్ట్ర బాధ్యతలు తీసుకొని వారి సమస్యల సాధనకై ఎన్నో ప్రజా ఉద్యమాలను చేపట్టారు. కళా వేదిక అభివృద్ధి సేవా సంస్థను స్థాపించి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల చే ఎన్నో అవార్డులు అందుకున్నారు. ప్రధానంగా కరెన్సీపై డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఫోటోను ముద్రించాలని గణతంత్ర దినోత్సవ వేడుకల్లో అంబేద్కర్ చిత్రపటాన్ని పెట్టాలని కరెన్సీపై అంబేద్కర్ ఫోటో సాధన సమితి స్థాపించి పల్లె నుండి ఢిల్లీ వరకు పాదయాత్ర ప్రజా చైతన్య యాత్ర సభలు సమావేశాలు సదస్సులు నిర్వహించి పార్లమెంట్లో కూడా అమలాపురం ఎంపీ చింత అనురాధ చే మాట్లాడించారు. సామాజిక సేవలను గుర్తించి గౌరవ డాక్టరేట్ ను ఇవ్వడం చాలా సంతోషంగా ఉందన్నారు జేరిపోతుల పరుశురామ్.



ఆయన మాట్లాడుతూ.... సాంఘిక న్యాయం, ఆర్థిక న్యాయం, రాజకీయ న్యాయం, జరిగినప్పుడే ఈ దేశంలో సమానత్వం వస్తుందని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చెప్పారు. వారి ఆశయాలను ముందుకు తీసుకు పోవడమే నా జీవిత ఆశయమని అన్నారు.

## నాగరాజు హంతకులను కఠినంగా శిక్షించాలి

**మల్యాల మే 07 (ప్రజామంటలు):** మతోన్మాదుల గుండాల చేతిలో హత్యకు గురైన దళిత యువకుడు నాగరాజు హంతకులను కఠినంగా శిక్షించాలని మల్యాల మండల అంబేద్కర్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్రంలో తెరాస ప్రభుత్వం ఎంఐఎం దోస్తిలో ఎక్కడో ఒక చోట ప్రతి రోజు దళితులపై అత్యాచారాలు, దాడులు జరుగుతున్నాయని అవేదన వ్యక్తం చేశారు. నాగరాజు దళితుడు ఐనందుకే హత్యకు గురయ్యాడని ఇంతటి పాశవిక హత్యకు ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. నాగరాజు హంతకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నాగరాజు కుటుంబానికి ప్రభుత్వం వెంటనే కోటి రూపాయల తక్షణ సహాయాన్ని అందించాలన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇంటితోపాటు అతని కుటుంభంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మల్యాల మండలాధ్యక్షులు మారంపెల్లి లక్ష్మణ్, వార్డు సభ్యుడు శనిగరపు తిరుపతి, ఉపాధ్యక్షులు జవాజి శంకర్, సంయుక్త కార్యదర్శి ముప్పారపు రవీందర్, పూడూరి గంగస్వామి, కొత్తూరి చంద్రయ్య, గడ్డం శంకర్, అంజయ్య, గుడిసె రవి, కొత్తూర్ ఆనంద్, గుడిసె రాజయ్య, రాజేశం తదితరులు పాల్గొన్నారు.



లయన్ పులిగిల్ల సోమరాజు కూతురు వాణి శివశంకర్ దంపతుల కుమారుడు అద్వైత ఈసాన్ పుట్టినరోజు సందర్భంగా లయన్స్ క్లబ్ డైమండ్స్ జనగామ అధ్వర్యంలో స్థానిక బస్టాండ్ చౌరస్తాలో అల్పాహారం వితరణ లో పాల్గొన్న అధ్యక్షుడు లయన్ గట్టు శ్రీనివాస్, లయన్ పులిగిల్ల సోమరాజు నాగమణి, లయన్ గొడిశాల శివరామకృష్ణ, ఈరుకుల శ్రీనివాసులు నంగునూరి లక్ష్మీనారాయణ, సంతోష్ దినేష్ బజాజ్.



18వ డివిజన్లో రేపటి నుండి జరిగే శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి పట్నాలులో భాగంగా జోగు ఎత్తుడు కార్యక్రమానికి నగర మేయర్ యాదగిరి సునీల్ రావు ఇంటికి ఎల్లమ్మ తల్లిని బైండ్ల పూజారులతో తీసుకెళ్లి వాళ్ళ కుటుంబాలు చల్లగా ఉండాలని దీవించడం జరిగింది. పాల్గొన్న 18వ డివిజన్ కార్పొరేటర్ సుధగోని మాధవి-కృష్ణగౌడ్, గౌడ సంఘం కులస్తులు

## 2 గుడులకు వెలుతురు నిచ్చిన దాత 'పొన్నం ఆంజనేయులు'

**గొల్లపెల్లి మే 07 (ప్రజామంటలు):** మండలంలోని ఇబ్రహీంనగర్ గ్రామంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి మరియు బొంబాయి పోచమ్మ రెండు గుడులకు వెలుతురు నిమిత్తం రెండు పోల్స్ మరియు వైర్‌కు మొత్తం 20,000 ఇవ్వడానికి



దాత పొన్నం ఆంజనేయులు ముందుకు రావడంతో పోల్స్ వేయడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ నేరెళ్ల గంగారెడ్డి వారికి వారి యొక్క కుటుంబానికి కృతజ్ఞతలు తెలియజేసారు. కార్యక్రమంలో వడ్లకొండ లక్ష్మీనారాయణ, కటకం రమేష్ పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలపై సమీక్ష సమావేశం

**హుస్నాబాద్ మే 07 (ప్రజామంటలు):** హుస్నాబాద్, అక్కనపేట, కోహెడ మండల అధికారులు, సెంటర్ ఇంచార్జి లతో కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలపై సమీక్ష సమావేశం నిర్వహించిన హుస్నాబాద్ ఆర్డిఓ జయచంద్రారెడ్డి. వడ్ల కొనుగోలు కార్యక్రమంలో ఆర్.డి.ఓ. మాట్లాడుతూ.... కొనుగోలు కేంద్రాలలో కల్పించాల్సిన కనీస సౌకర్యాలు, గున్నీ సంచుల కొరత,



రవాణా సౌకర్యం, మరియు లోడింగ్, అన్లోడింగ్ సమయంలో ఏర్పడే సమస్యలు, తూకంలో ఎటువంటి మోసం జరగకుండా చూడాలని, హమాలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, తాగునీరు, అందుబాటులో ఉంచాలని, కొనుగోళ్లు వేగవంతం చేయాలని, ఇతరత్రా సమస్యలకు తగు పరిష్కారాలు తెలియచేయడం జరిగింది. అలాగే ఇందులో పాల్గొన్న వారికి వారివారి భాద్యతలను సవివరంగా తెలియచేసారు. ఇట్టి కార్యక్రమంలో అక్కనపేట, హుస్నాబాద్, కోహెడ, మండలాల ఎమ్మార్వో లు, ఎంపీఓ లు, ఆర్ఐ లు, పంచాయతీ సెక్రెటరీలు, డిటి సివిల్ సప్లై, మిల్ సెట్టింగ్ ఆఫీసర్లు, ఏఈఓ లు, ఐకెపి ఏపీఎం లు, టీ ఏసీలు, సీఈవో లు, సెంటర్ ఇంచార్జ లు పాల్గొన్నారు.

# అయ్యా కలెక్టర్ సారు.. మా కాలేజీ....ఇటా..అటా..?

**పట్టించుకోని డి ఐ ఈ ఓ, మామూళ్ల మత్తులో సూపర్డెంట్ సారూ..!**

**విద్యార్థుల భవిష్యత్తుకు స్పందన కరువు.**

**విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్న యాజమాన్యం**

**హుస్నాబాద్ మే 07 (ప్రజామంటలు):** సీఎం జిల్లా సిద్దిపేట జిల్లాలో అతి పెద్ద నియోజకవర్గమైన హుస్నాబాద్ నియోజకవర్గంలో వికాస్ ఒకేషనల్ జూనియర్ కళాశాల విద్యాశాఖ నిబంధనలు తుంగలో తొక్కి విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్న జిల్లా కళాశాల విద్య అధికారులు.. మామూళ్లకు అలవాటుపడి షిఫ్టింగ్ అనుమతి ప్రభుత్వం రాకముందే బిల్డింగ్ మార్చుకోవాలని కళాశాల యజమానులకు హుకుం జారీ చేసిన ఉన్నతాధికారులు .. నిన్న అనగా శనివారం రోజున కొన్ని వార్తా పత్రికలలో విద్యార్థి సంఘం నాయకుల ఆధ్వర్యంలో ప్రచురితమైన విషయం విదితమే.

కానీ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న జిల్లా ఇంటర్మీడియట్ విద్య అధికారి.. చొరవ తీసుకోకపోవడం పట్ల అంతర్యం ఏమిటో.. అర్థం చేసుకోవాలని విద్యార్థి సంఘ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యా సంవత్సరం పూర్తి కాకమునుపే, అంతేకాకుండా వార్షిక పరీక్షలు పూర్తి కాకముందే, కళాశాల మార్పిడి జరుగుతుంటే రాష్ట్ర విద్యాశాఖ అధికారులు నిద్ర పోతున్నారా? అని రాష్ట్ర గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి భాస్కర్ నాయక్ ప్రకటనలో



రాష్ట్ర గిరిజన విద్యార్థి సంఘ ఉపాధ్యక్షుడు జి భాస్కర్ నాయక్



గిరిజన విద్యార్థి సంఘం మండల అధ్యక్షుడు భూక్యా రమేష్ నాయక్

తెలిపారు. ఇప్పటికైనా ప్రత్యేక చొరవ తీసుకొని కళాశాలల గుర్తింపు రద్దు చేయాలని కోరుతున్నట్లు తెలిపారు.

లేని ఎడల పెద్ద ఎత్తున రాస్తారోకోలు చేపడతామని హెచ్చరిస్తున్నట్లు మండల గిరిజన విద్యార్థి అధ్యక్షుడు రమేష్ నాయక్ తెలిపారు.

## ఐకెపి సెంటర్లను సందర్శించిన బిజెపి ఎమ్మెల్యే రఘునందన్ రావు

**జనగామ మే 07 (ప్రజామంటలు):** జనగామ జిల్లా గానుగుపాడు వెంకిర్యాల వడ్లకొండ గ్రామాలలో ఐకేపీ సెంటర్లలో వడ్ల కొనుగోలు కేంద్రాలను సందర్శించిన అనంతరం భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో దుబ్బాక శాసన సభ్యులు రఘునందన్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన



మాట్లాడుతూ.... 'ఎద్దు ఏడ్చిన వ్యవసాయం, రైతు ఏడ్చిన రాజ్యం' చరిత్రలో ఎప్పుడూ బాగుపడదని, ఐకేపీ సెంటర్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను చాలా ఆలస్యంగా ఏర్పాటు చేయడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రైతుల వద్ద యుద్ధప్రాతిపదికన ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. దేశానికి అన్నం పెట్టే రైతు అన్నమో రామచంద్ర అని అడుక్కునే పరిస్థితికి ఈ రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చిందని దీనికితోడు అతివృష్టి, అనావృష్టి వలన రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రైతులకు బాసటగా భారతీయ జనతా పార్టీ రైతు సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జనగామ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఆరుట్ల దశమంత రెడ్డి కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు, కొండపల్లి శ్రీధర్ రెడ్డి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కెవిఎల్ఎన్ రెడ్డి సరికొండ విద్యాసాగర్ రెడ్డి ఉడుగుల రమేష్, గాడిపెల్లి ప్రేమలత రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు సౌడ రమేష్, శివరాజ్, యాదవ వెంగళ రావు, దేవర ఎల్లయ్య, జిల్లా ఉపాధ్యక్షులు మహేందర్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు సోమిడి వెంకట్ రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు గుజ్జుల నారాయణ, యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు మహిపాల్, పెద్దోజు జగదీష్, వివిధ మండలాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమ ఆకాంక్షలు నెరవేరుస్తున్నాం

**- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్**

**జగిత్యాల మే 07 (ప్రజామంటలు):** దశాబ్దం న్నరపాటు అనేక ఉద్యమాలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం ఉద్యమ ఆకాంక్షల మేరకు ప్రజా ప్రయోజనాల దిశగా పని చేస్తోందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో బీసీ స్టడీ సర్కిల్ మంజూరుకు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కృషి చేసినందుకు టీ బీసీ జే ఏసి జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కు కృతజ్ఞత సమావేశం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో



నిర్వహించారు. టీ బీసీ జే ఏసి రాష్ట్ర అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కు పుష్ప గుచ్చాలు అందించి ఘన%శీ%గా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో ప్రభుత్వం నీళ్ళు,నిధులు నియామకాల్లో సంపూర్ణ న్యాయం దిశగా దూసుకుపోతోందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఉద్యోగాల ప్రకటన చేసిన తరువాత ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీకి నోటిఫికేషన్స్ వరుసగా విడుదల అవుతున్న దృష్ట్యా, జిల్లా కేంద్రంలో ఇదివరకే ఎస్సీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేశామని, బీసీ సంక్షేమ మంత్రి గంగుల కమలాకర్ దృష్టికి తెచ్చిన మేరకు జిల్లా కేంద్రంలో బీసీ స్టడీ సర్కిల్ ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు.

టీ బీసీ జే ఏసి రాష్ట్ర అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ.... పోటీ పరీక్షల కోసం శిక్షణ కోసం నిరుద్యోగులు పట్టణాల కు వెళ్లి వ్యయ ప్రయాసలు పడుతున్నందున ఎమ్మెల్యే సంజయ్ కుమార్ స్పందించి బీసీ స్టడీ సర్కిల్ జిల్లాకు మంజూరు చేయించడం నిరుద్యోగులకు ఊరట నిచ్చిందన్నారు. గత 40 ఏళ్లలో జరుగని అభివృద్ధి ఎమ్మెల్యే కృషితో జరుగుతోందన్నారు. మెడికల్ కాలేజీ, సమీకృత మార్కెట్ మంజూరు తదితర అంశాలను ప్రస్తావించి తమ సంఘాల తరపున ధన్యవాదాలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్,రాష్ట్ర టీ బీసీ జే ఏసీ ప్రధాన కార్యదర్శి బండారి విజయ్, యువజన జేఏసీ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు కూసరి అనిల్ కుమార్, ప%శీ%బాల రాం కుమార్, టీ బీసీ జే ఏసి మహిళ జిల్లా అధ్యక్షురాలు కస్తూరి శ్రీమంజరి, రైతు విభాగం పట్టణ అధ్యక్షుడు బండారి నరేందర్, టిఆర్ఎస్ పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆనంద రావు, నిరుద్యోగ జేఏసి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు దోనూరి భూమచారి, టీ బీసీ సంక్షేమ, యువజన, మహిళా, విద్యార్థి, నిరుద్యోగ, జేఏసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నియమాలు పాటించని వారిని సీసీ కెమెరా ల ద్వారా గుర్తించి ఈ-చాలన్ విధింపు

**జిల్లా ప్రజలు ట్రాఫిక్ నియమాలు పాటించి పోలీస్ వారికి సహకరించాలి : ఎస్పీ సింధు శర్మ**

**జగిత్యాల మే 07 (ప్రజామంటలు):** ట్రాఫిక్ నియమ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను నడుపుతున్న వాహనదారులకు విదిస్తున్న ట్రాఫిక్ ఈ-చాలన్స్ ఇక ను%శీ%డి సిసి కెమెరాల ద్వారా కూడా



గుర్తించి జరిమానాలు విధించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ సింధు శర్మ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.... నేరాల నియంత్రణ కోసం జిల్లాలో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల అన్నిటి జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ కి అనుసంధానం చేయడం జరిగింది. ఈ యొక్క కమాండ్ కంట్రోల్ ద్వారా ట్రాఫిక్ నియమాలను అతిక్రమించిన వారిని గుర్తించి జరిమానాలు విధించడం జరుగుతుంది అన్నారు. ట్రాఫిక్ మొబైల్ ఎక్సిబిషన్ వ్యాన్ ద్వారా ప్రజలకు ట్రాఫిక్ నియమాలపై, రోడ్డు ప్రమాదాల నివరణ గురించి ప్రతి రోజు ఒక గ్రామంలో అవగాహన కలిపిస్తున్నామని అన్నారు. వాహనాలదారులు వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్, సీటు బెల్టు ధరించాలని సూచించారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలను, ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీస్ శాఖ వారికి సహకరించాలని కోరారు. వాహనదారులు తమ యొక్క వాహనాలపై ఉన్న ట్రాఫిక్ ఈ- చాలన్స్ ను సకాలంలో చెల్లించాలని కోరారు. మూడు కంటే ఎక్కవగా ట్రాఫిక్ ఈ-చాలన్స్ పెండింగ్ లో ఉన్న వాహనాలు జిల్లా వ్యాప్తంగా గుర్తించడం జరిగిందని సదరు వాహనదారులు సకాలంలో తమ యొక్క పెండింగ్ ఈ-చాలాన్స్ ను చెల్లించ లేని పక్షంలో సదరు వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ యొక్క కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రూపేష్ ఐపీఎస్, టౌన్ ఇన్స్పెక్టర్ కిషోర్, ఐటీ కోర్ ఇన్స్పెక్టర్ సరిలాల్, ట్రాఫిక్ ఎస్.ఐ రాము మరియు సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రెస్ క్లబ్ నిర్మాణంలో భాగస్వామినవుతా జడ్పీటీసీ వంగ రవి

**భీమదేవరపల్లి మే 07 (ప్రజామంటలు):** మండల పరిధిలో పని చేస్తున్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు, ప్రెస్ క్లబ్ భవన స్థలం విషయమై భీమదేవరపల్లి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం జడ్పీటీసీ వంగ రవితో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులకు, ప్రజలకు మధ్య జర్నలిస్టులు వారధిగా ఉండాలన్నారు. హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్ కుమార్, జడ్పీ ఛైర్మన్ డా. సుధీర్ కుమార్‌ల సహకారంతో ప్రెస్ క్లబ్ నిర్మాణం కోసం స్థలం కేటాయించి నిర్మాణానికి సహకారాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు. అలాగే మండలంలో ఏందరో జర్నలిస్టులు కేవలం వృత్తిని నమ్ముకొని జీవిస్తున్నారని తప్పకుండా అందరికీ ఇండ్ల స్థలాల కోసం ముందు వరుసలో ఉంటానని హామీ ఇచ్చారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు తాళ్ళపల్లి సురేందర్ ఆధ్వర్యంలో కార్యవర్గానికి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ములుకనూర్ సర్పంచ్ ప్రెస్ కొమురయ్య మాట్లాడుతూ.. కనీసం ఈ నూతన కార్యవర్గమైనా సీరియస్ గా స్పందించి ప్రెస్ క్లబ్ నిర్మాణం కోసం చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే ప్రెస్ క్లబ్ కార్యవర్గం చిత్తశుద్ధి, అంకితభావంతో పనిచేయాలని ఆయన కోరారు. మార్పాటి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రొఫెషనల్ సంస్థలో విష సంస్కృతి మంచిది కాదన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే రవిశంకర్

**కొడిమ్యాల మే 07 (ప్రజామంటలు):** కొడిమ్యాల మండల కేంద్రంలో ఐకేపీ సెంటర్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ను చొప్పదండి శాసనసభ్యులు సుంకే రవిశంకర్ ప్రారంభించారు. అనంతరం రామ్ సాగర్ లో ఐకెపి సెంటర్ కొనుగోలు కేంద్రము, మరియు డబ్బు తిమ్మయ్య పల్లి గ్రామంలో పిఎసిఎస్ ఆధ్వర్యంలోని



కొనుగోలు సెంటర్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి ప్రశాంతి, మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు పునుగోటి కృష్ణ రావు, కొడిమ్యాల గ్రామ సర్పంచ్ ఏలేటి మమత, కొడిమ్యాల సింగిల్విండో చైర్మన్ రాజ నర్సింగరావు, టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పులి వెంకటేష్, అంకం రాజేశం, కొత్తూరు స్వామి, కొలపురం రమేష్, గడ్డం లక్ష్మారెడ్డి, దీకొండ చంద్రశేఖర్, మొగిలి రాకేష్, సుంకే నరేష్, నసీరుద్దీన్, గుండు రాజ్ కుమార్, టిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ఐకెపి అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో టెన్త్ విద్యార్థులకు ఎగ్జామ్ కిట్ పంపిణీ

**పాపన్నపేట మే 07 (ప్రజామంటలు):** హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్, 'హైదరాబాద్' ఆధ్వర్యంలో పాపన్నపేట మండల పరిధిలో ఉన్న యూసఫ్ పేటలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న 60 మంది విద్యార్థులకు ఎగ్జామ్ కిట్ ను పంపిణీ చేసినట్టు ట్రస్ట్ కో ఆర్డినేటర్ మూడే రవి నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమం ముఖ్య అతిథులుగా దాత కొమరవోలు శ్రీనివాస్ చేతులు మీదుగా విద్యార్థులకు ఎగ్జామ్ కిట్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి శ్రీనివాస్ మాట్లాడుతూ.... రెండు సంవత్సరాల తర్వాత పదో తరగతి ఎగ్జామ్స్ నడుస్తుంది కాబట్టి పిల్లలు బాగా చదివి ఎగ్జామ్ రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణత అవ్వాలని,ప్రతి విద్యార్థి విద్యార్థి దశ నుండే సామాజిక బాధ్యతను అలవర్చు కోవాలని విద్యార్థులను సూచించారు. ప్రధానోపాధ్యాయులు నాగరాజు మాట్లాడుతూ.... నిన్న నుంచి ప్రీ ఫైనల్ ఎగ్జామ్ తో పాటు ఈ నెల 23వ తేదీ నుంచి 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు జరుగుతున్నందున విద్యార్థులకు అవసరమయ్యే ఎగ్జామ్ కిట్ ను (ఎగ్జామ్ ప్యాడ్, జామెంట్రీ బాక్స్, లాంగ్ స్కేల్, బాల్ పెన్, పెన్సిల్, షాప్నర్, ఎరేజర్) లను అందిస్తున్నారు. కాబట్టి ఈ సహాయం అందిపుచ్చుకొని మంచి ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులకు సూచించారు. దాతలు మా పాఠశాలను సందర్శించి విద్యార్థులు సహాయం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు హీరాలాల్, వినోద్ కుమార్, సామ్య నాయక్ ట్రస్టు సభ్యులు, లింగ రావు, పెద్దిరాజు, డి.పి రావు, విష్ణు, స్కూల్ చైర్మన్ శివరాములు పాల్గొన్నారు.

## ఈనెల 9న బ్యాటరీ ట్రై సైకిల్స్, కాలిపర్స్, కృత్రిమ అవయవాల కొరకు ఎంపిక శిబిరం

**జనగామ మే 07 (ప్రజామంటలు):** ఈనెల 9వ తేదీన బ్యాటరీ ట్రై సైకిల్స్ ,కాలిపర్స్ , కృత్రిమ అవయవాల కొరకు ఎంపిక శిబిరాలు నిర్వహిస్తున్నందున దివ్యాంగులు తప్పనిసరిగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ సిహెచ్ శివలింగయ్య తెలిపారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఉదయం 10:00 గంటలనుండి సాయంత్రం 5:00 గంటల వరకు నిర్వహిస్తున్నందున అంగవైకల్యం కలవారు హాజరు కావాలన్నారు. బ్యాటరీ ట్రై సైకిల్ ఎంపికలో వికలాంగులు తమ వైకల్యం శాపం 80% పై ఉండాలని, 16 సంవత్సరాల పైబడి కుటుంబ వార్షిక ఆదాయం రూ. 1,80,000 లకు మించకుండా ఉండాలన్నారు. కాలిపర్స్ ఎంపికలో శారీరక దివ్యాంగులు కోల్పోయిన కాళ్లు కృత్రిమంగా అమర్చేందుకు కొలతలు తీసుకోబడతాయని తదుపరి వాటిని తయారు చేసి అమర్చుట కు మరొక శిబిరం ఏర్పాటు చేయబడుతుందని తెలియజేశారు. అర్హులైన దివ్యాంగులు తమ ఆదాయ ధ్రువీకరణ పత్రం తో పాటు ఆధార్ కార్డు, వైకల్య (సదరం) ధ్రువీకరణ పత్రము, 3పాస్ పోర్ట్ సైజు ఫోటోలతో శిబిరానికి హాజరు కావాలని అర్హత లేని ఇతర శారీరక దివ్యాంగులు, ఇతర కేటగిరి దివ్యాంగులు శిబిరానికి హాజరు కావద్దని విజ్ఞప్తి చేశారు. ఇతర వివరాలకు జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయం ఫోన్ నెంబర్ 9573139411ను సంప్రదించాలని తెలియజేశారు.

## కళ్యాణలక్ష్మి చెక్కులు తీసుకొని ఎమ్మెల్యేకు చక్కెర కుడుకలు పోసిన ఆడ బిడ్డలు

**తిమ్మాపూర్ మే 07 (ప్రజామంటలు):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేయడానికి లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లిన ప్రజా నాయకుడు, మానకొండూర్ శాసనసభ్యులు డా. రసమయి బాలకిషన్ పై ఉన్న తమ అభిమానాన్ని చాటుకున్నారు తిమ్మాపూర్ మండలంలోని ఆడబిడ్డలు. తొలిపొద్దు కార్యక్రమంలో భాగంగా వేకువ జామునే ఉదయం 5.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు అల్గునూర్, మహాత్మానగర్, కొత్తపల్లి, రేణికుంట, గొల్లపల్లి, లక్ష్మీదేవిపల్లి, నేదునూర్, వచ్చునూర్, రాంహనుమాన్ నగర్ గ్రామాల్లో ఎమ్మెల్యే రసమయి విస్తృతంగా పర్యటించారు. ఆయన నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి కళ్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. ఈసంధర్బంగా ఆయా గ్రామాల్లోని ఆడబిడ్డలు చెక్కులు స్వీకరించి, రసమయికి చక్కెర కుడుకలు పోసి అన్నా చెల్లెళ్ళ అనుబంధాన్ని చాటుకోగా, ఎమ్మెల్యే తన తోబుట్టు లాంటి ఆడబిడ్డలకు చీరలను కానుకలుగా అందజేశారు. మీ తోడ పుట్టిన అన్నలాగా మీ అభిమానాలు నాపై ఎల్లప్పుడూ ఉండేలా దీవించండి చెల్లెల్లారా అంటూ ఎమ్మెల్యే రసమయి మహిళల ఆశీస్సులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, ఆయా గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## అమ్మ ప్రేమ పాట

పల్లవి:
అమ్మ ప్రేమను మించిన అమృతమున్నదా
ఈ అవనిలోన
కన్నతల్లి కన్న గొప్పదనమే మనకు ఉందా
ఈ భువిలోన ఈ అవనిలోన

చరణం:
అమ్మ అనే పేరులోనే అక్షరాలు రెండు
అమ్మ పంచే ప్రేమ మాత్రం అనంతమైనది అమోఘమైనది
చరణం:
చిన్న గాయం తాకితేనే సొమ్మసిల్లితావమ్మ
గింత మాట అనకుండా గుండెల్లో దాచుకుంటావమ్మ
చరణం:
బాధపడి కూర్చుంటే ఓదార్చుతావమ్మ
గుండె పగిలి నేనుంటే గుండె నిబ్బరాన్ని ఇచ్చు నమ్మ
చరణం:
అన్నిటిలో కల్తీ నిండుకున్నదమ్మ
నీ కమ్మనైన ప్రేమ కల్తే లేదమ్మా, కలతే రాదమ్మ
చరణం:
ఆపదలో నేనుంటే ఆదుకుంటావమ్మ
బాధల గాధలలో సగభాగమైతావమ్మ
చరణం:
అలసిపోయి నేనోస్తే సేవలెన్నో చేస్తవమ్మ
సొలసి పోయి నేనుంటే సేవలు ఎన్నో చేస్తావమ్మ
చరణం:
తప్పు చేసి నేనోస్తే కడుపులో దాచుకుంటావమ్మ
ఒప్పుచేసి నేనోస్తే గొప్పోడని చెప్పుకుంటా వమ్మ
చరణం:
9 నెలలు నన్ను కనిపెంచితివమ్మా
పెంచి పోషించి పెద్దోని చేస్తివమ్మ
చరణం:
ప్రబుద్ధుడు కావాలని పాఠశాలకు పంపితివమ్మ
ప్రయోజకుడు కావాలని పదే పదే చెప్పితివి వమ్మ
చరణం:
తీపికన్నా తీయనిది తల్లి ప్రేమేనమ్మ
అమృతం కన్న మిన్నఅమ్మ ప్రేమేనమ్మ
చరణం:
ఏ జన్మ పుణ్యమేనమ్మ
నీవు పంచిన ప్రేమ పెంచిన ప్రేమ అమ్మ
జన్మజన్మలకు నీకే రుణపడి ఉంటా నమ్మ
మళ్లీ జన్మంటూ ఉంటే మా అమ్మ గానే రావమ్మ



రచన:
జనగామ శంకర్,
తెలంగాణ సాంస్కృతిక సారథి, కవి, గాయకులు
కొత్తపల్లి, జనగామ జిల్లా.
ఫోన్ నంబర్ : 98665 35732

# ఆమె జీవితం అందరికీ ఆదర్శం..
# అమ్మను మించిన దైవం లేదు...

(మాతృ దినోత్సవం సందర్భంగా ప్రజామంటలు ప్రత్యేక కథనం)

(కొక్కుల వంశీ, ప్రజామంటలు రుద్రంగి రిపోర్టర్)

ఆకాశాన్ని అడిగితే చెబుతుంది అమ్మ ప్రేమ తన కంటే విశాలమైందని.. సాగరాన్ని అడిగినా చెబుతుంది అమ్మ మనసు కన కంటే లోతైనది అని.. కొండ తేనేను అడిగితే చెబుతుంది అమ్మ మమత తన కంటే తియ్యగా ఉంటుందని.. తియ్యని రాగాలు పలికే కోయిలను అడిగినా చెబుతుంది.. అమ్మ పిలుపు తన పాట కంటే అద్భుతమైనదని.. కొవ్వొత్తిని అడిగితే చెబుతుంది..
అమ్మ త్యాగం తన కంటే కోటి రెట్లు ఎక్కువని.. భూదేవిని అడిగినా చెబుతుంది.. అమ్మ అంటేనే ఓర్పు అని.. ఓర్పు అంటేనే అమ్మ అని.. అందుకే ఈ సృష్టిలో అమ్మే గొప్పది.. అమ్మ కన్నా మిన్న ఎవ్వరూ లేరు' అని కొందరు కవులు, మేధావులు చెబుతుంటారు. అయితే అమ్మ గురించి మనం ఎంత మాట్లాడినా తక్కువే అవుతుంది. అంత కమ్మనిది అమ్మ ప్రేమ. కడుపులో నలుసు పడిన నాటి నుండి తొమ్మిది నెలల పాటు ఎంతో సహనంతో.. ఎన్నో అడ్డంకులను ఎదుర్కొని తన రక్త మాంసాలు పంచి పునర్జన్మనెత్తుకుంటుంది. అయితే అప్పటివరకు పడిన పురిటినొప్పులను కాస్త.. బిడ్డ ఒడిలో పడిన వెంటనే మరచిపోతుంది. వీటన్నింటి సంగతి పక్కనబెడితే. ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా మదర్స్ డే ఎందుకు జరుపుకుంటారు.. ఎప్పుడు జరుపుకుంటారు.. అనే ఆసక్తికరమైన విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం.
ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం మే మాసంలోని రెండో ఆదివారం నాడు మాతృ దినోత్సవం (మదర్స్ డే ) జరుపుకుంటారు. అయితే తల్లుల దినోత్సవం జరుపుకోవడం వెనుక ఓ పెద్ద చరిత్ర మరియు ఓ నేపథ్యం ఉంది.

**మదర్ ఆఫ్ గాడ్స్....**
గ్రీస్ దేశంలో 'రియా' అనే దేవతను 'మదర్ ఆఫ్ గాడ్స్'గా భావించి సంవత్సరానికి ఒకసారి నివాళి అర్పించేవారు. 17వ శతాబ్దంలో బ్రిటన్లో తల్లులకు గౌరవంగా 'మదరింగ్ సండే' పేరిట ఉత్సవాన్ని నిర్వహించేవారు. 'జూలియవర్డ్ హెూవే' అనే మహిళ అమెరికాలో 1872లో తొలిసారిగా ప్రపంచ శాంతి కోసం మదర్స్ ను నిర్వహించాలని ప్రతిపాదించిది

**మదర్స్ డే కోసం....**
అన్న మేరీ జర్విస్ అనే మహిళ 'మదర్స్ ఫ్రెండ్ షిప్ డే' జరిపించేందుకు ఎంతగానో క్రుషి చేసింది. ఆమె 1905 సంవత్సరంలో మే 9వ తేదీ మరణించగా.. ఆమె కుమార్తె మిస్ జెర్విస్ మాతృ దినోత్సవం కోసం ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేసింది. దీంతో 1914 నాటికి అమెరికాలోని అన్ని రాష్ట్రాల్లో ఈ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని అప్పటి అమెరికా అధ్యక్షుడు ఉడ్రో విల్సన్ నిర్ణయించారు.

**మాతృ దినోత్సవాన్ని.....**
ఇదే ఆనవాయితీని కాలక్రమేణా ప్రతి సంవత్సరం జరుపుకోవడం ప్రారంభించారు. అప్పటి ప్రతి ఏటా మే నెలలోని రెండో ఆదివారం మాతృ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తూ వస్తున్నారు

**ప్రత్యక్ష దైవమే అమ్మ....**
ఈ ప్రపంచంలో అత్యంత పేదవాడు అంటే డబ్బు లేని వాడు కాదు... ఎవరైతే అమ్మ ప్రేమను దక్కించుకోలేకపోతారో వారే అసలైన పేదవారు. అమ్మ ప్రేమను దక్కించుకున్నవారు అత్యంత కోటీశ్వరులు. బిడ్డను ప్రేమగా చూసే ప్రతి తల్లి 'మదర్ థెరిసా' నే అని చెప్పడంలో ఎలాంటి సందేహం అక్కర్లేదు. అమ్మ నడకతో పాటు నాగరికతనూ నేర్పిస్తుంది. అంతులేని ప్రేమానురాగాలను పంచుతుంది. ఆప్యాయతకు మారుపేరైన తల్లి 'ప్రత్యక్ష దైవమే'.



## ఈనెల 27న రెడ్ల మహా సంగ్రామ సభను విజయవంతం చేయాలి

### రెడ్డి ఐక్య వేదిక రాష్ట్ర మహిళా నాయకురాలు సంఘీత రెడ్డి

**జగిత్యాల ప్రతినిధి మే 07 (ప్రజామంటలు):** ఈనెల 27 న హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న " రెడ్ల మహాసంగ్రామఓ సభను రాష్ట్రంలోని రెడ్డి బంధువులు హాజరై విజయవంతం చేయాలని రెడ్డి ఐక్య వేదిక రాష్ట్ర మహిళా నాయకురాలు మేకల సంఘీత రెడ్డి విజ్ఞప్తి చేశారు. శనివారం జగిత్యాలలో సంఘీత రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.... 2018 సాధారణ ఎన్నికల్లో రెడ్డి కార్పోరేషన్ ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చారని అందుకనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రూ. 5000 కోట్ల నిధులతో చట్టబద్ధతతో కూడిన రెడ్డి కార్పొరేషన్ వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. హుజురాబాద్ ఉప ఎన్నికల్లో రెడ్ల ఓట్లు రాబట్టెందుకు ఆర్థిక మంత్రి హామీ ఇచ్చిన విధంగా రాష్ట్ర బడ్జెట్ లో మొండి చేయి చూపారని చెబుతూ రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈ నెల 27న రెడ్ల మహా సంగ్రామం బహిరంగ సభను హైదరాబాద్ లో ఏర్పాటు చేసి దాని ద్వారా రెడ్ల సత్తా చూపెడుతామని ఆమె హెచ్చరించారు. అలాగే వ్యవసాయం చేస్తున్న ప్రతి రైతు కుటుంబానికి 5 లక్షల వరకు ఆరోగ్య భీమా వర్తింపజేయాలని, 50 సంవత్సరాలు దాటిన ప్రతి రైతుకు నెల నెలా 5వేల పెన్షన్ ఇవ్వాలని సంఘీత రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒకటి చొప్పున జనరల్ గురుకులాలను ఏర్పాటు చేయాలన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయరంగానికి అనుసంధానం చేయాలని కోరారు. పేద రెడ్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈనెల 27న రెడ్ల మహాసంగ్రామం పేరిట నిర్వహించే హైదరాబాద్ బహిరంగ సభకు పెద్ద ఎత్తున రెడ్డి భాంధవులు స్వచ్ఛంధంగా తరలి రావాలని సంఘీత రెడ్డి పిలుపునిచ్చారు. సమావేశంలో మంజుల, మాధురి, మాధవి, రాణి, స్వరూప, వసంత రెడ్డి, రాజేందర్ రెడ్డి, మల్లారెడ్డి, రాజేశ్వర్ రెడ్డి తదితరులున్నారు.





## హుస్నాబాద్ న్యూ ప్రెస్ క్లబ్‌లో సభ్యత్వం నమోదు

**హుస్నాబాద్ మే 07 (ప్రజామంటలు):** హుస్నాబాద్ న్యూ ప్రెస్ క్లబ్ లో చిన్న, పెద్ద పత్రిక విలేకరులకు, అదేవిధంగా యూనియన్ తో సంబంధం లేకుండా సభ్యత్వ స్వీకరణ చేపట్టడం జరిగింది. జర్నలిస్టుల సమస్యలపై ప్రతి నిమిషం వెన్నంటే ఉండి నడిపించే హుస్నాబాద్ న్యూ ప్రెస్ క్లబ్ నందు సభ్యత్వం స్వీకరణ శనివారం చేపట్టడం జరిగిందని చెప్పడానికి చాలా సంతోషంగా భావిస్తున్నామని ప్రెస్ క్లబ్ అధ్యక్షులు బి. హన్మంతు అన్నారు. నియోజకవర్గంలో ఉన్న విలేకరులు గమనించాల్సిన విషయం ఏమిటంటే యూనియన్లకు సంబంధం లేకుండా నియోజకవర్గ స్థాయిలో సభ్యత్వ నమోదు చేయడం జరుగుతుంది. విలేకర్ల సమస్యల అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యల పరిష్కారానికి ప్లాట్ ఫారంగా హుస్నాబాద్ న్యూ ప్రెస్ క్లబ్ ఎప్పుడు అందుబాటులో ఉంటుందని ప్రధాన కార్యదర్శి ఎం. డి ఆదిల్ అన్నారు. దాదాపు హుస్నాబాద్ న్యూ ప్రెస్ క్లబ్ లో ఇప్పటి వరకు 80 మంది విలేకరులతో కూడుకొని హుస్నాబాద్ ప్రెస్ క్లబ్ కొనసాగుతున్నది. ఇప్పటివరకు గత కొన్ని నెలల నుంచి కొంతమంది విలేకర్ల సమస్యలు పరిష్కారం చేయబడ్డాయి. కావున హుస్నాబాద్ నియోజకవర్గ స్థాయిలో ఇంకా ఎవరైనా విలేకరులు ఉంటే వెంటనే సభ్యత్వం చేసుకోవాలని వారు తెలిపారు.

## రాహుల్ గాంధీతో సమావేశమైన కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ నేతలు

**కరీంనగర్ మే 07 ( ప్రజామంటలు):** గాంధీభవన్ లో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీతో జరిగిన ముఖ్య నేతల సమావేశానికి హాజరైన కరీంనగర్ మాజీ పార్లమెంట్ సభ్యులు పొన్నం ప్రభాకర్, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు డాక్టర్. కవ్వంపల్లి సత్యనారాయణ, రాజన్న సిరిసిల్ల జిల్లా



కాంగ్రెస్ అధ్యక్షులు నాగుల సత్యనారాయణ గౌడ్, హుస్నాబాద్, వేములవాడ, కోరుట్ల నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జిలు బొమ్మ శ్రీరాం చక్రవర్తి, ఆది శ్రీనివాస్, జువ్వాడి నరసింగారావు కలిశారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ నేతలకు పార్టీ పార్టీ పటిష్టత పై సూచనలు చేశారు, ముఖ్యంగా రాహుల్ గాంధీ విద్య, వైద్య, ఉపాధి రంగాలపై ఫోకస్ పెట్టాలని,వరంగల్ డిక్లరేషన్ అంశాలను 30 రోజుల్లోగా విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెల్లాలని, 12 ఎల్లా కుర్రాడికి కూడా వరంగల్ డిక్లరేషన్ అంశాలు చెప్పాలని, ప్రజలకోసం ఎవరైతే పని చేస్తారో వారికే టిక్కెట్లు ఇస్తామని, క్షేత్ర స్థాయి సమాచారం ఆధారంగా సీట్లు కేటాయించడం జరుగుతుందని, ఏ సమస్య ఉన్నా నాలుగు గోడల మధ్యే మాట్లాడాలి. మీడియాతో మాట్లాడేవారు పార్టీకి నష్టం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ కుటుంబం లాంటిది, సమస్యలు ఉంటే చర్చించుకుని పరిష్కరించుకుందాం. ఇష్టానుసారం మాట్లాడితే ఉపేక్షించేది లేదని, తెలంగాణలో మార్పు కోరుకునేవారు కాంగ్రెస్ లోకి రావాలని పిలుపు ఇవ్వడంతోపాటు, హైదరాబాద్ లో కూర్చుంటే సీట్లు రావని, ఢిల్లీకి అసలే రావొద్దు అని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నేతలను రాహుల్ గాంధీ హెచ్చరించారు.

## ప్రభుత్వాస్పత్రుల్లో వైసీపీ పెద్దల అవినీతి

**అంబులెన్స్ మాఫియా నడుపుతున్నారు**
**మూడేళ్లుగా నిర్లక్ష్యానికి గురవుతున్న వైద్య రంగం**
**టిడిపి ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి**

**రాజమండ్రి,మే7:** ప్రభుత్వాస్పత్రుల్లో వైసీపీ పెద్దల అవినీతి రాజ్యమేలుతోందని టిడిపి ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ధ్వజమెత్తారు. ఏపీలో వైసీపీ నేతలు అంబులెన్స్ మాఫియా నడుపు తున్నారని మండిపడ్డారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఐసీయూలో ఉన్న వైద్య రంగానికి చికిత్స అవసరమన్నారు. వైద్య రంగం మూడేళ్లుగా నిర్లక్ష్యానికి గురవుతోందని తెలిపారు. ఏపీలో మహిళలకు భద్రత లేకుండా పోయిందని గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏపీ సర్కారుపై టీడీపీ సీనియర్ నేత గోరంట్ల బుచ్చయ్యచౌదరి తీవ్ర ఆరోపణలు చేశారు. ఏపీలో జగన్ పాకుడు మెట్ల మీద ఉన్నారని.. ప్రతిరోజూ ఆయన కొద్ది కొద్దిగా దిగజారిపోతున్నారని ఎద్దేవా చేశారు. జై జగన్ కాదు.. గో బ్యాక్ జగన్ అని ప్రజలే నినాదాలిస్తున్నారని ఎమ్మెల్యే గోరంట్ల ఆరోపించారు.

ఉత్తరాంధ్రలో చంద్రబాబు టూర్ మూడు రోజుల పాటు అద్భుతంగా జరిగిందని.. ఏపీ ప్రభుత్వం ఛార్జీలతో విపరీతంగా బాదేస్తుందని ప్రజలే చెబుతున్నారని ఆయన విమర్శించారు. ఓ చేత్తో డబ్బులు ఇచ్చి.. మరో చేత్తో రెండింతలు జగన్ ప్రభుత్వం లాక్కుంటోందని మండిపడ్డారు. జగన్ హయాంలో ఐదు లక్షలు పెన్షన్లు, 12 లక్షలు రేషన్ కార్డులు రద్దయ్యాయని వివరించారు. ఏపీలో నవరత్నాలకు రంధ్రాలు పడ్డాయని గోరంట్ల బుచ్చయ్య చౌదరి వ్యాఖ్యానించారు. అమ్మఒడి కింద ప్రభుత్వం ఇచ్చే డబ్బులు సారా బుడ్డికే పోతున్నాయని ఆరోపించారు. గతంలో అందరికీ ఫీజు రీయింబర్సుమెంట్ అందించే వాళ్లమని.. ఇప్పుడు జగనన్న విద్యా దీవెన పేరుతో నిబంధనలు పెట్టారని గోరంట్ల బుచ్చయ్యచౌదరి విమర్శలు చేశారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును గెలిపించాలని ప్రజలు భావిస్తున్నారని.. వైసీపీ ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గాలతో ప్రజలు విసిగిపోయారని గోరంట్ల పేర్కొన్నారు.

ఆస్పత్రుల్లో వసతుల కోసం వైసీపీ నేతలు చందాలు అడుగుతున్నారని.. ఫ్యాన్లు కావాలన్నా.. సీలింగ్ వేయాలన్నా చందాలు తీసుకురావాలని సూచిస్తున్నారని మండిపడ్డారు. జగన్ మాటలు కోటలు దాటుతున్నాయని.. అంబులెన్స్ మాఫియాకు అధికార పార్టీ అండదండలున్నాయని ఆరోపించారు. ప్రభుత్వాస్పత్రుల్లో మందులు కూడా లేని దుస్థితి నెలకొందన్నారు. డబ్ల్యూహెచ్‌వో చెప్పిన దాని ప్రకారం ఏపీ ప్రభుత్వం కూడా భారీ ఎత్తున కరోనా మరణాలను దాచేసిందని విమర్శలు చేశారు. కరోనా వల్ల మరణించిన బాధిత కుటుంబాలకు ఇవ్వాల్సిన పరిహారం కూడా ఇవ్వలేదన్నారు. అనుమతులే రాని వైద్య కళాశాలలను కట్టేశానని సీఎం జగన్ స్వయంగా బోగస్ మాటలు చెబుతున్నారని మండిపడ్డారు. జగన్ ఓ బోగస్ సీఎం అని.. వైసీపీది ఓ ఫ్రాడ్ ప్రభుత్వం అని వ్యాఖ్యా నించారు.

## ప్రజా స్పందన లేకున్నా బాబు పాట్లు

ఎన్నికల్లో పొత్తుల కోసం వెంపర్లాట
బాబు టూర్‌పై అంబటి, విజయసాయిల విమర్శలు

**అమరావతి,మే7:** చంద్రబాబు టూర్‌లో జన స్పందన లేకపోయినప్పటికీ అద్భుత ప్రజాదరణ అంటూ ఎల్లో మీడియా బాకాలు పలుకుతోందని జలవనరుల శాఖ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి అంబటి రాంబాబు ధ్వజమెత్తారు. ప్రజల్లో అంత ఆదరణ ఉంటే చంద్రబాబు ఒంటరిగా ఎందుకు పోటీ చేయరని, అందరూ కలిసి రండి అని ఎందుకు ఆహ్వానిస్తున్నారని ప్రశ్నించారు. సింగిల్‌గా పోటీ చేసే దమ్ము లేక కలిసి పోటీ చేయడానికి వేదిక సిద్ధం చేసుకుంటున్నారని దుయ్యబట్టారు. 'పన్నులు లేకుండా ప్రభుత్వాలు నడుస్తాయా.. గతంలో చంద్రబాబు పన్నులు లేకుండానే ప్రభుత్వాన్ని నడిపారా' అంటూ ప్రశ్నించారు. నవరత్నాలు, సంక్షేమ కార్యక్రమాలు అమలు



కాకూడదని కుట్రలో భాగంగానే ఈ రాద్ధాంత మంతా చేస్తుంటే, దానికి ఎల్లో మీడియా వత్తాసు పలుకుతోందని మండిపడ్డారు. ఇదిలావుంటే వైఎస్సార్‌సీపీకి ఎవరితోనూ పొత్తు పెట్టుకోవాల్సిన అవసరం లేదనిపార్టీ ప్రధాన కార్యదర్శి, ఎంపీ విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. ఓటమి భయంతో.. ఎవరికైతే ప్రజల మద్దతు లేదనుకుంటున్నారో.. వాళ్లే పొత్తుల కోసం చూస్తున్నారంటూ టీడీపీ అధినేత చంద్రబాబుపై సెటైర్లు వేశారు. చంద్రబాబుకు ఎన్నికలలో గెలుస్తామన్న నమ్మకం లేదు. చంద్రబాబును ప్రజలు ఎప్పుడో తిరస్కరించారు. అసలు ప్రజల్లో ఆయన పట్ల విశ్వసనీయత లేదు. పైగా బాబుది దుర్మార్గపు ఆలోచన. ఎప్పుడూ ఇతరులపైనే ఆధారపడే తత్వం. పైగా వెన్నుపోటు పొడుస్తాడు అంటూ వ్యాఖ్యానించారు. టీడీపీ కార్యకర్తలు చేస్తున్న హత్యలు, అత్యాచారాలను.. ప్రభుత్వానికి అంటగడుతూ బురద జల్లుతున్నారంటూ మండిపడ్డారు. ఎవరెన్ని పొత్తులు పెట్టుకున్నా వైఎస్సార్‌సీపీ విజయాన్ని అడ్డుకోలేరన్నారు. పెరిగిన ధరలపై చంద్రబాబు అనసర రాజకీయాలు చేస్తున్నారని మంత్రి కొట్టు సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రోల్ డీజిల్ ధరలు పెరిగితే కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి గానీ, రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం పై ఆరోపణలు చేయడం సరికాదన్నారు.

అనసర రాజకీయం చేస్తూ ప్రజల మెప్పుకోసం ప్రజల్లోకి రావాని చూస్తున్నారని అన్నారు. సీఎం జగన్ లబ్ధిదారులకు నేరుగా సంక్షేమ పథకాలు అందిస్తుం టే ఓర్వలేక నీచ రాజకీయాలు చేస్తున్నారన్నారని మండిపడ్డారు. నరేంద్ర మోడీని వ్యతిరేకిస్తే చంద్రబాబు సంపాందించిన లక్ష కోట్ల రూపాయల అవినీతి బయటపడుతుందని, ప్రశ్నించడం మానేశారని ఎద్దేవ చేశారు. రాష్ట్రంలో ఎక్కడా పెట్రోల్ పై టాక్స్ పెంచలేదని, కేంద్ర ప్రభుత్వం పెంచితేనే పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయని మంత్రి కొట్టు సత్యనారాయణ స్పష్టం చేశారు. వయసు మీదపడి చంద్రబాబు ఏం చేయాలో తెలియక ఇలాంటి నీచ రాజకీయాలు చేస్తున్నారని మంత్రి కొట్టు సత్యనారాయణ మండిపడ్డారు. ఇప్పటికైనా చంద్రబాబు, జగన్ పాలనపై కాకుండా.. కేంద్రాన్ని ప్రశ్నిస్తే బాగుంటుందని. ఆ దమ్ము మీకుందా అని కొట్టు సత్యనారాయణ అన్నారు.

## ఇంగ్లీష్ మీడియం చదివితే మొద్దబ్బాయిలా

### బాబు వ్యాఖ్యలపై మండిపడ్డ హోంమంత్రి వనిత

**విజయవాడ,మే7:** ఇంగ్లీష్ మీడియంపై చంద్రబాబు వ్యాఖ్యలు దురదృష్టకరమని రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత అన్నారు. పిల్లలకు మంచి భవిష్యత్తు ఇవ్వడం కోసమే ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టామని ఆమె అన్నారు. వాళ్ల పిల్లలను విదేశాల్లో ఇంగ్లీష్ మీడియం చదివించుకోవచ్చు.. పేదలు ఇంగ్లీష్ చదువులు చదవకూడదన్నదే చంద్రబాబు రూల్ అంటూ మంత్రి మండిపడ్డారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి మాట్లాడే మాటలు ఇవ్వేనా?.ఇంగ్లీష్ మీడియం చదువుకుంటే మొద్దబ్బా యిల్లా మారతారని తమకు ఇప్పటివరకూ తెలియదు. అలా కూడా ఆలోచించవచ్చా అని ప్రతిపక్షనేత చెప్పే వరకూ తెలియదంటూ మంత్రి ఎద్దేవా చేశారు. ఈ మూడేళ్లు రాష్ట్రంలో జగన్ పాలనపై ప్రజలు సంతోషంగా ఉన్నారు. గత ప్రభుత్వాల కంటే సంతోషంగా ఉన్నామని ధైర్యంగా చెబుతున్నారు. కరోనా సమయంలో టీడీపీ నేతలు ఎక్కడున్నారో వారికే తెలియదు. ఇప్పుడేమో జనాన్ని ఉద్ధరించేస్తామని తయారయ్యారు. సీఎం జగన్‌ను పిల్లలందరూ మేనమామగా భావిస్తున్నారు. పిల్లలకు మంచి భవిష్యత్తు ఇవ్వడం కోసమే ఇంగ్లీష్ మీడియం అని మంత్రి తానేటి వనిత అన్నారు. ఇప్పటికైనా చంద్రబాబు బానిస భావజాలం నుంచి బయటపడాలన్నారు.

## నాగార్జున వర్సిటీలో జాబ్‌మేలా

### మొదటి రోజు విజయవంతంగా ముగింపు

**గుంటూరు,మే7:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో ఆచార్య నాగార్జున యూనివర్శిటీ ప్రాంగణంలో నిర్వహించిన జాబ్ మేళా మొదటి రోజు విజయవంతంగా జరిగింది. జాబ్‌మేళాలో మొదటి రోజు 142 కంపెనీలు పాల్గొనగా.. 7,473 మందికి ఉద్యోగాలు ఇచ్చాయి. 1,562 మందిని షార్ట్ లిస్ట్ చేశాయి. 373 మందికి వెంటనే ఆఫర్ లెటర్ ఇచ్చారు. మిగిలిన వారికి మెయిల్, వాట్సప్ ద్వారా అపాయింట్‌మెంట్ ఆర్డర్ పంపనున్నారు. మొదటి రోజు జాబ్ మేళా అనంతరం ఎంపీ విజయసాయిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. 'జాబ్ మేళా మొదటి రోజు విజయవంతంగా జరిగింది. నిరుద్యోగ సమస్య లేకుండా చేయాలన్న సీఎం కల సాకారం కాబోతుంది. నిరుద్యోగ యువతకు బాసటగా వాళ్ల ఇళ్ళలో వెలుగు నింపుతున్నందుకు సంతోషంగా ఉంది. ఆదివారం కూడా జాబ్ మేళా కొనసాగుతోంది. ఇవాళ 31,000 మంది యువత జాబ్ మేళాకు హాజరయ్యారు. ఉద్యోగం రాని వాళ్లు నిరుత్సాహ పడవద్దు. ఉద్యోగం వచ్చే వరకూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుంది. జాబ్ మేళాలు కొనసాగుతాయి. జాబ్ మేళా విజయవంతం అయ్యేందుకు కృషి చేసిన వారందరికీ ధన్యవాదాలు. పార్టీలో ఒక సెల్ ఏర్పాటు చేసి నిరుద్యోగులు జాబితా రూపొందించి ఉద్యోగావకాశాలు కల్పిస్తాం. పార్టీ కేంద్రకార్యాలయంలో సెల్ ఏర్పాటు చేస్తాం. ఉద్యోగాలు పొందిన వాళు కుటుంబ అభివృద్ధికి, రాష్ట్ర అభివృద్ధి కృషి చెయ్యాలి' అని ఎంపీ విజయసాయిరెడ్డి కోరారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE.
EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL/2021/81092.
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com